# సూర్య శతకము



శ్రీపాదుక

ఆచార్య కొల్లూరు అవతారశర్మ

ప్రథమ ముద్రణ - 1000 ప్రతులు

® సర్వహక్కులు రచయితవి.

వెల: యథాశక్తి/ యథామతి
(ఇచ్చిన విరాళము గ్రంథముద్రణకు మాత్రమే వినియోగించబడును)

ప్రాప్తిస్థానము :
'శ్రీపాదుక' ఆచార్య కొల్లూరు అవతారశర్మ
9-7-48, శ్రీ శంకరకృప
స్వర్ణసౌధ అపార్ట్‌మెంట్స్, గాంధీనగరం
కాకినాడ - 533 004
ఫోన్ : ఇల్లు - 0884 - 2346306
సెల్లు : 9440493951 & 8121417079

టైటిల్స్ - లేఅవుట్ డిజైనింగ్
డి.లక్ష్మి, కాకినాడ

ప్రింటింగ్ :
పద్మనాభ ఆఫ్‌సెట్ ప్రింటర్స్
డోర్.నెం. 7-2-10/7,
నాగేశ్వరరావువీధి, రామారావుపేట,
కాకినాడ-4, ఫోన్: 0884 - 6588013

శ్రీ మత్పరదేవతాయైనమః

# సూర్యశతకము

**రచన**

'సాహిత్యవిద్యాప్రవీణ' రాష్ట్రభాషాప్రవీణ'

'సంస్కృతభాషాకోవిద'

**శ్రీ పాదుక ఆచార్య కొల్లూరు అవతారశర్మ**

యం.ఏ. (సంస్కృతం), యం.ఏ (తెలుగు).,

బి.యస్.సి., బి.యిడి.,

విద్యావారిధి (పి.హెచ్.డి. శిక్షా వ్యాకరణశాస్త్రములు)

పి.హెచ్.డి. (అలంకారశాస్త్రం)

ఆంధ్రవిశ్వవిద్యాలయ స్వర్ణపతకగ్రహీత

విశ్రాంత సంస్కృతాచార్యుడు

వికృతి పుష్యశుద్ధ ఏకాదశీ స్థిరవారం

మకరసంక్రాంతి, కాకినాడ

® సర్వహక్కులు రచయితవి

# విషయ సూచిక

| | పుట |
|---|---|
| అవతారిక | i |
| మయూరకవి - సూర్యశతకము | ii |
| కృతిప్రశస్తి | iv |
| సూర్యప్రభ | 1 |
| సూర్యాశ్వాలు | 44 |
| సూర్యసారథి | 50 |
| సూర్యరథం | 62 |
| సూర్యమణ్డలం | 73 |
| సూర్యనారాణుడు | 81 |
| శ్లోకసంఖ్య | 101 |
| ఫలశ్రుతి | 102 |

# అంకితం



గీ॥ కవి మయూరుని సంస్కృత కావ్యమయిన
సూర్యశతకానువాదము సుందరముగ
షడ్జసంవాదమను పేర సంతరించి
అరసవల్లీశుకర్పింతు నంకితముగ॥

ఆచార్య కొల్లూరు అవతార శర్మ

# ఉపకారస్మృతి

గ్రంథరచన సొంతము సాగింపచేసిన **శ్రీసూర్యనారాయణస్వామి** వారికి, **సొంతము** పరిష్కరించి కృతిప్రశస్తిని అందిచ్చిన విద్వన్మిత్రులు సోదరకల్పులు **బ్రహ్మశ్రీ వింజమూరి శేషఫణిశర్మ** గారికి, గ్రంథమునకు ముఖపత్రము (Title Page) ను సమకూర్చి అందముగా తీర్చిదిద్దిన సుతనిర్విశేషురాలు **చి॥సౌ॥**లక్ష్మికి, సకాలములో సుందరముగా కృతిని సుకృతిగా ముద్రించి అందిచ్చుటయే కాక అరసవల్లిలో అంకితమిచ్చువరకు చేదోడుగా నిల్చిన ముద్రాపకుడు సుతనిర్విశేషుడు **పద్మనాభ ఆఫ్ సెట్ ప్రింటర్స్ చి॥ పద్మనాభస్వామికి,** శాస్త్రోక్తముగా అంకితకార్యమును సంతృప్తిగా నిర్వహించిన ఆలయ ప్రధానార్చకులు **బ్రహ్మశ్రీ ఇప్పిలి శంకర శర్మగారు,** వారి సోదరులు మరియు నా సహాధ్యాయి శ్రీఇప్పిలిబాలసుబ్రహ్మణ్య శాస్త్రి గారికి స్వామి వారి మూల విరాట్టు ప్రతికృతిని అంతర్జాలం (Internet) లో అందరికీ అందుబాటులో ఉంచిన **శ్రీఅరసవిల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానం** వారికి, నా కృతజ్ఞతలను తెలియజేయుచున్నాను.

వింజమూరి శేషఫణిశర్మ
M.A.B.O.L (Sanskrit)
విశాంత ఆంధ్రోపన్యాసకుడు
ప్రశాంతినిలయం

# కృతి ప్రశస్తి

'యస్యాశ్చోరశ్చికురనికరః కర్ణపూరో మయూరో
భాసోహాసః కవికులగురుః కాళిదాసో విలాసః।
హర్షో హర్షో హృదయవసతిః పంచబాణస్తు బాణః
కేషాం నైషా కథయ కవితాకామినీ కౌతుకాయ॥'

అని భాస కాళిదాసాది మహా కవుల సరసన నిలబడిన మహాకవి మయూరుడు. ఆయన రచించిన సూర్యశతకమును సాహితీగుణములచే మించగలిగిన రచన మరియొకటి లేదని ఘంటాఘోషణముగ చెప్పవచ్చును. అందుకే

'దర్పం కవిభుజంగానాం।
గతాశ్రవణగోచరమ్।
విషవిద్యేవ మాయూరీ।
మాయూరీ వాఙ్నికృంతతి॥

అను అభాణకము పుట్టినది. ఇందలి భావనాబలము, వర్ణనా నైపుణ్యము, శబ్దార్థాలంకార వైచిత్రి అనితర సాధ్యము, నాన్యతో దర్శనీయము. ఉదయసూర్యుని విషయముగా గ్రహించి తత్ప్రభావ ప్రాభవములను శతవిధముల ప్రస్తరించుట అద్భుతావహము. దీని పారాయణము సూర్య ప్రీతికరము- ఆరోగ్య ప్రదము అనుటకు నాటి నుండి నేటి వరకు ఎన్నియో నిదర్శనములు గలవు. కాని ఒక్కటే చిక్కు. జటిలమైన పదగుంఫనముతో దీర్ఘసమాసములతో ఒప్పుచున్న ఈ శతకమును అర్థము చేసికొనుట పఠించుటయు శ్రమ సాధ్యములగుటచే పారాయణ మొనరించుట సామాన్యులకు అసాధ్యము.

దీనిని ఇంతకు ముందు కొందఱు కవులు ఆంధ్రీకరించి యున్నారు. మూలమునందలి స్రగ్ధరావృత్తమే పెద్దది కావున దట్టముగా కూరబడిన దీని భావమునంతటిని తెలుగున వృత్త పద్యములో ఇముడ్చుట అసాధ్యకృత్యము.

శ్రీనాథమహాకవి తన కాశీఖండమున సూర్యవర్ణనావసరములందు ఈ పద్యములను కొన్నింటిని చక్కని తెనుగు నుడికారముతో సీసపద్యములుగా అనువదించి మార్గ దర్శనముగావించియున్నాడు. దాని నందుకొని సంస్కృతాంధ్రభాషానిష్ణాతులు, బహుముఖ ప్రజ్ఞాధురీణులు, 'శ్రీపాదుక' గా లబ్ధప్రతిష్ఠులు అయిన డా॥ **కొల్లూరు అవతారశర్మ** గారు ఆ చిక్కుల నెల్ల దీర్చి సులభముగా అర్థమగురీతిని, తెలుగు నుడికారపు సొంపులనలవరించుచు అందమైన నడకలతో ఒప్పు సీస పద్యములలో అనువదించి మహోపకారముగావించినారు. ఒకటి రెండు దాహరణములను గమనింపుడు 11వ పద్యమున **'ధారా రాయో ధనాయాపది సపది కరాలంబ భూతాః ప్రపాతే' – ఆపన్నులగు వారి యక్కర బాపగా చిక్కగా కురిసెడి సిరుల వాన, పాపాల కూపాలఁ బడిపోవు వారిని చేయూతనిచ్చియు చేదిలాగు"** అనునది.

12వ పద్యమున **'ప్రాచి ప్రాగాచరంత్యోకనతి చిరమచలే చారు చూడా మణిత్వం'** అను పాదమునకు **'తూరుపు కొండపై తూగాడు కిరణాలు తలమానికంబన తరణి నిల్వి'** అనునది, ముచ్చట గొల్పు అనువాదాలు.

ప్రతిపద్యమునందు ఇట్టి శైలిని మనము గుర్తింపగలము. ఇందలి శ్లోక తాత్పర్యములను బట్టి, పద్యములనాధారముగా జేసికొని మూల శ్లోక ములనవగాహన మొనర్చుకొని తత్పారాయణముచే సూర్యునారాధించి తదనుగ్రహపాత్రులు కావచ్చును. అంతశ్రమ కోర్వజాలనిచో ఉపాసనాబలము కూడ కలిగిన శర్మ గారి అనువాదమును పారాయణమొనర్చుటయు తత్సదృశ ఫలము నందింపగలదని నా విశ్వాసము. అదియు గాక దైవతములు బాహ్య ప్రియులు కాదు, కేవలము భావప్రియులు అనుట అందరికి తెలిసినవిషయమే కదా!

ఈ కృతి తెలుగునేల నాలుగు చెరగుల వ్యాపించి భక్తుల ఆదరాభిమానము లకు పాత్రమై మహోపకృతి గావించుచు ఆ చంద్రార్కఖ్యాతి నొందగలదని విశ్వసించుచున్నాను. నాకీ 'కృతిప్రశస్తి' నుగ్గడించు అవకాశము నొసగిన ప్రియమిత్రులు అవతారశర్మగారికి కృతజ్ఞతాభినందనముల నర్పించుచు సెలవు తీసుకొందును.

ఇతిశమ్.

**వింజమూరి శేషఫణిశర్మ**

# అవతారిక

ఈ పుస్తకాన్నిలా వెలువరించేముందు గతాన్నొకసారి నెమరు వేసుకోవాలనుకుంటున్నాను. అవి నే శ్రీ పీఠికాపురాధీప్రభుత్వడిగ్రీకళాశాలలో సంస్కృతకళాశాలలో సంస్కృతవిభాగాధ్యక్షుడుగా పనిచేస్తున్న రోజులు. తెలుగు విభాగంలోని సహోపన్యాసకులందరూ నాకు ఆప్తమిత్రులు. అది 1997వ సంవత్సరం. జనవరి 1వ తేదీ. ఆనాడు నేను తొలిసారి తెలుగులో కందపద్యం వ్రాసి, దానికి మిత్రులు శ్రీశేషఫణిశర్మగారు బాగుందని కితాబిస్తే (శ్రీబాలాత్రిపురసుందరిని) కీర్తిస్తూ, 'శ్రీబాలాశతకము' ను వ్రాసుకున్నాను. తరువాత మార్చి 25వ తేదీనాడు, నాకు జన్మదినశుభాకాంక్షలు తెలుపుతూ మిత్రులు శ్రీసుమన్‌బాబుగారు వారి తండ్రిగారైన 'శాంతిశ్రీ' జంధ్యాల వేంకటేశ్వరశాస్త్రిగారు రచించిన 'మయూరక్రేంకృతి' (శ్రీసూర్యశతకానికి సీసపద్యాలలో చేసిన అనువాదగ్రంథాన్ని), నాకు బహూకరించేరు. దానిని చదివినవెంటనే నాకు సీసపద్యాలలోనే సూర్యశతకాన్ని అనువదించాలనే సంకల్పం కలిగింది. దానికి అమ్మ బాలమ్మ అనుగ్రహం, సహస్రాంశుని కరుణాకటాక్షం రెండూ తోడై, సుమారు నెలరోజులలోనే, ఏప్రిల్ 26వ తేది సాయంకాలం 5 గం॥లకు పూర్తయింది. కవిమయూరునిక్రేంకృతిని అనునాదమనే భావనతో యీ శతకానికి 'షడ్జసంవాద'మని పారిభాషికంగానే నామకరణం చేసాను. ఇది నేను నా పద్యరచనాభ్యాసకార్యక్రమంలో సీసపద్యరచనభ్యసించడంకోసమని కృత్యాద్యవస్థలో చేసిన తొలిప్రయత్నమే తప్ప పాండిత్యాన్ని ప్రదర్శించడంకోసం వ్రాసిన రచనకాదని కవిపండితలోకానికి మనవి చేస్తున్నాను.

మరొక్క విషయం. దీనిని ప్రచురించడానికి ముందు నాకు ఆప్తులు పండితమిత్రులునైన బ్రహ్మశ్రీ వింజమూరి శేషఫణివర్మగారికి వ్రాతప్రతిని పంపగా వారెంతో ప్రేమాభిమానములతో అన్ని పద్యములను పరిశీలించి, పరిష్కరించేరు. ఇంకనూ వారు నాయందలి అవ్యాజమైన అభిమానముతో తమ బహుమూల్యమైన అభిప్రాయమును కూడా అందిచ్చినారు. స్థానికులైన సుహృన్మిత్రులు శ్రీ విశ్వనాథం సత్యనారాయణమూర్తి గారు దీనిని ప్రచురించవలసినదిగా ప్రోత్సహించడమే కాకుండా చక్కని సవరణలను సూచించేవారు. ఈ యిరువురకు నా కృతజ్ఞతాభివందనములను తెలియజేయుచున్నాను.

ఇట్లు,

శ్రీపాదుక ఆచార్యకొల్లూరు అవతారశర్మ

# మయూరకవి - సూర్యశతకము

సంస్కృతసాహిత్యములోనే కాక శతకవాఙ్మయప్రపంచములోనే సూర్యశతకానికి తనదైన విశిష్టమైన స్థానమున్నది. రచనా శిల్పములో ఇంతటి ప్రౌఢిమను సంతరించుకున్న శతకమిదియే! దీనిని రచించిన మయూరమహాకవి భాసకాళిదాసాదుల సరసన గణింపదగినవాడు. జయదేవుడు తన ప్రసన్నరాఘవములో యితనిని వాగ్దేవికి కర్ణావతంసముగా 'కర్ణపూరోమయూరః'అని కీర్తించినాడు. ఇతడు బాణభట్టునికి మామగారని ప్రాచీన సంప్రదాయవిదుల అభిప్రాయము. శ్రీ హర్షుని అస్థానకవిగానున్నట్లు ఉల్లేఖములు చూపట్టుచున్నవి. రాజశేఖరకవి మాతంగదివాకరుడనే కవి శ్రీ హర్షుని అస్థానములో బాణమయూరులతో సమానముగా సమ్మానింపబడినట్లు–

'అహో! ప్రభావో వాగ్దేవ్యాః యన్మాతంగదివాకరః

శ్రీహర్షస్యాభవత్సభ్యః సమో బాణమయూరయోః॥ అని వచించినాడు. నవసాహసాంకచరిత్రనుబట్టి బాణమయూరులకు కవితాస్పర్ధ ఉండేదని తెలుస్తున్నది. "సచిత్ర వర్ణవిచ్ఛిత్తిహరణోరవనీపతిః శ్రీహర్ష ఇవసంఘట్టం చక్రే బాణమయూరయోః॥" ఈవివరాలనుబట్టి మయూరకవి క్రీ॥శ605–648 సం॥ల మధ్యకాలంలో కనూజ్‌గా రాజధానికిగా జేసికొని మధ్యభారతమునేలిన శ్రీహర్షచక్రవర్తియొక్క ఆస్థాన కవిగానున్నట్లు, అనగా, క్రీ.శ.7వ శతాబ్దిమధ్యభాగంలో ఉన్నట్లు నిర్ధారించవచ్చును.

మమ్మటుడు తన కావ్యప్రకాశములో కావ్యప్రయోజనాలను వివరించేసందర్భంలో దుఃఖనివృత్తి కావ్యపఠనంవల్ల జరుగుతుందని చెబుతూ, మయూరకవి సూర్యస్తుతిపరమైన ఈ శతకాన్ని రచించి కుష్ఠురోగం నుండి పూర్తిగా ముక్తుడైనాడని ఉదాహరిస్తాడు. ఈ విధంగా 'సూర్యశతకం' యెంతో ప్రభావము కలది. స్రగ్ధరావృత్తంలో రచించబడిన ఈ శతకం, గౌడీరీతిలో, నారికేళపాకములోశ్లేషయమకాద్యలంకారములతో, అర్థగాంభీర్యములతోపాటు శబ్దాడంబరాన్నికూడా సంతరించుకుని, మహాప్రౌఢంగా కనిపిస్తుంది. సామాన్య సంస్కృతభాషాపరిజ్ఞానం కలవారు, వ్యాఖ్యానసహాయంలేకుండా

కనిపిస్తుంది. సామాన్య సంస్కృతభాషాపరిజ్ఞానం కలవారు, వ్యాఖ్యానసహాయంలేకుండా దీనిని అర్థంచేసికొనలేరనియే చెప్పవచ్చును. ఇందులో అక్కడక్కడ అరుణ మంత్రముల భావములు కూడా నిక్షేపించబడినాయని చెబుతారు. వల్లభదేవాదులు కొందరు దీనికి వ్యాఖ్యానాలు రచించేరు. శ్రీనాథమహాకవి యిందులో ఏడెనిమిది శ్లోకాలను తన కాశీఖండములో సీసపద్యములుగా అనువదించాడు. ఆధునికులైన శ్రీ అకొండి వ్యాసమూర్తి శాస్త్రిగారు, వడ్డాది సుబ్బారాయుడుగారు తెలుగులోని కనువదించేరు. దీనియొక్క ఆంగ్లానువాదాన్ని కొలంబియా విశ్వవిద్యాలయంవారు, డా.కార్ల్‌బార్న్‌హైమర్ ఇటలీభాషలోను ప్రచురించినట్లు, మా మిత్రులు శ్రీ వింజమూరి శేషఫణశర్మ గారు తమ సూర్యశతకపీఠికలో తెలిపియున్నారు.

ఈ సూర్యశతకంలో మొదటి 43 శ్లోకములలో సూర్యకిరణాలవర్ణన సూర్యస్తుతి, తరువాత 6 శ్లోకములలోసూర్యరథము మరియు అశ్వములు, అటుపై 12 శ్లోకములలో సారథియైన అరుణుడు, ఆపైన మరల 11 శ్లోకములలో సూర్యునిరథము, పిమ్మట 7 శ్లోకములలో సూర్యబింబము, 3 శ్లోకములలో అతని త్రిమూర్త్యాత్మకత్వము, తరువాత శ్లోకములో సూర్యుని శ్రేష్ఠతమత్వము, చివరగా 16 శ్లోములలో సూర్యప్రకాశములో భూమిపై జరిగే పరిణామములు, కడపటి శ్లోకంలో ఆయన సార్వభౌమత్వము వర్ణింపబడినాయి. ఇలా 100 శ్లోకముల తరువాత విషయానుక్రమణికగా శ్లోకముల సంఖ్యలనుదాహరిస్తూ ఒక శ్లోకము, ఫలశ్రుతి మఱియొక శ్లోకములోను వెరసి 102 శ్లోకములు గోచరిస్తాయి.


సూర్యశతకము


సూర్య శతకము



సూర్యశతకము

# సూర్యశతకమ్
## కిరణావళీవర్ణనము

అవిగో! బాలభానుని బంగారు కిరణాలు! ప్రకృతి కాంత ధరిస్తున్న వేవెలుగుల ఆభరణాలు. విరాడ్విశ్వద్వారతోరణాలు. వీటి సోయగాలను, ప్రాభవాన్ని, క్షేమంకరత్వాన్ని మయూరమహాకవి 43 శ్లోకాల్లో యిలా వివరిస్తున్నాడు-

శ్లో॥ జంభారాతీభకుంభోద్భవమివ దధతస్సాంద్రసిందూరరేణుం
రక్తాస్సిక్తా ఇవౌఘైరుదయగిరితటీధాతుధారాద్రవస్య
ఆయాంత్యా తుల్యకాలం కమలవనరుచేవారుణా వో విభూత్యై
భూయాసుర్భాసయంతో భువనమభినవా భానవో భానవీయాః॥ 1 ॥

### తాత్పర్యము

ఐరావత కుంభస్థలమునందలరారే సిందూర రజమును దాల్చినవో, యుదయపర్వత సానువులందలి గైరికాదులగు ధాతువుల నుండి స్రవించు ద్రవధారల ప్రవాహములచే తడియుటచే నెఱ్ఱబడినవో, తమ రాకతోడనే వచ్చుచున్న కమలవనపుటెఱ్ఱనికాంతిచే నెఱ్ఱనైనవో యనునట్లు వెలుగుచు లోకములను ప్రకాశింపచేయుచున్న సూర్యుని తొలి కిరణములు మీకు ఐశ్వర్యాభీష్టములనిచ్చుగాక!

### అనువాదపద్యం

సీ. జంభారి మత్తేభ కుంభస్థలమ్ముపై- పొంగారు సిందూరపూరమనగ
ఉదయాద్రిపైనున్న యుత్ఫుల్ల ధాతుజ- ద్రవసిక్త నిర్ఝరధారలనగ
తుల్యమౌరీతిని కల్యమందరుదెంచి- కమలంపుటరుణిమ కదలెననగ
ప్రాచీదిశాయోష ఫాలభాగమ్మున- దీటుగా నమరిన తిలకమనగ

గీ. బాలభానుని యాదిమ భాసమదియ- ప్రాగ్దిశాముఖారుణిమగ ప్రకటమయ్యె
భానవీయంబులర్చులుభయముబాపి-ఇరులపోరార్చియిచ్చుతసిరులు మీకు



శ్లో॥ భక్తిప్రహ్వాయ దాతుం ముకుళపుటకుటీకోటరక్రోడలీనాం
లక్ష్మీమాక్రష్టుకామా ఇవ కమలవనోద్ఘాటనం కుర్వతే యే
కాలాకారాంధకారాననపతిత జగత్సాధ్వసధ్వంసకల్యాః
కల్యాణం నః క్రియాసుః కిసలయరుచయస్తే కరా భాస్కరస్య॥ 2 ॥

### తాత్పర్యము

తనను శ్రద్ధాభక్తులతో కొలిచేవారిననుగ్రహించడం కోసం, ముకుళించిన దళముల మధ్యభాగమనే గుహలోపలిభాగమున వసించుచున్న లక్ష్మిని వెలికి దీయుటకో యనునట్లు పద్మ సముదయమును వికసింపజేయుచున్నవియును, నల్లని యాకృతి గల చీకటి నోటిలో బడిన లోకము యొక్క భీతిని ధ్వంసము చేయజాలినవియును, జివురుటాకుల కాంతులు గలవియును అగు సూర్యకిరణములు మీకు మంగళము లొనగూర్చుగాక!

### అనువాదపద్యం

సీ. చీకట్లు పోకార్ప జీకాకుపరచెడి- యంధకారాసురునణగద్రొక్కి
తోరంపు బత్తితో దోయిలించినవారి-కన్నిసిరులనవి యమరజేయ
నరవిందనిలయపుటర్గళ విడదీసి- బందియై యున్నట్టి భార్గవినిడి
లోకకల్యాణకృల్లోకబాంధవుడన- నన్వర్థనాముడై యర్కుడలర

గీ. నాయురారోగ్య కిరణాల యరుణకాంతి
కిసలయంబుల రుచితోడ కేలు మోడ్చి
యంజలించుచు నెదురుగా నర్ఘ్యమిచ్చు
భక్తగణముల బ్రోచుత భవము బాపి॥

శ్లో॥ గర్భేష్వంభోరుహాణాం శిఖరిషు చ శితాగ్రేషు తుల్యం పతంతః
ప్రారంభే వాసరస్య వ్యుపరతిసమయే చైకరూపాస్తథైవ
నిష్పర్యాయం ప్రవృత్తాస్త్రిభువనభవనప్రాంగణే పాంతు యుష్మా-
నూష్మాణం సంతతాధ్వశ్రమజమివ భృశం బిభ్రతో బ్రధ్నపాదాః॥ 3 ॥

## తాత్పర్యము

సుకుమారములగు పద్మముల కర్ణికాంతర్భాగములందును, కఠినములు తీక్ష్ణములు నగు పర్వతములపైనను సమముగా బ్రసరించునవియును, దినారంభమునందును దినాంతమునందును ఒకేవిధముగా నుండునవియును, ముల్లోకములనెడు భవన ప్రాంగణమున నొక్కమారే ప్రసరించునవియును, నిరంతర మార్గగమన శ్రమ వలన జనించినదో యనునట్లున్న మిక్కుటమగు వేడిమి గలిగినవియును నగు సూర్యపాదములు (సూర్యుని కిరణములు) మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యం

సీ. కమనీయ మంభోజగర్భంబునిదియని- కర్కశంబిదియని కఠినశిలను
ఔత్సుక్యపూర్ణమౌ నుదయకాలంబిది- నిస్తేజమైనదీ గ్రస్తదివము
ననెడి భేదము లేక యన్నిట సమబుద్ధి-మూడులోకంబుల ముంగిళులను
ఏకరూపమున గన్పింపగానే తెంచి-కిరణాళి జనులకు కీడు బాప

గీ. నాగకుండగ చరియించు నర్కు పాద-
చయము ఘనతరసంతాప చారువగుచు
తన్ను గొలిచెడివారల తాపమార్చి
మంగళములనొసంగుత! మహిని మీకు.



శ్లో॥ ప్రభ్రశ్యత్తుత్తరీయత్విషి తమసి సముద్వీక్ష్య వీతావృతీన్ప్రా
గ్జంతూ స్తంతూన్యథా యానతను వితనుతే తిగ్మరోచిర్మరీచీన్
తే సాంద్రీభూయ సద్యః క్రమవిశదదశాశాదశాలీవిశాలం
శశ్వత్సంపాదయంతో2ంబరమమలమలం మంగళం వో దిశంతు॥4॥

## తాత్పర్యము

తొలుత నుత్తరీయమువంటిదగు చీకటి జారిపోవుచుండగా, బట్టబయలైన ప్రాణులను చూచి, సూర్యుడు దారములనువలె యేకిరణముల నధికముగా వెల్వరించెనో, యేవి దట్టములై, క్రమక్రమముగా స్వచ్ఛములగుచున్న దశదిశలనెడు అంచుల సముదాయముతో గూడిన విశాలమగు వస్త్రమునుబోలిన ఆకాశమును సర్వదా సిద్ధమొనర్చుచున్నవో, ఆ కిరణములు మీకు మంగళములనొసంగుగాక!

## అనువాదపద్యం

సీ॥ ప్రాణమలసినట్టి వ్రజరాత్రి వేళలో- చీకటి చేలమ్ము చేసికొనియు
తమ్ముమరచినట్టి తమకంబులో నుండ- చీకట్లు చీరగా చీరజార
నకట! యెంతటి కష్టమాయెనని దలంచి- తెల్లని వలువల దిరుగగప్పి
మానము రక్షించె మార్తాండుడనిదోవ- దిక్కులన్ని తిరిగి తేజరిల్లె

గీ॥ నట్టి కారుణ్యమూర్తి యౌనాదిదేవు
ప్రత్యహము పూర్ణభక్తిని ప్రణతిసేయ
కరుణజూపుచు ఘనమగు కలిమినిచ్చి
వేయి కరముల బ్రోచునా వేడివేల్పు॥

శ్లో॥ న్యక్కుర్వన్నోషధీశే ముషితరుచి శుచేవౌషధీః ప్రోషితాభా
భాస్వద్గ్రావోద్గతేన ప్రథమమివ కృతాభ్యుద్గతిః పావకేన
పక్షచ్ఛేదవ్రణాసృక్స్రుత ఇవ దృషదో దర్శయన్ప్రాతరద్రే
రాతామ్రస్తీవ్రభానోరభిమతమదే స్తాద్గభస్త్యుద్గమోవః॥ 5 ॥

## తాత్పర్యము

ఓషధీనాథుడు (చంద్రుడు) కాంతి కోల్పోయినవాడు కాగా, ఆదిత్యదేవుని అరుణకిరణావళి, తద్విరహము చేతనో యన్నట్లు కాంతి విహీనములయిన యోషధులను తిరస్కరించుచున్నదియును, సూర్యకాంతముల నుండి వెల్వడిన యగ్నిచే దొలుత స్వాగతింపబడుచున్నదై, ఱెక్కలను ఛేదించుటవలనైన గాయముల రక్తముచే సిక్తములైనట్లున్న ఉదయాద్రి శిలలను కనిపింపజేయుచున్నదియును, మిగుల నెఱ్ఱనిదియునగు సూర్యుని కిరణోదయము మీ యనిష్టములను (అనిష్టులను) నశింపజేయుగాక!

## అనువాదపద్యం

సీ॥ ఓడిపోయెననగ నోషధీశుడు కాంతి- కోలుపోవుచు నస్తకూటమరిగె
అనుగమించెననగ నాయోషధీయోష- లవియన్నియును గూడ నారిపోయె
ఇనకాంతమణులందు నెదురుగా జ్వలియించి- అగ్నియభ్యుత్థానమాచరించె
పక్షవిచ్ఛేదన ప్రజనితాసృగ్ధార- లరుణంబుగా జేసి నద్రికూట-
గీ. మనగ నుదయాద్రి శిఖరాన నలరె తరణి
అతని యుదయింపుటరుణిమ యదియ వచ్చి
యనభిమతము బాపుచునన్ని సిరుల
నిచ్చి యెప్పుడు బ్రోచుత! నిలను మిమ్ము!

---



శ్లో॥ శీర్ణఘ్రాణాంఘ్రిపాణీ న్వ్రణిభిరపఘనైర్ఘర్ఘరావ్యక్తఘోషా-
న్దీర్ఘాఘ్రాతానఘౌఘైః పునరపి ఘటయత్యేక ఉల్లాఘయన్యః
ఘర్మాంశోస్తస్య వోంతర్ద్విగుణఘనఘృణానిఘ్ననిర్విఘ్నవృత్తే-
ర్దత్తార్ఘాస్సిద్ధసంఘైర్విదధతు ఘృణయశ్శీఘ్రమంహోవిఘాతమ్ ॥ 6 ॥

## తాత్పర్యము

అతడే ఆదిత్యదేవుడు! వికలములయిన ముక్కు, పాదములు, చేతులు గలవారును, వ్రణితములైన (పుండ్లుపడిన) యంగములతో వికృతధ్వనులతో విలపించువారునునయి పాపసమూహములచే జిరకాలము పీడింపబడిన వారిని దానొక్కడే (అసహాయుడై) రోగరహితులనొనర్చి యానందింపజేస్తున్నాడు. లోపల రెండింతలుగా నున్న మహాదయకు వశమైన నిరర్గళ ప్రసారము గలవాడయిన ఆ చండకిరణునియొక్క కిరణములను సిద్ధసమూహాలు అర్ఘ్యములనిచ్చి అర్చిస్తున్నారు. అట్టి సూర్యకిణాలు మీ పాపములను దొలగించుగాక!

## అనువాదపద్యం

సీ॥ శిథిలితాంగమ్ముల జీకాకు పరచెడి-శోణితవ్రణముల శుద్ధిజేయ
నేనూర్యకిరణంబులీలోకమందున్న- వ్యాధిపీడితులైన వారిపైన
పడుటకోయనునట్లు పవనఘర్ఘరఘోష- మేఘపటలము దావేనఁజీల్చి
యతిరయంబున భూమి నారయవచ్చెనో- యట్టి రోచిస్సుల కర్ఘ్యమీయ
ఆ.వె॥ సిద్ధసంఘమదియసిద్ధమై యున్నది
కర్మసాక్షి గొలువ కాలమందు
ఇనుమడించిన దయ నిబ్బడి కిరణాళి
బరపి యతడఘముల బాపు వేగ!

శ్లో॥ బిభ్రాణా వామనత్వం ప్రథమమథ తథైవాంశవః ప్రాంశవో వః
క్రాంతాకాశాంతరాళా స్తదను దశదిశః పూరయంతస్తతోపి
ధ్వాంతాదాచ్ఛిద్య దేవద్విష ఇవ బలినో విశ్వమాశ్వశ్నువానాః
కృచ్ఛ్రాణ్యుచ్ఛ్రాయహేలోపహసితహరయో హారిదశ్వా హరంతు॥ 7 ॥

## తాత్పర్యము

తొలుత వామనత్వమును (పొట్టిదనము) దాల్చినవియు, తరువాత నున్నతములై యట్లే యాకాశమధ్యభాగము నాక్రమించినవియు, బిదప దశదిశల నిండినవియు, నా తరువాత బలయుతమగు చిమ్మచీకటి నుండి బలిదైత్యునుండి వలె విశ్వమును వేగముగా లాగికొని యనుభవించుచున్నవియు, దమ యౌన్నత్య విలాసముచే విష్ణునవహసించుచున్నవియు నగు హరిదశ్వుని (సూర్యుని) యొక్క కిరణములు మీ కష్టములదొలగించుగాక.

## అనువాదపద్యం

సీ॥ తొలుదొల్తకనిపించు తొలిమయూఖములవి-తొంటి వామనమూర్తి తులనుబడసి
తదుపరి పొడవైన తరణికిరణతతు- లంతరాళమునంత నలముకొనియె
ఆపైన యర్చిస్సులవి జూడదశదిశల్- మహిమతో త్రైవిక్రమమ్ములయ్యె
విశ్వరూపము జూపి విశ్వాత్ముడైనట్టి- కర్మసాక్షి మనకు కనగజూపి

గీ॥ ధ్వాంతబలిరాట్టు దర్పమ్ము సొంత మడచి
యాదివిష్ణుని తేజంబునవహసించి
యనుదినమ్మున నర్కుని యర్చులవియ
కష్టముల బాపి యిచ్చుతనిష్టములను.

---



శ్లో॥ ఉద్గాఢేనారుణిమ్నా విదధతి బహుళం యేఽరుణస్యారుణత్వం
మూర్ధోద్ధూతౌ ఖలీనక్షతరుధిరరుచో యే రథాశ్వాననేషు
శైలానాం శేఖరత్వం శ్రితశిఖరిశిఖాస్తన్వతే యే దిశంతు
ప్రేంఖంతః ఖే ఖరాంశోః ఖచితదినముఖాస్తే మయూఖాస్సుఖం వః॥8॥

## తాత్పర్యము

తమ దట్టమైన యెఱ్ఱదనముచే వరుణుని (అనూరుని) యరుణత్వము నధికము జేయుచున్నవియును, రథాశ్వములు తలలు పైకెత్తినపుడు వాని ముఖముల యందేర్పడిన కళ్లెపు గాయముల రక్తముల కాంతులవలె జూపట్టుచున్నవియును, నగాగ్రములందు వ్రాలి, వాని కిరీటముల వలె వెలుగుచున్నవియును, నుదయకాలమున కాకాశమున కెగయుచున్నవియును నగు సూర్యకిరణములు మీకు సౌఖ్యము నొసగుగాక!

## అనువాదపద్యం

సీ. గాఢారుణార్చిస్సు కాంతిపూరమ్మున- నరుణుని యరుణిమ యధికమయ్యె
ముట్టెత్తి వడి పారు ముందటి యశ్వాల- నోళ్ల కళ్లెపు పుండ్లనుండి కారు
నెత్తుటి యెరుపన నింగిని కిరణంబు- లుదయాద్రి మస్తకముల్లసిల్ల
ముకుటంపు శోభతో మోదము గూర్పగా- నలరుచు నాభతో నవని నుండి

గీ॥ దినముఖంబున నెగయుచు దివికి జేరు
చండభానుని కిరణసంచయము జూడ
నేత్రపర్వంబు జనులకు నిత్యసుఖము
కలుగజేయుతనవి మీకు కలుములిచ్చి.

శ్లో॥ దత్తానందాః ప్రజానాం సముచిత సమయాకృష్టసృష్టైః పయోభిః
పూర్వాహ్ణే విప్రకీర్ణా దిశి దిశి వీరమత్యహ్ని సంహారభాజః
దీప్తాంశోర్దీర్ఘదుఃఖప్రభవభవభయోదన్వదుత్తారనావో
గావో వః పావనానాం పరమపరిమితాం ప్రీతిముత్పాదయంతు॥ 9 ॥

## తాత్పర్యము

తగువేళల బీల్చుకుని వదలబడిన పయస్సులచే (నీరు,పాలు) లోకుల కానందము కూర్చునవియును, దినపూర్వభాగమున నానాదిక్కులకు వెడలి సాయం సమయమున వెనుదిరిగి స్వస్థానమును జేరునవియును, నధిక దుఃఖహేతువగు సంసారభయమనెడు సముద్రమును దాటించు నావలవంటివియును, బావనములలో శ్రేష్ఠములును నగు భానుని కిరణములు అట్టివేయగు గోవులవలె మీకు అపరిమితానందమును కల్గించుగాక.

## అనువాదపద్యం

సీ॥ భానుగోగణములు భాసిల్లు కరుణను- చూపున చేపెడి చూడి యావు
ఉదయాన దశదిశ లోర్మిమీరగ జని- సంజవేళలయందు సంకుచించు
ఆ మధ్యకాలమ్ము నందటి దుఃఖాల- భయములన్నిటి గూడ బాపుచుండు
అంతియేగాక నీ యవనిలోనందర-దాటించి దరిజేర్చు ధర్మనౌక

ఆ.వె. కర్మసాక్షిగాను కర్మల ఫలములు
నాచి తూచియిచ్చు నందఱకును
పక్షపాత బుద్ధి బరగనీకుండగ
హద్దు మీరు సుఖములందజేయు ॥



శ్లో॥ బంధధ్వంసైకహేతుం శిరసి నతిరసాబద్ధసంధ్యాంజలీనాం
లోకానాం యే ప్రబోధం విదధతి విపులాంభోజషండాశయేవ
యుష్మాకం తే స్వచిత్తప్రథితపృథుతర ప్రార్థనాకల్పవృక్షాః
కల్పంతాం నిర్వికల్పం దినకరకిరణాః కేతవః కల్మషస్య॥ 10 ॥

## తాత్పర్యము

నమస్కారాసక్తిచే సంధ్యాసమయములందు శిరస్సులపై దోసిళ్ళు ఘటించిన లోకులకు విస్తారమగు పద్మ సమూహమదియను భావన చేత వలె బ్రాకృతాది బంధధ్వంసమున కేక కారణమగు తత్త్వజ్ఞానమును ముకుళబంధ ధ్వంస హేతువగు వికాసమును వలె ప్రసాదించునవియు, తమ చిత్తములకు వచ్చిన గొప్ప ప్రార్థనలకు గల్పవృక్షముల వంటివియు నగు నా సూర్యకిరణములు నిస్సంశయముగా మీ పాపముల నశింపజేయుగాక!

## అనువాదపద్యం

సీ. సంజలందంజలి సారించి నతిఁజేయ- బంధాల బాపును భవ్యకాంతి
పద్మినీదరహాసభద్మతో లోనున్న- చీకట్లు పోకార్చు చిత్కళాభ
చిత్తమున దలప నుత్తరక్షణమున- కామనలీడేర్చు కల్పశాఖి
యనగ నర్కుని కిరణాళియద్భుతముగ- కలిమినిచ్చునులోని కలుషమడచి

ఆ.వె. లోన బయటనున్న లోకాల చీకట్ల
ధ్వాంతకేతువనగ తరిమి తరణి
కిరణజాలమదియ కీడులన్నిటి బాపి
పాపనాశి యగుచు బరగు గాత!

శ్లో॥ ధారా రాయో ధనాయాపది సపది కరాలంబభూతాః ప్రపాతే
తత్త్వాలోకైకదీపాస్త్రిదశవతిపురప్రస్థితౌ వీథ్య ఏవ
నిర్వాణోద్యోగి యోగిప్రగమనిజతమద్వారి వేత్రాయమాణా
స్త్రాయంతాం తీవ్రభానోర్దివసముఖసుఖా రశ్మయః కశ్మలాద్వః ॥11 ॥

## తాత్పర్యము

ఉదయవేళలో సుఖకరములైనవియును,ఆపదలో ప్రార్ధనా సమనంతరవే కురిసేధనరాశులధారలును, నరకమున బడనీక యుద్ధరించు చేయూతలును, తత్త్వజ్ఞానపువెలుగు నొసగగల యేకప్రదీపములును, స్వర్గగమన ఘంటాపథములును, ముముక్షువులగు యోగులను తన శరీరద్వారమున నిరాటంకముగా ప్రవేశింపజేయు వేత్రములును నయిన సూర్యుని కిరణములు మిమ్ము పాపము నుండి రక్షించుగాక!

## అనువాదపద్యం

సీ. ఆపన్నులగు వారి యక్కర బాపగా- జిక్కగా గురిసెడి సిరులవాన
పాపాల కూపాల పడిపోవువారిని- చేయూతనిచ్చియు చేది లాగు
జ్ఞానదీపమునెత్తి జంభారిపురవీథి- నడిపింపజాలెడి నవ్యపథము
యోగిపుంగవులను యోగమున నిలిపి- విధులగా పాడెడి వేత్రలతలు

ఆ.వె. అనగ భానుదీప్తు లాకాశమందున
అందర దరిజేర్చ నలముకొనియె
కల్మషంబు కడిగి కర్మఫలములిచ్చు
రవికిరణములగుత! రక్షకములు.



శ్లో॥ ప్రాచి ప్రాగాచరంత్యో2నతిచిరమచలే చారుచూడామణిత్వం
ముంచంత్యో రోచనాంబు ప్రచురమివ దిశాముచ్చకైశ్చర్చనాయ
చాటూత్కైశ్చక్రనామ్నాం చతురమవిచలైర్లోచనైరర్చ్యమానా
శ్చేష్టంతాం చింతితానాముచిత మచరమాశ్చండరోచీరుచో వః ॥12 ॥

## తాత్పర్యము

తొలుదొల్త తూర్పుదిక్కునగల ఉదయ పర్వతమున కొంతకాలము సుందరములగు శిరోమణులుగా వెలుగు చున్నవియును, మిక్కిలిగా దిక్కుల నలంకరించుటకు గోరోచనాజలమును జల్లుచున్నట్లున్నవియును, ప్రియోక్తులకెదురుచూచుచు, నిశ్చలములయియున్న చక్రవాకపక్షుల నేత్రాంతములచే చతురముగా నారాధింపబడుచున్నవియు నగు సూర్యునియొక్క తొలి వెలుగులు, మీ కోర్కెల కనుగుణముగా వర్తించుగాక!

## అనువాదపద్యం

సీ. తూరుపుకొండపై తూగాడు కిరణాలు- తలమానికంబన తరణినిల్పి
ప్రాగ్దిశాయోషకు రాగరంజితమైన- గోరోచనా జలపూరమిచ్చి
చాటుసూక్తులగోరు చక్రవాకంబుల- క్రకచంపుకోతను కనియు గరుణ
చీకటి పోగొట్టి చేకూర్చి యుగ్మంబు- విరహతాపమునంత వీడజేసి

గీ. చండభానుని కిరణాలు జాలువార
లోకమంతయుగనియె నాలోకమనగ
అట్టి కిరణాళినహరహమర్చజేయ
మీదుకోర్కెలనీడేర్చి మిమ్ముగాచు.

శ్లో॥ ఏకం జ్యోతిర్ద్వ ృశౌ ద్వే త్రిజగతి గదితాన్యబ్జజాస్యైశ్చతుర్భి-
ర్భూతానాం పంచమం యాన్యలమృతుషు తథా షట్సు నానావిధాని
యుష్మాకం తాని సప్తత్రిదశమునిసుతాన్యష్టదిగ్భాంజి భానో-
ర్యాంతి ప్రాహ్ణే నవత్వం దశ దధతు శివం దీధితీనాం శతాని ॥13 ॥

## తాత్పర్యము

లోకమున కొకేయొక్క వెలుగైనవియు, రెండు కన్నులైనవియు, ముల్లోకములయందు బ్రహ్మయొక్క నాలుగు ముఖములచే వర్ణింపబడినవియు, భూతములలో- నైదవదైనవియు, ఆఱు ఋతువులయొక్క వివిధ రూపములనందునవియు, దివ్యులగు సప్తర్షులచే నుతింపబడినవియు, ఎనిమిది దిక్కులను పొందినవియు, పూర్వాహ్ణమున నవత్వము నందునవియునగు సూర్యుని పదినూఱుల (వేయి) కిరణములు మీకు మంగళము నొడగూర్చుగాక!
ఈ శ్లోకంలో ఒకటి నుండి పది అంకెలను సూర్యకిరణాలతో అన్వయించి వర్ణించడం విశేషంగా గ్రహించాలి.

## అనువాదపద్యం

సీ. యెన్నగాలోకాలకేకైక తేజమై- కనగ నాపై నయ్యె కన్నుగవగ
మూడులోకములందుముందుగానలువచే-నాల్గుముఖములచేనతులు గొనుచు
పంచభూతములందు పంచమంబైనట్టి- యాకాశమవి యన నలరుచుండు
ఆరు ఋతువులందు నందమొప్పగ పారి- యా సప్తఋషులచే నర్చగొనుచు
గీ॥ అష్టదిక్కులయందున నలముకొనుచు
పూర్వదివసము నవతను బొందుచుండి
పదులు నూర్లన కిరణాళి పారి మీకు
వేలసంఖ్యను శుభముల వేగమిడుత!

శ్లో॥ ఆవృత్తి భ్రాంతవిశ్వాశ్రమమివ దధతః శోషిణః స్వోష్మణేవ
గ్రీష్మే దావాగ్నితప్తా ఇవ రవమనకృద్యే ధరిత్ర్యా దయంతి
తే ప్రావృష్యాత్తపానాతిశయరుజ ఇవోద్వాంతతోయా హిమర్తౌ
మార్తాండస్యాప్రచండాశ్చిరమశుభభిదే2 భీశవో వో భవంతు ॥ 14 ॥

## తాత్పర్యము

వేసవి యందు మఱల మఱల విశ్వమందంతట సంచరించినవై శ్రమనందినవో యనునట్లును, తమ తాపముచే తామే క్రాగినవో యనునట్లును, దావాగ్నిచే దపించిన వారివలె బలుమారు భూమినుండి జలమును గ్రోలినవై, వర్షాకాలమున నధిక జలపానముచే రోగమును బొందినవారివలె నీటిని వెలిగ్రక్కినవై చలికాలమున పాటవరహితములై యొప్పు మార్తాండుని కిరణములు చిరకాలము మీ యశుభముల దొలగించుగాక!

## అనువాదపద్యం

సీ॥ అంతరాయము లేక నావృత్తిఁజెందుచు-నింగినేల దిరుగ నీరసించి
దావాగ్నివనములుఁదహియింపబడునట్లు-తమనిదాఘముఁదామె తప్తమగుచు
దప్పిగొని జలము ద్రావగా మితిమీరి- యతిసారవమనము లధిగమింప
తాము తపించుచు దయతోడ లోకాల- బాధలగని లోకబంధువులన
గీ. ప్రావృషేణ్యవయఃపాన వమనమరని,
శీతకాలము నాతపశ్రీయుతముగ
నాదుకొనుచుండు కిరణాళి యశుభభేది
యగుచు మీవగు నఘములనడచుగాత!

శ్లో॥ తన్వానా దిగ్వధూనాం నమధిక మధురాలోకరమ్యామవస్థా-
మారూఢప్రౌఢిలేశోత్కలితకపిలిమాలంకృతిః కేవలైవ
ఉజ్జృంభాంభోజనేత్రద్యుతిని దినముఖే కించిదుద్భిద్యమానా
శ్మశ్రుశ్రేణీవ భాసాం దిశతు దశశతీ శర్మ ఘర్మత్విషో వః ॥15 ॥

## తాత్పర్యము

వికసించిన పద్మములనెడు నేత్రముల కాంతి గల దినముఖమున కొద్దిగా మొలకెత్తి, కొంచెము ముదిరి కపిల వర్ణమున ప్రకాశించుచు, సహజాలంకరణమై దిక్కులనెడు కాంతలకు మిక్కిలి సుందరమగు వెలుగుతో మనోహరత్వమును పెంపొందిస్తున్న సూర్యకిరణ సాహస్రి, వికసించిన పద్మముల వంటి నేత్రముల కాంతిగల యువకుని ముఖమున గ్రొత్తగా మొలకెత్తి కొంచెము ముదిరి కపిలవర్ణమునంది సహజాలంకరణమై తనను చూచే యువతులకు మిక్కిలి సుందరములగు చూపులతో మనోహరత్వమును పెంపొందించుచున్న శ్మశ్రుశ్రేణి(మీసముల వరుస) వలె భాసిస్తూ మీకు సుఖము నందించుగాక!

## అనువాదపద్యం

సీ. దశదిశాకాంతల దర్శించువేడుక- దినశోభ దీటుగా తేజరిల్ల
మాధుర్యములు జూపు మార్తాండుడల్లదె- నారూఢ ప్రౌఢిమ నరుగుదెంచె
దినరాజు యువరాజు నినకాంతి వలపంత- కలజూచు కమలాల కన్నుదోయి
ఉత్ఫుల్ల కమలాలకుదయోన్ముఖంబైన- మేల్మోల్పు కిరణాళి మీనకట్టు

ఆ.వె. దిఙ్ముఖంబులవియ దీటైన హాసాల
తన్ను దాకినంత తమకమునను
కరములబిగపట్టి కరిగించు దినమణి
సుఖములిచ్చి మిమ్ము జూచుగాత!



శ్లో॥ మౌళీందోర్మైష మోషీద్ద్యుతిమితి వృషభాంకేన యశ్శంకినేవ
ప్రత్యగ్రోద్ఘాటితాంభోరుహ కుహర గుహాసుస్థితేనేవ ధాత్రా
కృష్ణేన ధ్వాంతకృష్ణస్వతనువరిభవ త్రస్నునేవ స్తుతో2లం
త్రాణాయ స్తాత్తనీయానపి తిమిరరిపోస్స త్విషాముద్గమో వః ॥16 ॥

## తాత్పర్యము

తన శిరమునన్నున్న చంద్రుని కాంతి నితడు అపహరిస్తాడేమోననే శంక చేతనో యనునట్లు శంకరుని చేతను, నంపూర్ణముగా వికసింవచేయబడిన వద్మ గుహాంతర్భాగము నందు జక్కగా గూర్చుచుండుట చేతనో యన్నట్లు (కృతజ్ఞుడగు) బ్రహ్మచేతను, చిమ్మచీకటి వలె నల్లనయియున్న తన తనువును కూడా పరిభవిస్తాడేమో ననే భయము చేతనో యనునట్లు కృష్ణుని చేతను, బాగుగా స్తుతింపబడిన సూర్యుని తొలి వెలుగు మొలక మీ రక్షణమున బ్రవర్తించుగాక!

## అనువాదపద్యం

సీ. తలమీది సిగపూవు తళుకు తత్తడివీడు- తాదీసికొనిపోవఁదలచినాడొ
కమలాసనంబుల కనువిప్పు కలిగించి- తత్పతిత్వము నంది దరుమునేమొ
నల్లని చీకట్ల నణగార్చు నైజాన- నామేను వీడది నష్టపరచు
అనియిట్లు శంకరుడజుడు కృష్ణుడుగూడ- భాస్కరుమదిదల్చి భయముపడిరొ!

గీ. యనగ మొగిసిన యాదిత్యునంశుతతులు
ముప్వురైనట్టి వేల్పుల ముచ్చటైన
నుతులనందుచు మీవి దుర్గతులనడచి
రక్షకములుగ సాగుత రక్షణమున.

శ్లో॥ విస్తీర్ణం వ్యోమ దీర్ఘాస్సపది దశదిశో వ్యస్తవేలాంభసోబ్ధీ-
స్కుర్వద్భిర్ద ృశ్యనానానగనగర నగాభోగపృథ్వీం చ పృథ్వీమ్
పద్మిన్యుచ్ఛ్వాస్యతే యైరుషసి జగదపి ధ్వంసయిత్వా తమిస్రా-
ముస్రా విస్రావయంతు ద్రుతమనభిమతం తే సహస్రత్విషో వః ॥17 ॥

## తాత్పర్యము

ఉషఃకాలములో ఉదయించి, చిమ్మచీకటి రాత్రిని నశింపజేసి, యొక్కమారుగా నాకాశమును విస్తృతముగను, దశదిశలలో దీర్ఘములుగను, సముద్రములను దరుల జలముజల్లునవిగను, భూమిననేకములగు నగరములు పర్వతములు వృక్షములు గోచరించుటచే విశాలమయినదిగను నొనర్చుచు, పద్మలతలను జగత్తును సంతోషపరచుచున్న సహస్రకిరణుని కిరణములు శీఘ్రముగా మీ యనిష్టముల నశింపజేయుగాక!

## అనువాదపద్యం

సీ. ఆదిత్యకిరణంబులంబరవీధిని- దశదిశల్ గ్రమ్మరి దాటి నేల
పుడమిపై నున్నట్టి పురనగాబ్ధులపైన- పడి చీకటులనన్ని పారద్రోలి
ఉత్ఫుల్లకమలాలకుచ్ఛ్వాసమును గూర్చి- కరసహస్రములతో కౌగిలించి
సప్తాశ్వసంఖ్యతో సప్తవర్ణములకు- సంహతినొనగూర్చి స్వాస్థ్యమిచ్చి

గీ. అర్ఘ్యమిచ్చెడి భక్తుల కభయ మొసగి
ఆయురారోగ్య సంతతులమర జేసి
ఆర్తినర్చించు మీ యొక్క అఘము బాపి
ఇష్టతతులను చేకూర్చు నిలను మీకు.



శ్లో॥ అస్తవ్యస్తత్వశూన్యో నిజరుచిరనిశానశ్వరః కర్తుమీశో
విశ్వం వేశ్మేవ దీపః ప్రతిహతతిమిరం యః ప్రదేశస్థితోఽపి
దిక్కాలాపేక్షయాఽసౌ త్రిభువనమటత స్తిగ్మభానోర్నవాఖ్యాం
యాతశ్శాతక్రతవ్యాం దిశి దిశతు శివం సోర్చిషాముద్గమో వః ॥ 18 ॥

## తాత్పర్యము

దీపము గృహమునందలి చీకటి నొక్కచోట నుండియే తొలగింపగలదు. అట్లే సూర్యకిరణోద్గమము కడా దానివలెనే విశ్వమందలి తమమునొక్కచోట నుండియే తొలగింపగలదు. కానీ యిది దీపమున కంటే కొన్ని విశిష్ట లక్షణములు గలది.

దీపము అస్తవ్యము, తత్త్వశూన్యము. కిరణోదయము అస్తవ్యస్తత్వ శూన్యము అనగా వినాశబాధారహితమైనది. దీపము అనిజరుచి. అనగా సహజకాంతి లేనిది. తైలాదులవలన ప్రాప్తించు కాంతి గలది. కిరణోదయము నిజరుచి అనగా సహజకాంతి కలది. అది అనిశానశ్వరము. పగట నశించునది. ఇది అనిశ.అనశ్వరము = ఎప్పుడు నశింపనిది. మఱియు ముల్లోకములో నిరంతరము చరించే ఈ సూర్యుని కిరణోదయమునకు క్రొత్తదనముగాని ప్రాతదనముగాని లేదు. కానీ దిక్కాల విభాగవశమున తూర్పు దిశయందు క్రొత్తదియని పేర్కొనబడుచుండును. అట్టి కిరణోదయము మీకు మంగళము నిచ్చుగాక!

## అనువాదపద్యం

సీ. అంబరమణి గాంచి యాకాశదీపమం-చుపమించి పోల్చుట ఉచితమగునె?
దీవమస్తవ్యంబు తిరమగుతత్త్వము-దాన వెదికి జూడ ్గానరాదు
తిరమయ్యు నవతను దిక్కాలభేదాల-దినమణిదీప్తులు తేజరిల్లు
తనతనంబగు కాంతి దనరారు తరణితో-తనుకాంతిగల దివ్వెతలపదగునె!

ఆ.వె. పుట్టిగిట్టుచుండు పుడమిని దీవము-పగలు కానరాదు పాటవమున
తూర్పు దిక్కునందు తొలికిరణచయము-మీకు శుభములిచ్చి మిమ్ము గాచు.

శ్లో॥ మాగాన్మ్లానిం మృణాళీమృదురితి దయయేవాప్రవిష్టోఽహిలోకం
లోకాలోకస్యపార్శ్వం ప్రతపతి న పరం యస్తదాఖ్యార్థమేవ
ఊర్ధ్వం బ్రహ్మాండఖండస్ఫుటనభయపరిత్యక్తధైర్యో ద్యుసీమ్ని
స్వేచ్ఛావశ్యావకాశావధిరవతు సవస్తాపనో రోచిరోఘః ॥ 19 ॥

## తాత్పర్యము:

తామరతూండ్ల వలె మృదువులగు సర్పములు వడలిపోవునేమో యను దయచేతనోయన్నట్లు సర్పలోకమును (పాతాళమును) ప్రవేశింపనిదియు, లోకాలోకపర్వతము యొక్క పేరు సార్థక మొనర్చుటకో యనునట్లు దాని యావలి ప్రక్కను ప్రకాశింపనిదియు,పైనున్న బ్రహ్మాండ భాండము భగ్నమగుననెడు భయముచేతనో యనునట్లు దీర్ఘముగా బ్రసరింపనిదియు, నాకాశమంతయు దన యిచ్ఛననుసరించి ప్రసరింపగలదియునగు సూర్యకాంతి ప్రవాహము మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యం

సీ. తామరతూడుల తనుమార్దవము గల- దందశూకము లూష్మదాళలేవు
దానిపేరునునిల్ప దపియింపరాదులో- కాలోకభూధ్రంపుటవలి దరిని
బ్రహ్మాండశీర్షంబు బ్రద్దలైపోవును- మింటను కిరణాలు మీదుకేగ
గాన నాకాశమార్గాన తన కిరణ- తతులను సారించి తరణి స్వేచ్ఛ

ఆ.వె. కలిగియుండి కూడ కాంతినదుపులోన
నుంచి ప్రాణికోటి నెంచి బాధ
పెట్టకుండ నట్టి వెల్లువ కిరణాళి
రాగమలర మీకు రక్ష యగుత!

శ్లో॥ అశ్యామః కాల ఏకో న భవతి భువనాంతోఽపి వీతేంఽధకారే
సద్యః ప్రాలేయపాదో న విలయమచలశ్చంద్రమా అప్యుపైతి
బంధస్సిద్ధాంజలీనాం న హి కుముదవనస్యాపి యత్రోజ్జిహానే
తత్ప్రాతః ప్రేక్షణీయం దిశతు దినపతేర్ధామ కామాధికం వః॥ 20 ॥

## తాత్పర్యము:

ఏది ఉదయింపగనే అంధకారము తొలగుటచే కాలమొక్కటియే కాక లోక మధ్యభాగమంతయు అశ్యామమగునో, మంచుకొండ పాదము మాత్రమే కాక చంద్రుడు కూడా విలయమందునో, సిద్ధుల దోయిళ్లు మాత్రమే కాక కలువల గుంపులును ముకుళించుకొనునో, అట్టి సూర్యతేజము ప్రాతఃకాలమున దర్శనీయమైనదై మీ కోర్కెలను మించి ఫలములనిచ్చుగాక!

ఈ శ్లోకంలో 'అశ్యామము, విలయము'-అనే పదాలలో శ్లేష గమనించదగినది. అశ్యామ పదానికి కాలపక్షంలో, రాత్రిరహితమైనది, లోకపక్షంలో నల్లదనం లేనిదని అర్థం చెప్పుకోవాలి.అలానే విలయమంటే, మంచుకొండ పక్షంలో కరిగి నశించేదనిన్నీ, చంద్రుని పక్షంలో కాంతిహీనుడనిన్నీ అర్థం గ్రహించాలి.

## అనువాదపద్యం:

సీ. యెవ్వానిధీదితులించుక బ్రసరింప- తొందర తిమిరమ్ము తొలగిపోవు
నెవ్వాని కిరణంబులేపుగా నింపును- భువనాండమంతయు భూరి కాంతి
యెవ్వానిజ్యోతిస్ఫులెంతయు కరిగించు- మంచుమలలకూడ మహినింజూడ
యెవ్వాని వెలుగున నిందుండు చూడగా- వెలవెలబోవును వెలుగువీడి

ఆ.వె. ఏకకాలమందు నేవెలుగును జూచి-కూర్మి సిద్ధ కరము కుముదవనము
ముకుళితంబులౌను ముక్తిని బొందగా-నట్టి వెలుగు కోర్కెలన్ని దీర్చు.

శ్లో॥ యత్కాంతిం పంకజానాం న హరతి కురుతే ప్రత్యుతాధిక్యరమ్యాం
నో ధత్తే తారకాభాం తిరయతి నితరామాశు యన్నిత్యమేవ
కర్తుం నాలం నిమేషం దివసమపి వరం యత్తదేకం త్రిలోక్యా-
శ్చక్షుస్సామాన్యచక్షుర్విసదృశమఘభిద్భాస్వతస్తాన్మహో వః॥ 21 ॥

## తాత్పర్యము:

ముల్లోకములకు సామాన్య నేత్రముల కంటే విలక్షణమయిన యొకేయొక్క నేత్రమయిన సూర్యుని తేజము మీ పాపముల భేదించునదగుగాక! యని ప్రధాన వాక్యార్థము. ఆ విలక్షణత యెట్టిదనగా, సామాన్యనేత్రము పద్మముల కాంతిని తన యందముచే హరిస్తుంది. సూర్యతేజము పద్మముల కాంతిని హరింపక దాని నింకను పెంపొందించి మరింత సుందరంగా చేస్తుంది. సామాన్య నేత్రము తారకాభను పొందుతుంది అంటే, నల్లని కనుగ్రుడ్ల యందమును పొందుతుందని భావము. సూర్యతేజము తారకల నక్షత్రముల కాంతిని బొందక దానిని తిరస్కరిస్తుంది. సామాన్య నేత్రము నిమేషమును (రెప్పపాటును) చేస్తుంది. సూర్యతేజము నిమేషమును మాత్రమే కాక దినమును కూడా చేస్తుందని భావము.

## అనువాదపద్యం:

సీ. లోకబాంధవునిను లోకంపుకన్నుగా-భావించుటెంతయుఁబాడి గాదు
కందోయి మించియు కంజపు శోభను-క్రిందుజేయును గాక యందమొప్పి
భాస్కరునేత్రమ్ము పద్మంపుశోభను-పెంపుజేసియు జూవు నింపుగాను
లోకంపుకనుగవ లోవల ధరియించు-తారకావళిశోభ తానుగాను

ఆ.వె. తరణి కన్నువెలుగు తారకాదీప్తిని
అతిశయించి వెలుగుననవరతము
నేత్రమెపుడు సల్పు నిమేషమటులగాక
దినము మిన్న జేయు దివసకరుడు.

శ్లో॥ క్ష్మాం క్షేపీయః క్షపాంభశ్శిశిరతరతల స్పర్శతర్షాదృతేవ
ద్రాగాశా నేతుమాశాద్విరదకరవరః పుష్కరాణీవ బోధమ్
ప్రాతః ప్రోల్లంఘ్య విష్ణోః పదమపి కృపయేవాతివేగాద్దవీయ-
స్యుద్దామం ద్యోతమానా దహతు దినపతేర్దుర్నిమిత్తం ద్యుతిర్వః ॥ 22 ॥

## తాత్పర్యము:

మంచునీటిచే మిక్కిలి చల్లనిదగు ప్రదేశమును స్పృశించు కోర్కెచేతనో యనునట్లు వేగముగా భూమిని జేరినదియు, దిగ్గజముల తుండములనెడు సరస్సులందలి పద్మములను వికసింపజేయుటకో యనునట్లు శీఘ్రముగా దిక్కులను జేరునదియు, ప్రత్యూషకాలమున విష్ణుపదమును దాటి వెడలియు ఇంతేనాయని లజ్జనొందినదో యనునట్లు మిగుల వేగముతో దూరమున కేగుచున్నదియు, మిక్కిలి ప్రకాశించుచున్నదియు నగు సూర్యుని కాంతి మీ దుఃఖముల దహించుగాక!

## అనువాదపద్యం

సీ. నీహారసిక్తయౌ నీరంధ్ర పుడమిని- తన కరములతోడ తాకనెంచి
దిక్కరికరసరోదీర్ఘికాబ్జమువిక- సింపఁజేయ దిశలఁజేర్చునట్లు
ప్రాభాతకిరణాల ప్రసరణంబున నింగి- దూరంపుతీరాల దూరి సారి
విష్ణుపదమిదియ వేగంబుతో దాట- సిగ్గుచేటిది మాకు నగ్గలముగ

గీ. ననుచు పారెడి కిరణాల యరుణమదియ
భానతోడను బాధల బాపగాను
వచ్చుచున్నది లోకాల వరద యనగ
అట్టి కిరణాళి దురితములడచుగాక!

శ్లో॥ నోకల్పాపాయవాయోరదయరయదళత్క్ష్మాధరస్యాపి గమ్యా
గాఢోద్గీర్ణజ్జ్వలశ్రీరహని న రహితా నో తమఃకజ్జలేన
ప్రాప్తోత్పత్తిః పతంగాన్న పునరుపగతా మోషముష్ణత్విషో వో
వ రిస్సేవాన్యరూపా సుఖయతు నిఖిలద్వీపదీపస్య దీప్తిః ॥ 23 ॥

## తాత్పర్యము:

సూర్యదీపదీప్తి సాధారణదీపకాంతికన్న విశిష్టమైనది. అది మహాపర్వతాలనుసైతం పెకిలించగల ప్రళయకాల ప్రభంజనంచేత కూడా నశింపజేయబడదు. పగటివేళకూడా బాగా ప్రకాశిస్తుంది. చీకటివంటి కజ్జలం అసలే లేనిది. పతంగకృతవినాశము లేనిదే కాదు, పైగా పతంగ(సూర్య)కృతమైన ఉత్పత్తి కలది. అటువంటి ద్వీపములన్నింటికీ దీపమువంటివాడైన సూర్యునియొక్క దీప్తి మిమ్ములను సుఖింపజేయుగాక! అని భావము.

## అనువాదపద్యము:

సీ. పర్వతోన్మూలనపటువౌ ప్రభంజన- మాదిత్యదీపమునార్పలేదు.
దినమున దీప్తితో దినకరదీపంబు- కజ్జలరహితమై కాంతినీను
పాతంగమగు దీప్తి పాతంగపతనము- నోపి జీవనమిచ్చి యూరడించు
వెలుగుల వెల్లువ వెలువర్చి ద్వీపాల- నున్నట్టి తిమిరాల నూదివేయు

గీ. అట్టి దీప్తులందరానందమందగా-
నలముకొన్నవవియె యాకసమున
నిఖిలదీవులందు, నింగిని వెలుగొంది
నంతరించు మీకు సతతసుఖము.

శ్లో॥ నిశ్శేషాశావపూర ప్రవరగురుగుణశ్లాఘనీయస్వరూపా
పర్యాప్తం నోదయాదౌ దినగమనమయోపప్లవే2ప్యున్నతైవ
అత్యంతం యానభిజ్ఞా క్షణమపి తమసా సాకమేకత్ర వస్తుం
బ్రధ్నస్యేద్ధా రుచిర్వో రుచిరివ రుచిరస్యాప్తయే వస్తునో2స్తు॥ 24 ॥

## తాత్పర్యము:

ఈ శ్లోకంలో శ్లిష్టమైన రుచి అనే శబ్దానికి ఇచ్ఛ-కాంతి అనే అర్థాలను భావిస్తే సూర్యేచ్ఛవంటిదైన సూర్యకాంతి మీయభీష్టములనొసగుగాక! అని ప్రధానవాక్యార్థము.అది సమస్తములైన ఆశలను (దిక్కులను-కోరికలను) పూరిస్తుంది. ఉదయాస్తమయము(అభ్యుదయ వినాశము)ల రెండింటను ఉన్నతమైనది. క్షణమైనను తమస్సు(చీకటి-అజ్ఞానము)తో కలసియుండుట నెఱుగదు. అట్టి సూర్యకాంతి మీ కోరికలనీడేర్చుగాక!

## అనువాదపద్యము:

సీ. ఏ సూర్యదీధితు లెల్లదిక్కుల నిండి- వరగుణశ్లాఘను వరలుచుండు
ఎవ్వాని కిరణంబు లేకరీతిగ దోచు- నుదయాస్తమయముల నున్నతిగని
ఏ భానురోచిస్సులెప్పుడు చీకట్ల- సహవాసదోషము సైపలేవొ
ఏయినకాంతులవెల్ల జీవులకును- ఆయురారోగ్యాల నందజేయు

గీ. అట్టి భానుని రోచిస్సు లభిరుచి వలె-
నిష్టములనిచ్చి బాపగ కష్టములను
అవనికరుదెంచి రయముననన్నిసిరుల-
నందజేయుత! మీకవి యనవరతము.

శ్లో॥ బిభ్రాణశ్శక్తిమాశు ప్రశమితబలవత్తారకౌర్జిత్యగుర్వీం
కుర్వాణో లీలయాధశ్శిఖినమపి లసచ్చంద్రకాంతావభాసమ్
అదధ్యాదంధకారే రతిమతిశయినీమావహన్వీక్షణానాం
బాలో లక్ష్మీమపారామపర ఇవ గుహో2హర్పతేరాతపో వః ॥ 25 ॥

## తాత్పర్యము:

కుమారస్వామిని పోలిన సూర్యుని బాలాతపము (లేయెండ) మీకనంతమగు సంపదను గల్గించుగాక! యని ప్రధాన వాక్యార్థము. బాలాతపము తారకల మహాతేజమును నశింపజేసిన గొప్ప శక్తిగలది. కుమారస్వామి బలవంతుడగు తారకాసురుని ఔద్ధత్యమును హరించిన గొప్ప శక్తిని (ఆయుధము) ధరించినవాడు. ఒప్పుచున్న చంద్రుని ప్రకాశము, అగ్నిని సవిలాసముగా తిరస్కరించినది బాలాతపము. ఒప్పుచున్న చంద్రకముల చివరలచే ప్రకాశించుచున్న శిఖిని వాహనముగా దనక్రింద నుండజేసినవాడు కుమారస్వామి. అంధకారమున నున్న చక్రవాక పక్షుల నేత్రముల కమితాహ్లాదమును గలిగించునది బాలాతపము. ఈశ్వరుని యొక్క కన్నులకు అమితానందమును గూర్చువాడు కుమారస్వామి.

## అనువాదపద్యము:

సీ. తారకుదునుమాడ దాశక్తి ధరియించి- సాహిణి నడిపెను షణ్ముఖుండు
తారకాతేజంబు తనదుకాంతులలోన- తలమున్కలిడజేసి తరణి యొప్పు
చంద్రకాంచిత శిఖి చక్కనెక్కియునేగు- షాణ్మాతురుండగు శక్తిధరుడు
మహితతేజోమూర్తి మార్తాండుడవనిని- చంద్రాగ్నితేజముల్జప్పళించు
గీ. అంధకారి కనుల కానందమొకడిచ్చు- నంధకారమంత నార్పు నొకడు
బాలభానుకాంతి భాసించి గుహునిగా- మీకు సిరులనిచ్చు మితిని మీరి.





శ్లో॥ జ్యోత్స్నాంశాకర్షపాండుద్యుతి తిమిరమషీశేషకల్మాషమీష
జ్జృంభోద్భూతేన పింగం సరసిజరజసా సంధ్యయా శోణశోచిః
ప్రాతః ప్రారంభకాలే సకలమివ జగచ్చిత్రమున్మీలయంతీ
కాంతిస్తీక్ష్ణత్విషో2క్ష్ణాం ముదముపనయతాత్తూలికేనాతులాం వః॥ 26 ॥

## తాత్పర్యము:

ఉదయ ప్రారంభ సమయమున వెన్నెల వెలుగుల తెలుపు కాంతియు, చీకటియనెడు మహీశేషము యొక్క నల్లదనమును గలదిగా వికసించిన పద్మముల నుండి వెలువడిన పుప్పొడుల పచ్చదనమును, సంధ్యాకాలపుటెఱ్ఱదనమును గల జగత్తును చిత్రకారుని కుంచె, రంగుల చిత్రమువలె వెలువరించుచున్న సూర్యుని కాంతి మీ కన్నులకు సాటిలేని యానందము నందించుగాక.

## అనువాదపద్యము:

సీ. ప్రాభాతకాలంపు ప్రాభవంబును జాటు- చల్లని వెన్నెల తెల్లదనము
చిరుత చీకటిచాయ చీరకట్టిన యట్టి- నల్లదనముతోడి వల్లెవాటు
ఆవులించుచున్న యరవిందమధ్యపు-పరువంపు పుప్పొడి పచ్చదనము
తొలిసంజ కెంజాయ దోరంపు ప్రాభాత-సుందరీమణికయ్యె సోయగంబు
గీ. రంగులన్నిటినిట్టుల రంగరించి
సూర్యకిరణాలు కంటికి సుఖమునెపుడు
కూర్చునెపమున చిత్రంపు కుంచెతోడ
వ్రాయుచున్నవి ప్రాభాతవర్ణపటము.

శ్లో॥ ఆయాంతీ కిం సుమేరోస్సరణిరరుణితా పాద్మరాగైః పరాగై-
రాహోస్విత్స్వస్య మాహారజనవిరచితా వైజయంతీ రథస్య
మాంజిష్ఠీ ప్రష్ఠవాహావళివిధుతశిరశ్చామరాళీ ను లోకై
రాశుక్యాలోకితైవం సవితురఘనుదే స్తాత్రృభాతప్రభా వః॥ 27 ॥

### తాత్పర్యము:

పద్మరాగమణుల ధూళులచే నెఱ్ఱవడినట్టి సుమేరుపర్వతంనుండి వచ్చుచున్న మార్గమా! లేక కుసుమపుటెఱుపురంగు (కౌసుంభరాగము) గల తన రథపతాకయా, లేక శ్రేష్ఠములగు గుఱ్ఱముల కదల్పబడిన తలలపై నొప్పు మాంజిష్ఠరాగ రంజితమగు చామర సముదాయమా? యని యిట్లాశంకించి లోకులచే జూడబడుచున్న సూర్యుని ఉదయకాంతి మీ పాపముల దొలగించుగాక.

### అనువాదపద్యము:

సీ. పద్మరాగపు ధూళి పారుచునున్న సు- మేరుపర్వత శోభమించె ననగ
కాదేని సూర్యుని కమనీయ రథమున- నమరిన ధ్వజపటి యరుణిమనగ
నదియును గాకున్న నతని సప్తాశ్వాల- ప్రచలిత చామరప్రభలనంగ
నిట్లు వేనోళ్ల నా యిను కిరణచయము- వేవిధంబులనగ వివిధ గతుల

గీ. జనమనంబులు జొచ్చియు జాలువారె
పటుతరోపమా చాతురీ పాటవమున
అట్టి ప్రాభాత కిరణాళి యందఱకును
ద్రుంచి యఘముల నాయువు బెంచుగాక!





శ్లో॥ ధ్వాంతధ్వంసం విధత్తే న తపతి రుచిమన్నాతిరూపం వ్యనక్తి
న్యక్త్వం నీత్వాపి నక్తం న వితరతితరాం తావదహ్నస్త్విషం యః
న ప్రాతర్మా విరంసీదసకలపటిమా పూరయన్యుష్మదాశా
మాశాకాశావకాశావతరణతరుణప్రక్రమోఽర్కప్రకాశః ॥28 ॥

### తాత్పర్యము:

గాఢతమన్సును ధ్వంసము చేసన్తానే తాపమును కలిగింపనిదియు, కాంతి కలదైనప్పటికిని, స్వస్వరూపమును ప్రకటింపనిదియు, రాత్రిని పారద్రోలునదైనప్పటికిని, పగటికాంతి నతిశయింపజేయనిదియు, ఆశాకాశాంతరాళమున వ్యాపింపజాలిన శక్తి గలదియయ్యు, తన సామర్థ్యమునంతను ప్రకటింపనిదియునగు ఉదయసూర్యునియొక్క ప్రకాశము మీ కోర్కెలను మఱల మఱల తీర్చుచు విరమింపకుండుగాక!

### అనువాదపద్యము:

సీ. అజ్ఞాన తిమిరమ్మునపహరించునుగాని- చండతాపమ్ముతో జంపబోడు
వేవేల కిరణాల వెల్లువలీనుచు- వెతల బాపునుగాని వేచబోడు
పాపంపు రాత్రిని పారద్రోలునుగాని- పగటినేమాత్రము బాయడతడు
ఆనభోంతముల నాక్రమించియుగూడ- తరుణారుణప్రభఁ దనరుచుండు

గీ. సద్గురుని బోలు లక్షణసామ్యమలర- బాలభానుడుదయగిరిభాసమాను
డగుచునుదయించె లోకపుటార్తి దీర్ప- ఆశలన్నింటి దీర్చుత! నతడు మీకు.

శ్లో॥ తీవ్రం నిర్వాణహేతుర్యదపి చ విపులం యత్ప్రకర్షేణ చాణు
ప్రత్యక్షం యత్పరోక్షం యదిహ యదపరం నశ్వరం శాశ్వతం చ
యత్సర్వస్య ప్రసిద్ధం జగతి కతిపయే యోగినో యద్విదంతి
జ్యోతిస్తద్ద్వి ప్రకారం సవితురవతు వో బాహ్యమాభ్యంతరం చ॥ 29 ॥

**తాత్పర్యము:**

బాహ్యంగా-తీక్ష్ణము,విశాలము,ఇంద్రియ గోచరము, సన్నిహితము, నశించునది,సర్వులచే తెలియబడునది; ఆంతరముగా- నిర్వాణ కారణము, అత్యంత సూక్ష్మము, ఇంద్రియగోచరము కానిది, దూరస్థము, శాశ్వతమైనది, కొలదిమంది యోగులచే మాత్రమే తెలియబడునది, అయి ఇలా బాహ్యాభ్యంతరములైన ద్వివిధరూపాలతో చరించే సూర్యునియొక్క తేజము మిమ్ము రక్షించుగాక!

**అనువాదపద్యము:**

సీ. తీవ్రమైనదియయ్యు తెగటార్చు భవమును- అతివిపులంబయ్యు నణుతరంబు
ప్రత్యక్షమదియంద్రు భావగోచరమది- ఇహపరమ్ములనది నీల్గుచుండు
నాశమ్ములేనిదై నశ్వరంబుగ దోచు- బాహ్యాంతరంబుగా బరగుచుండు
లోకబాంధవుడన లోకులెల్లరకును- తెలిసియు నేతికి దెలియదతడు

ఆ.వె. ఇట్టు లిరుతెరంగు లినతేజమునుజూడ- యోగివర్యులొండె యోగదృష్టి
చూడగలరుగాని చూడలేరితరులు- కరములవియ మనల గాచుగాత!





శ్లో॥ రత్నానాం మండనాయ ప్రభవతి నియతోద్దేశలబ్ధావకాశం
వహ్నేర్దార్వాది దగ్ధుం నిజజడిమతయా కర్తుమానందమిందోః
యత్తు త్రైలోక్యభూషావిధిరఘదహనం హ్లాది వృష్ట్యాశుతద్వో
బాహుళ్యోత్పాద్యకార్యాధికతరమవతాదేకమేవార్కతేజః ॥ 30 ॥

**తాత్పర్యము:**

రత్నముల తేజము పరిమితప్రదేశములందు మాత్రమేయుండి అలంకారముగా నుపయోగిస్తుంది. అగ్నితేజము కట్టెమున్నగు ఇంధనములను దహింపగలదు. చంద్రకాంతి తన చల్లదనమున నానందము నీయగలదు. కానీ సూర్యకాంతి యొక్కటియే ముల్లోకముల కలంకారమై, పాపదాహకమై వృష్టిచే నాహ్లాదదాయకమై యొప్పును. ఇట్లు బహువిధకార్యోత్పాదనార్థమధికతరమై ప్రకాశించు సూర్యతేజము మిమ్ము శీఘ్రముగా రక్షించుగాక.

**అనువాదపద్యము:**

సీ. రత్నకాంతులవియ రాజిల్లునెలవుల- పొదగబడినవయ్యు పోడిమిగను
అగ్నితేజమదియు, యన్ని దార్వాదుల- తగులబెట్టునుగాని దనరనీదు
ఆహ్లాదకరమయ్యునాచంద్రతేజస్సు- జడిమనుపెంచును జాగునిడును
అన్నిటి మిన్నగా నర్కతేజముజూడ- నద్భుతముగా దోచునవనిలోన

గీ. అఘము హరియించు నాహ్లాదమలరజేయు- వృష్టి ఘటియించు పంటల వృద్ధిజేయు
ఆయురారోగ్యములనిచ్చి యాదుకొనుచు- నర్కతేజము మీకిల నగుత రక్ష.

శ్లో॥ మీలచ్చక్షుర్విజిహ్మశ్రుతి జడరసనం నిఘ్నితఘ్రాణవృత్తి
స్వవ్యాపారాక్షమత్వక్పరిముషితమనః శ్వాసమాత్రావశేషమ్
విస్రస్తాంగం పతిత్వా స్వపదవహరతాదశ్రియం వో2ర్కజన్మా
కాలవ్యాలావలీఢం జగదగద ఇవోత్థాపయన్ప్రాక్ప్రతాపః ॥ 31 ॥

## తాత్పర్యము:

కాలమనెడు సర్పముచే దష్టమై కన్నులు మూతపడి, చెవులు వినిపించక, నాలుక రుచి నెఱుగక, ముక్కు వాసన చూడక చర్మము స్పర్శనెఱుగక మనస్సు పనిచేయక శ్వాస మాత్రమే మిగిలి శిథిలములగు నవయవములతో పడి నిద్రించు లోకమును విషాపహరణౌషధమువలె మేలుకొలుపు సూర్యుని తొలికాంతి మీ అలక్ష్మిని దొలగించుగాక!

## అనువాదపద్యము:

సీ. కాలసర్పము తమ్ము కాటువేయగ నాటి- తేయిని కనుగవ తెప్పలుడిగె
రుచుల నానగలేక స్రుక్కిపోయెను జిహ్వ- మూర్కొనజాలక ముక్కునుడిగె
కర్ణరంధ్రమ్ముల గడియలుపడిపోయె- చర్మేంద్రియమునకు స్పర్శపోయె
ప్రాణమ్ము శ్వాసలోపచరించుచును నీల్గ- జీవచ్ఛవమ్ములై జీవులుండ

ఆ.వె. జాంగలికుని వోలె జలజబంధుడు వచ్చి
విషహరణచికిత్స వేగ జేసి
జీవులన్నింటికిని జీవనశ్రీనిచ్చి
మేలుకొల్పు తొంటి మిహిరకాంతి ॥





శ్లో॥ విశ్యేషం నైశమంభః ప్రసభమపమదన్న శ్రులేశానుకారి
స్తోకస్తోకాపనీతారుణరుచిరచిరాదస్తదోషానుషంగః
దాతా దృష్టిం ప్రసన్నాం త్రిభువననయనస్యాశు యుష్మద్విరుద్ధం
వధ్యాద్బ్రధ్నస్య సిద్ధాంజనవిధిరపరః ప్రాక్తనోర్చిః ప్రచారః ॥ 32 ॥

## తాత్పర్యము:

రాత్రి కురిసిన మంచుబిందువులను కన్నీటి బిందువులవలె వేగముగా పూర్తిగా తొలగించి, క్రమక్రమముగా కొంచెము కొంచెమెఱ్ఱదనాన్ని పోగొట్టి, దోషానుబంధాన్ని వదలించి, ముల్లోకముల కన్నులకు నిర్మల దృష్టిని ప్రసాదించుచున్న సిద్ధాంజనము వంటిదైన సూర్యుని ఉదయ కిరణప్రసారము మీ యనిష్టములను వేగముగా బోద్రోలుగాక!

## అనువాదపద్యము:

సీ. అశ్రుకణములబోలు యాతేయి నీహార- వర్షధారలవన్ని పారద్రోలి
కొద్దికొద్దిగ తాను కోసి చీకటులను- అరుణకాంతులవని నాక్రమించె
మూడు లోకములకు మోదంపుదృష్టిని- సిద్ధాంజనంబన సిద్ధపరచి
ప్రాచీదిశాభాస రోచిస్సులను బంపి- యఘములన్నింటిబాపు నర్కుడనగ

ఆ.వె. ఏడు వర్ణములమరియు నీడుగాను-
కీడుబాపెడి సూర్యుని కేలనంగ
భానుపుంజము భూమిని పారవచ్చె
నది యరిష్టములన్నింటి నడచుగాక!

శ్లో॥ భూత్వా జంభస్య భేత్తుః కకుభిపరిభవారంభభూశ్శుభ్రభానో
ర్బిభ్రాణా బభ్రుభావం ప్రసభమభినవాంభోజజృంభాప్రగల్భా
భూషాభూయిష్ఠశోభా త్రిభువనభవనస్యాస్య వైభాకరీ యా
విభ్రాంతి భ్రాజమానా విభవతు విభవోద్భూతయే సా విభా వః॥ **33** ॥

## తాత్పర్యము:

ఇంద్రుని దిక్కున ఉదయించి, చంద్రుని పరిభవించి, కొంచెం ఎఱ్ఱదనము వహించి, పద్మములను వికసింపజేసి, యీ త్రిభువనములనెడు భవనమున కధిక భూషణకాంతిని గలిగించి, ఆశ్చర్యకరముగా ప్రకాశించు సూర్యుని కాంతి మీకు సంపదలను సమకూర్చుటయందు సమర్థమగుగాక!

## అనువాదపద్యము:

సీ. తామసాసురుఁగూల్ప తరణికయ్యెను గాదె- జంభారికకుభమ్ము జన్మభూమి
బభ్రువర్ణముతోడ భాసిల్లువాడుగా- వికసనంబును గూర్చె విరుల కతదు
అంభోజమిత్రుడై యరుగుదెంచినవాడు- ముల్లోకములభూష మోదమొప్ప
ప్రాచీదిశోద్భాసి ప్రాభాకరంబైన- యర్చిస్సులందీయనన్నిసిరుల-

గీ. నతిరయంబున నాకాశమందు దిశల
యందున తన శోభ దనర నర్కుడిలకు
నేగు దెంచుచు లోకాల యేదుగడను
అహరహమ్మున రక్షించి యాదుకొనును.





శ్లో॥ సంసక్తం సిక్తమూలాదభినవభువనోద్యానకౌతూహలిన్యా
యామిన్యా కన్యయేవామృతకరకలశావర్జితేనామృతేన
అర్కాలోకః క్రియాద్వో ముదముదయశిరశ్చక్రవాళాలవాలా-
దుద్యన్బాలప్రవాళ ప్రతిమరుచిరహః పాదపప్రాక్ప్రవాళః॥ **34** ॥

## తాత్పర్యము:

భువనమనే ఉద్యానవనమును పెంచు కుతూహలము గల రాత్రియనెడు కన్యచే నమృతకిరణుడనెడు కలశముతో గ్రుమ్మరింపబడిన యమృతమనే జలముచేత నిరంతరము తడుపబడినదియు, ఉదయపర్వతశిఖరములనెడి యాలవాలము నుండి మొలకెత్తినదియునగు దివసమను వృక్షము యొక్క లేత చిగురాకు వంటి కాంతి గల తొలి పల్లవమగు సూర్యకాంతి మీ కానందము కూర్చుగాక!

## అనువాదపద్యము:

సీ. క్రొంగ్రొత్త పూదోట కోరిక మొలకెత్త - రాకానిశాకాంత రాగమలర
అమృతాంశు హస్తాన నమృతభాండమ్ముగా - ధరియించి ధరణిని దడిపె సుధల
పసిడి నాగళ్లతో పదునుబారగజేసె- నుదయ పర్వతసీమ నూర్జితముగ
పాదుజేసిన నేల పగటిచెట్టునునాటి- వెలుగుల చెట్టుకు బలముగూర్ప

గీ. నపుడె యా చెట్టు పెరిగిపోయబ్బురముగ
నందు చిగురాకు జొంపాలునందగింప
భువనమంతయు బంగారుభవనమయ్యె
ననగ నానందమొదవునయ్యర్కకాంతి ॥

శ్లో॥ భిన్నం భాసారుణస్య క్వచిదభినవయా విద్రుమాణాం త్విషేవ
త్వంగన్నక్షత్రరత్న ద్యుతినికరకరాళాంతరాళం క్వచిచ్చ
నాంతర్నిశ్శేషకృష్ణశ్రియముదధిమివ ధ్వాంతరాశిం పిబన్స్తా
దౌర్వఃపూర్వోవ్యకపూర్వో గ్నిరివ భవదఘప్లుష్టయేకర్కావభావః ॥ 35 ॥

## తాత్పర్యము:

ఒక్కచో వినూత్నమైన పగడముల కాంతిచేతవలె, అరుణకాంతితో అలంకరింపబడినదియు, నొక్కచో ప్రకాశించు నక్షత్రములనెడు రత్నముల కాంతులతో మిలమిలలాడుచున్న మధ్యభాగముగలదియు, నాంతర్నిశ్శేషకృష్ణశ్రియయు(అనగా చీకటిపక్షంలో మధ్యభాగంలో తొలగని నల్లదనము కలదని, సముద్రపక్షంలో శేషకృష్ణుల శోభకలదనిన్నీ అర్థం)నై, చిమ్మచీకటిని సముద్రమువలె గ్రసించుచున్న యపూర్వమగు బడబాగ్నివంటిదయిన పూర్వదిగ్భవమైన సూర్యతేజము మీ పాపముల నశింపజేయుగాక!

సీ. నిశి నిష్క్రమింపగా నింగిని దోచును- సూర్యకిరణశోభ సోయగంబు
తూర్పువాకిలిలోన దోరంపు పవడాల- నారవోసిన యట్టులరుణకాంతి
ఆప్రక్క చూడగా నటనట చుక్కల- మిలమిల రతనాల మెఱుపుకాంతి
ఆమధ్య చూపట్టు నంధకారపుసందు- లీనుచుండెను హరినీలకాంతి

గీ. అంధకారము కబళించు నర్కకాంతి
భవ్య జలధిలోపలి బడబాగ్ని వోలె
నరుగు దెంచుచు నహరహమవనిలోన
కరుణజూపుచు నఘముల కడిగి వేయు.





శ్లో॥ గంధర్వైర్గద్యపద్యవ్యతికరితవచో హృద్యమాతోద్యవాద్యై
రాద్యైర్యోవారదాద్యైర్మునిభిరభినుతో వేదవేద్యైర్విభిద్య
అసాద్యాపద్యతే యం పునరపి చ జగద్యౌవనం పద్య ఉద్య
న్నుద్యోతో ద్యోతితద్యౌర్ద్యతు దివసకృతో సావవద్యాని వోద్య॥ 36 ॥

## తాత్పర్యము:

గద్య పద్య సమ్మిశ్రితములగు వాక్కులతో వీణాతాళమృదంగవేణ్వాది వాద్యములతో గంధర్వులచే మనోహరముగా నుతింపబడినదియు, వేదవేద్యులు, ఆద్యులునయిన నారదాదిమునులచే విశదముగా స్తుతింపబడినదియు, జగత్తునకంతకు పునర్యౌవనము నొసంగునదియు నగు సూర్యుని ఉదయకాంతి మీ పాపములను నశింపజేయుగాక!

## అనువాదపద్యము:

సీ. ప్రాచీదిశావాయు వీచీతరంగాల- వినవచ్చుచున్నది వేదఘోష
గాంధారగ్రామమ్ము గంధర్వగీతిలో- కానవచ్చెను చూడ కర్ణములకు
వాద్యఘోషములవి వాచకంబునుబోలి- వాఙ్మయంబునకీడువారి మ్రోగ
పాడిరి గంధర్వులాడిరప్సరసలు- తౌర్యత్రికంబు దా తౌల్యమొప్ప

గీ. నారదాదులు సంకీర్తనములు సలుప-
నాద్యులైన ఋషిగణంబులవధరింప
తరణిసంరంభమునుఁజూడ తరలివచ్చి
యౌవనము గూర్చి జగముల యార్తి బాపు.

శ్లో॥ ఆవానైశ్చంద్రకాంతైశ్చ్యుతతిమిరతయా తానవాత్తారకాణా
మేణాంకాలోక లోపాదుపహతతమసామోషధీనాం లయేన
ఆరాదుత్ప్రేక్ష్యమాణా క్షణముదయతటాంతర్హితస్యాహిమాంశో
రాభా ప్రాభాతికీ వోऽవతు న తు నితరాం తావదావిర్భవంతీ ॥37 ॥

## తాత్పర్యము:

చెమర్చుటను మాని యెండిపోవుచున్న చంద్రకాంతశిలల చేతను, చీకటి తొలగుటచే పల్చబడిన నక్షత్రముల చేతను, చంద్రుని వెలుగు లోపించుట వలన కాంతి విహీనములై కనుమరుగవుచున్న ఓషధుల చేతను, స్పష్టముగా నూహింపబడుచున్నదియు, ఇంకను పూర్తిగా వెలువడక క్షణకాలము ఉదయాద్రి మాటున నున్న సూర్యునియొక్క ఉషఃకాలకాంతి మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. చాంద్రతేజముడుగ చంద్రకాంతమ్ములు- చలువరించుట నంత నిలువరించె
ఆకాశరాజ్యమ్ము నర్కునకందిచ్చి- దోషాకరుండు వైదొలగుచుండ
చంద్రుడస్త్రాద్రికి జనుచున్న వాడని- యతని నోషధికాంతులనుగమించె
తిమిరమ్ము తొలగిన తెరగుల తారకా- తతులవి నింగినిఁ దక్కువయ్యె
గీ. అరుణకిరణపుటంచుల నర్కుడతడు
తనదు రాకను కిరణాల దౌత్యమలర
తెలియజేయుచు రక్షణ తెల్లముగను
కలుములన్నిటి మీకిచ్చు కల్యమందు.





శ్లో॥ సానౌ సా నౌదయేనారుణితదళపునర్యౌవనానాం వనానా
మాలీమాలీఢపూర్వా పరిహృతకుహరోపాంతనిమ్నా తనిమ్నా
భావో భావోపశాంతిం దిశతు దినపతేర్భాసమానా సమానా
రాజీ రాజీవరేణోస్సమసమయముదేతీవ యస్యా వయస్యా ॥ 38 ॥

## తాత్పర్యము:

ఏది ఉదయపర్వత సానువునందుదయింపగా, పద్మపరాగ పంక్తి ప్రియసఖి వలె సమకాలమున నుదయించునో, యేది యెఱ్ఱపడిన ఆకులతో పునర్యౌవనమందినట్లున్న వనసముదాయము నాలింగన మొనర్చుకొనెనో, తన అప్రౌఢతచే నేది గుహాభాగములను నిమ్న ప్రదేశములను పరిహరించుచున్నదో, ఆ సూర్యతేజము మీకభాగ్యోపశాంతిని కలిగించుగాక!

## అనువాదపద్యము:

సీ. ఉదయాద్రి శిఖరాల నుత్ఫుల్లదళపద్మ- రాగప్రభలనంగ రాగమలది
యారాగమలరగా నారామమను రామ- నుపగూహనంబుల నోలలార్చి
కరముల కౌగిలి కరిగించి జవ్వని- దహరకుహరము తాఁదనరి భాస
రాజీవరజస్సమ రాజిత కాంతితో- భానుడు కలిగించు భావశాంతి
ఆ.వె. అట్టి యంశుమాలి యరుదెంచినాడన
నరుణకిరణతతులు నలముకొనియె
అక్కజముగ నవియె ఆయురారోగ్యాల-
నిచ్చి రక్షజేయు నిహపరముల.

శ్లో॥ ఉజ్జృంభాంభోరుహాణాం ప్రభవతి పయసాం యా శ్రియై నోష్ణతాయై
పుష్ణాత్యాలోకమాత్రం న తు దిశతి దృశాం దృశ్యమానా విఘాతమ్
పూర్వాద్రేరేవ పూర్వం దినమను చ పునః పావనీ దిఙ్ముఖానా-
మేనాంస్యైనీ విభా సా నుదతు నుతిపదైకాస్పదం ప్రాక్తనీ వః ॥39॥

## తాత్పర్యము:

ఏది పద్మయుక్తములగు జలములకు పద్మవికాసము వలన శోభను కలిగిస్తుందేగాని తాపమును కలిగింపదో, యేది చూడబడుచున్నదై కన్నులకు వెలుగునొసంగునేగాని బాధను గలిగింపదో, ఏది మొదట తూరుపుకొండను, తరువాత ఆకాశమును, ఆతరువాత దిఙ్ముఖములను పవిత్రమొనర్చుచుండునో,నిందాపాత్రముకానిదై కేవలస్తుతిపాత్రమే యగుచున్నదో, అట్టి సూర్యుని తొలికాంతి మీ పాపములను తొలగించుగాక!

## అనువాదపద్యము:

సీ. నీటిని కాచియు నీరజంబులగాచి- వికసింపజేయును వేడి వీడి
అంధకారము బాపి యాలోకనంబిచ్చి- చూచుకన్గవకు లోచూపునిచ్చు
ఉదయాద్రినుదయించి కదలుచు నభమున- పదిదిక్కులనుజేయు పావనమ్ము
నుతులు చేసెడి వారి నోములు ఫలియింప- ప్రక్షాళనము చేయు పాపరాశి

గీ. అట్టి కారుణ్యమూర్తియౌ నర్కుభాస
పూర్వపర్వత శిఖరిని పూర్తిగాను
దాటి వచ్చును నిత్యము తానుగానె
యఘములది బాపి యస్త్రాద్రికరుగు మరల.





శ్లో॥ వాచాం వాచస్పతేరప్యచలభిదుచితాచార్యకాణాం ప్రపంచై-
ర్వైరించానాం తథోచ్చారితరుచిమదృచాం చాననానాం చతుర్ణామ్
ఉచ్చైతార్చాను వాచ్యచ్యుతిశుచి చరితం యస్య నోచ్చైర్వివిచ్య
ప్రాచ్యం వర్చశ్చకాసచ్చిరముపచినుతాత్తస్య చండార్చిషో వః ॥ 40 ॥

## తాత్పర్యము:

ఎవ్వని నిందారహితమగు పవిత్రచరిత్రము ఇంద్రునకు యోగ్యమగు ఉపదేశమీయగల బృహస్పతియొక్క వాక్కుల సమూహముచేతను, బ్రహ్మదేవుని నాల్గుముఖములయందు ఉదయించి, పాపాపనోదనచతురములగు ఋక్కులను ఉచ్చరించినవగు వాక్కులయొక్క సమూహము చేతను, బాగుగా వివరించి చెప్పుటకు శక్యముకాదో, అట్టి సూర్యునియొక్క తొలితేజస్సు తూర్పున ప్రకాశించుచున్నదై మీ కభ్యుదయమును కూర్చుగాక!

## అనువాదపద్యము:

సీ. చండమార్తాండుని చారుతేజంబది- యాకాశవీథిలో నలరుచుండ
వర్ణింపజాలని వాక్కులకందని- యసమానతేజము నరసి దాని
సోయగంబునుఁజూచి సూరి సురగురుండు- వాచస్పతియునయ్యు వాక్కు గనక
పంకేరుహాసను వదననిర్గతమైన- వేదవారాశిని వేసి వల్లె

ఆ.వె. అందుఁగూడ గనక పొందికపదముల- నంజలి ఘటియించె నక్కజముగ
నట్టి సూర్యదేవునా తొలికిరణాళి- అభ్యుదయము మీకు నందజేయు.

శ్లో॥ మూర్ధ్న్యద్రేర్ధాతురాగస్తరుషు కిసలయో విద్రుమౌఘస్సముద్రే
దిఙ్మాతంగోత్తమాంగేష్వభినవనిహితస్సాంద్రసిందూరరేణుః
సీమ్ని వ్యోమ్నశ్చ హేమ్నస్సురశిఖరిభువో జాయతే యః ప్రకాశః
శోణీమ్నాకసౌ ఖరాంశోరుషసి దిశతు వశ్శర్మశోభైకదేశః ॥41 ॥

## తాత్పర్యము:

ఉదయ సంధ్యావేళలో తనయెఱ్ఱదనముచే, పర్వతశిఖరమున గైరికాది ధాతువుల రక్తిమవలెను, వృక్షములందు లేత చివురులవలెను, సముద్రమున పడవల సమూహమువలెను, దిగ్గజముల కుంభస్థలములందు క్రొత్తగా పూయపడిన సిందూరపరాగమువలెను, గగనసీమయందు మేరుపర్వతపు బంగారు ప్రకాశమువలెను, ప్రకాశించుచున్న సూర్యుని కాంతిలేశము మీకు సుఖము చేకూర్చుగాక!

## అనువాదపద్యము:

సీ. పర్వతాగ్రపుసీమ పడినట్టి కిరణాళి- ధాతుజసిందూరతామ్రమయ్యె
వృక్షశాఖాగ్రాల విక్షిప్త కిరణాలు- కిసలయారుణకాంతికేలగొనియె
అబ్ధితరంగాల నమరిన రోచిస్సు- లవి విద్రుమంబుల యాభ దనరె
దిక్కుంభి కుంభాల దేజరిల్లినకాంతి- యలదిన సిందూర మనగదోచె

ఆ.వె. వ్యోమసీమనిట్లు లోలార్కు కిరణాళి- మేరునగపుశోభ మీరెననగ
నట్టియుదయ శోభలందరకునుగూడ- నిచ్చుగాత! దనరి హెచ్చు సిరుల.





శ్లో॥ అస్తాద్రీశోత్తమాంగే శ్రితశశిని తమఃకాలకూటే నిషేతే
యాతే వ్యక్తిం పురస్తాదరుణకిసలయే ప్రత్యుషః పారిజాతే
ఉద్యన్త్యారక్త పీతాంబర విశదతరోద్వీక్షితా తీక్ష్ణభానో-
ర్లక్ష్మీర్లక్ష్మీరివాऽస్తు స్ఫుటకమలపుటోపాశ్రయా శ్రేయసే వః ॥42 ॥

## తాత్పర్యము:

అస్తపర్వతేశ్వరుని శిరమును చంద్రుడాశ్రయింపగా, చీకటి యనెడు కాలకూటము త్రాగివేయబడగా, వరుణుడనెడు అరుణపల్లవములుకల ఉషఃకాలమనెడు పారిజాతము తొలుత గోచరింపగా, ఆ రక్తపీతాంబర విశదతరోద్వీక్షితయు స్ఫుటకమల పుటోపాశ్రయమునై ఉయుదయించుచున్న సూర్యలక్ష్మి ఆ రక్తపీతాంబర విశదతరోద్వీక్షితము, స్ఫుటకమలపుటోపాశ్రయమునై ఉదయించుచున్న లక్ష్మీదేవివలె మీకభ్యుదయమును కూర్చుగాక!

## అనువాదపద్యము:

సీ. అస్తాద్రిశిఖరికి నందమ్ముదాగూర్ప- శశిభూషణంబయ్యె జక్కగాను
కారుచీకటులను కాలకూటమ్మును- పానమ్ముజేయు నా భానుదీప్తి
ప్రత్యూషమనియెడి పారిజాతాంకుర- మరుణకిరణముగా నమరెనెదుట
అంబుజోదరమున నావిర్భవించిన- రక్తపీతాంబర రమ యనంగ.

ఆ.వె. ఉదయవేళ జనులకూరట కలిగించి
యందరకునునీయ నన్ని సిరుల
వచ్చుచున్నదదియ వాటము ధరణికి
చండభానుకిరణసంచయమ్ము.

శ్లో॥ నోదన్వాఞ్జన్మభూమిర్న తదుదరభువో బాంధవాః కౌస్తుభాద్యాః
పాణౌ పద్మం న యస్యా న చ నరకరిపూరస్థలీ వాసవేశ్మ
తేజోరూపాపరైవ త్రిషు భువనతలేష్వాదధానా వ్యవస్థాం
సా శ్రీః శ్రేయాంసి దిశ్యాదశిశిరమహసో మండలాగ్రోద్గతా వః ॥ 43 ॥

## తాత్పర్యము:

సముద్రమున పుట్టనిదియు, సముద్రోద్భవములైన కౌస్తుభాదులు చుట్టములు కానిదియు, హస్తమున పద్మమునుదాల్పనిదియు, విష్ణువక్షస్థలమున నుండనిదియు, ముజ్జగములకు వ్యవస్థ నుపకల్పించుచున్నదియు, తేజోరూపముగలదియునై సూర్యమండలాగ్రో ద్భూతయగు విలక్షణలక్ష్మి (శోభ) మీకు శ్రేయములనొనగూర్చుగాక!

## అనువాదపద్యము:

సీ. సూర్యలక్ష్మీశోభ సోయగంబే వేఱు- వైశిష్ట్యమున మించు పద్మనిలయ
పాలకడలిలోన ప్రభవింపనేలేదు- కౌస్తుభాదులు బంధుగణము కావు
పాణిపద్మము లేదు పద్మాలయయు గాదు- వెన్నునియెద లేని విమలచరిత
వేవెలుంగులతేని వెలుగుల రాణియై- ముజ్జగంబులకీమె మోదమొసగు

గీ. లక్ష్మికన్నను౦గూడవిలక్షణవతి
మూడులోకాల వారికి ముందుచూపు
దీప్తిమతి యగు నీమె యాదిత్యలక్ష్మి
మనకునన్ని సిరులనిచ్చిమనగజేయు.

(‘ఇతి ప్రభావర్ణనమ్’- ఈశ్లోకంతో సూర్యకిరణాల వర్ణన పూర్తయింది.)





# అశ్వవర్ణనమ్

(సూర్యాశ్వాలు: ఈ శ్లోకం నుండి 49 వ శ్లోకం వరకు ఆరు శ్లోకాలలో సూర్యాశ్వాలు వర్ణింపబడినవి.)

శ్లో॥ రక్షంత్వక్షుణ్ణహేమోపలపటలమలం లాఘవాదుత్పతంతః
పాతంగాః పంగ్వవజ్ఞాజితపవనజవా వాజినస్తే జగంతి
యేషాం వీతాన్యచిహ్నోన్నయమపి వహతాం మార్గమాఖ్యాతి మేరా
వుద్యమ్నుద్దామదీప్తిద్యుమణిమణిశిలావేదికాజాతవేదాః ॥ 44 ॥

## తాత్పర్యము:

మేరుపర్వతమున ఇతరచిహ్నములేవియు లేని మార్గమును, మిక్కిలి ప్రకాశముతో వెలుగు సూర్యకాంతమణివేదికల యందలి యగ్నియే చూపించుచుండగా, వేగాతిశయముచే మేరుపర్వతము యొక్క బంగారుఱాలకు దెబ్బతగులని యట్లు పరువెత్తుచున్నవియు, ‘కాళ్లులేని దీని వేగమెంతటిది గనుక!’-అనే తిరస్కారభావనతో గాలిని వేగముచే జయించినవియునగు సూర్యాశ్వములు లోకములను రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. బంగారుకొండపై రంగారునేలపై- బరువుమోపక తాము పర్వులిడుచు
హేమోపలంబుల సేమంబుగా౦జూచి- గిట్టలు వడిమీర దట్టకుండ
సూర్యకాంతమ్ముల జూపట్టుజ్వాలల- భీతిల్లి దారిని బెదరకుండ
‘పంగువు నీవ’ని పవనునాక్షేపించి- వడిజనమ్ము౦బారు వారువములు

ఆ.వె. ఒక్కరోజు కూడ నొల్లక విశ్రాంతి- పరుగుదీయు మించి పవనగతిని
చాకచక్యమలర చనుదెంచె పుడమికి- రవిహయంబులగుత రక్షకములు!

శ్లో॥ ఫుష్టాః పృష్ఠేంశుపాతైరతినికటతయా దత్తదాహాతిరేకై-
రేకాహాక్రాంతకృత్స్నత్రిదివపథపృథుశ్వాసశోషాః క్రమేణ
తీవ్రోదన్యాస్త్వరంతామహితవిహతయే సప్తయస్సప్తసప్తే-
రభ్యాశాకాశగంగాజలసరళగళావాఙ్నతాగ్రాననా వః ॥ 45 ॥

## తాత్పర్యము:

మిక్కిలి సమీపమున నుండుటచే మిక్కిలిగా దహింపచేయుచున్న సూర్య కిరణములచే పృష్ఠభాగములు కాల్పబడుచున్నవియు, ఒకే దినమున నాకాశమార్గము నంతయు పయనించుటచే పెద్ద నిట్టూర్పులు గలవియు, పై కారణములచే మిగుల దప్పిగొన్నవై సమీపమున నున్న యాకాశగంగాజలముల గ్రోలుటకు మెడలు సాచి తలలవంచినవియునగు సప్తాశ్వుని అశ్వములు మీ యనిష్టములను తొలగించుటకై త్వరపడుగాక!

## అనువాదపద్యము:

సీ. వెనుకనుండెడి స్వామి వేయివెల్గులవేడి- పృష్ఠభాగముఁగాల్చ నిష్ఠురతను
అనతిదూరస్థుడౌ యా స్వామి వేడిమి- తరగని తిరమైన దప్పిఁగొలుప
చండమార్తాండుని మండుటెండకు నింగి- నిండుగా వేడెక్కి నిశ్వసింప
మిన్నేటి జలముల మిలమిల మెరపుల- నాశతోఁజూచుచు నాగకుండ

ఆ.వె. జాలిచూపులనటుకీలించి ముఖముల
స్వామికార్యమందు సర్వకష్ట-
చయము మరచి బారు సప్తాశ్వవితతియే
దీనజనుల బాధఁ దీర్చుగాక!





శ్లో॥ మత్వాన్యాన్పార్శ్వతోశ్వాన్ స్ఫటికమణిదృషద్దృష్టదేహా ద్రవంతీ
వ్యస్తేహన్యస్తసంధ్యేయమితి మృదుపదా పద్మరాగోపలేషు
సా దృశ్యాదృశ్యమూర్తిర్మరకతకటకే క్లిష్టసూతా సుమేరో-
ర్మూర్ధన్యావృత్తిలబ్ధద్రుతగతిరవతాద్బృధ్నవాహావళిర్వః ॥ 46 ॥

## తాత్పర్యము:

మేరు పర్వతాగ్రమున స్ఫటిక మణిమయ ప్రదేశమునందు తమ ప్రతిబింబములను చూచి వానిని తమకన్న భిన్నములైన యితరాశ్వములని భ్రాంతి చెంది, మిక్కిలి వేగముతో పరువెత్తుచు, పద్మరాగమణిమయప్రదేశమున సాయంకాలము నందలి అస్తమయసంధ్యారాగమని భ్రాంతి చెంది, మెల్లగా నడుగులిడుచు, గరుడపచ్చలు గల ప్రదేశమున అవి కూడా పచ్చని వగుటచే సాదృశ్యముచే గనిపించని యాకృతి గలిగి, సారదియైన అనూరునకు కష్టము గలిగించుచు, పునఃపునరావర్తనముచే వేగవంతమగు గమనము గల సూర్యాశ్వములపంక్తి మిమ్మురక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. రత్నసానువు దాటి రజతకాంతులనీను- స్ఫాటికమణిదేశవాటిఁ జేతి
అంబరవీథిలో నచట బింబించిన- తమ బింబములఁజూచి తలచి వేఱు
జవనాశ్వములని తజ్జవముదాటగ బారి-పద్మరాగస్థలిఁ పరుగుఁ దీసి
ఆశోణిమను గాంచి యదిసంజయని యెంచి- నెమ్మదిని జనగ నీల్గుచుండ

తే.గీ. గరుడపచ్చల దేశమ్ము గానవచ్చె- నందు సప్తాశ్వముల రంగు చిందులాడ
నచట సారథిక్లేశమ్ము ననుభవింప- వచ్చి మనలను రక్షించు వాహవితతి.

శ్లో॥ హేలాలోలం వహంతీ విషధరదమనస్యాగ్రజేనావకృష్టా
స్వర్వాహిన్యాస్సుదూరం జనితజవజయా స్యందనస్యస్వదేన
నిర్వ్యాజం తాయమానే హరితిమని నిజే స్ఫీతఫేనాహితశ్రీ-
రశ్రేయాంస్యశ్వపఙ్క్తిశ్శమయతు యమునేవాపరా తాపనీ వః ॥ 47 ॥

## తాత్పర్యము:

సూర్యునియొక్క అశ్వముల వరుస, సూర్యపుత్రికయగు యమునానది వలె మీ పాపముల శమింపజేయుగాత! అని ప్రధాన వాక్యార్థము. అశ్వపంక్తికి యమునానదికి శ్లేషతో పోలిక చెప్పబడినది. రెండును సవిలాసగమనము గలవి. రెండును విషధరదమనాగ్రజావకృష్టములు. రెండును స్యందనవేగముచే గంగానది వేగమును జయించినవి. రెండును తమయొక్క విస్తరించుచున్న హరితవర్ణమున నురువుల తెల్లదనమును వ్యాపింపజేయుచున్నవి.

## అనువాదపద్యము:

సీ. చటులవికచగతి చకచక పర్విడు- యామునోర్మినిబోలి యశ్వపంక్తి
గరుడాగ్రజుని యాజ్ఞ గైకొని సాగును- యామునోర్మిని బోలి యశ్వపంక్తి
చదలేటి జవమును చాలింపగాఁ బాఱు-యామునోర్మిని బోలి యశ్వపంక్తి
హరితమ్ములై ఫేన భరితమ్ములైసాగు- యామునోర్మిని బోలి యశ్వపంక్తి

గీ. రెండునొక దానికొకటిగ మెండుగాను- లోకసేవకు లోకకాలుష్యమడప
పారుచుండును వాహినుల్వారువములు-బాధలను దీర్ప లోకాల భాగ్యమనగ ॥





శ్లో॥ మార్గపాంతే సుమేరోర్నువతి కృతనతౌ నాకధామ్నాం నికాయే
వీక్ష్య వ్రీడావతీనాం ప్రతికుహరముఖం కిన్నరీణాం ముఖాని
సూతేఽసూయత్యపీషజ్జడగతి వహతాం కంధరాగ్రైర్వలద్భి
ర్వాహానాం వ్యస్యతాద్వస్సమమసమహరేర్హేషితం కల్మషాణి ॥ 48 ॥

## తాత్పర్యము:

మేరుపర్వత మార్గసమీపములో దేవతల సమూహములు సూర్యునకు నమస్కరించి, స్తుతులొనర్చుచుండగా ఆ పర్వతము యొక్క గుహాముఖములందు సిగ్గిలుచు నిలువబడియున్న అశ్వవదనలగు కిన్నరస్త్రీల వదనములను మెడలను సగము వంచి చూచుచు, సారధియగు అరుణుడు కోపించుచున్నను, కొంచెము మెల్లగా నడచుచున్న సూర్యాశ్వముల యొక్క హేషితము మీ పాపముల నొక్కమారుగా తొలగించుగాక!

## అనువాదపద్యము:

సీ. రత్నసానువు జుట్టి రవితురగచయము- రయమున జనుచుండ రాజవీధి
సప్తసప్తికి మఱి సప్తాశ్వములకును- సురలు మ్రొక్కుదురెప్డు శిరమువంచి
గిరికందరమ్ముల కిన్నెరభామలు- సాజాత్యమునఁజూచి సరిముఖముల
సిగ్గిలు లేమల నిగ్గుఁదేరిన మోము-లగ్గలమున జూచి యశ్వపంక్తి

గీ. హేషలొనరింపనది యవహేళనమ్ము
సామికగునని దలచి యా సారధియును
వాని నదిలించి యాపును వాటమరసి
అట్టి హయహేషలఘుముల నడచుగాత!

శ్లో॥ ఘన్వంతో నీరదాళీర్నిజరుచిహరితాః పార్శ్వయోః పక్షతుల్యా-

స్తాలూత్తానైః ఖలీనైః ఖచితముఖరుచశ్చ్యోతతా లోహితేన

ఉడ్డీయేన వ్రజంతో వియతి జవవశాదర్కవాహాః క్రియాసుః

క్షేమం హేమాద్రిహృద్యద్రుమశిఖరశిరశ్రేణిశాఖాశుకా వః ॥ 49 ॥

## తాత్పర్యము:

తమకాంతిచేత ఆకుపచ్చనివై, యిరుప్రక్కల నున్న మేఘములను ఱెక్కలను వలె యెగిరించుచున్నవియు, దవడలనెగలాగు కళ్లెములచే స్రవించుచున్న రక్తముచే నెఱ్ఱనైన ముఖములు గలవియు, వేగవశమున నాకసమున నెగిరి చనుచున్నవియు, మేరుపర్వతమనెడు మనోహర వృక్షము యొక్క శృంగములనెడు శాఖల వరుసలపై నుండెడు చిలుకల వంటివగు సూర్యాశ్వములు మీకు మంగళముల నొనగూర్చుగాక!

## అనువాదపద్యము:

సీ. ఆకాశవీథిలో నట హేమగిరితట- పథమునఁ బయనించు వారువములు

ఆయద్రిపై నున్న హరీతతరుకాన్తి- తమ కాన్తిచయమునఁ దారసిల్ల

ఆశాంతముల యందు నందగించిన మేఘ- పటలమ్ము పార్శ్వంపు పక్షవితతి

కళ్లెంపు బిగిచేత కారెడు శోణిత- ధారల ముఖశోభ దనరుచుండ

ఆ.వె. రివ్వురివ్వునఁజను గువ్వలవి యనంగ

చెట్లమీదనున్నఁ జిలుకలనగ

స్వర్ణపర్వతంపు సానువులను దాటి

వచ్చి యిచ్చు శుభము వారువములు.





# అనూరువర్ణనమ్

(ఈ శ్లోకమునుండి 12 శ్లోకములలో సూర్యసారథియైన అనూరుడు వర్ణింపబడినాడు)

శ్లో॥ ప్రాతశ్శైలాగ్రరంగే రజనియవనికాపాయసంలక్ష్యలక్ష్మీ

ర్విక్షిప్యాపూర్వపుష్పాంజలిముదునికరం సూత్రధారాయమాణః

యామేష్వం కేష్వివాహ్నః కృతరుచిషు చతుర్ష్వేవ లబ్ధప్రతిష్ఠా

మన్యాత్ప్రస్తావయన్వో జగదటనమహానాటికాం సూర్యసూతః ॥ 50 ॥

## తాత్పర్యము:

ఉదయ పర్వతమనెడు రంగస్థలమున రాత్రియను తెర తొలగగా కనుపించినవాడై, చుక్కల సమూహమనెడు పుష్పాంజలిని వెదజల్లి, సూత్రధారుని వలె, పగటి యొక్క నాల్గు యామములనెడు నాలుగంకములయందు వ్యాపించిన జగత్పర్యటనమనెడు మహానాటికకు ప్రస్తావన యొనర్చుచున్న సూర్యరథసారథియగు అనూరుడు మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. ఉదయాద్రి శిఖరాన నున్నతంబైనట్టి- రంగస్థలీతెర రజనిఁ దింపి

తారకాతతులను తనరారు కుసుమాల- శోభనాంజలినిచ్చు సూత్రధారి

నాలుగు యామాలు నాల్గంకములుగాగ-దినభాగదృశ్యాల తీర్చి దిద్ది

జాగొకింతయులేక జగదటనమనెడి- నాటకంబాడించు ననుదినంబు

ఆ.వె. కాశ్యపాగ్రజుండు కమలనాథునతని

నాయకునిగజేసి నవ్యతగన-

నహరహమున నెట్టి యవరోధములు లేక

నాటకమును నడుపు దీటుగాను!

శ్లో॥ ఆక్రాంత్యా వాహ్యమానం పశుమివ హరిణా వాహకోగ్ర్యో హరీణా-
భ్రామ్యంతం పక్షపాతాజ్జగతి సమరుచిస్సర్వకర్మైకసాక్షీ
శత్రుం నేత్రశ్రుతీనామవజయతి వయోజ్యేష్ఠభావే సమేపి
స్థేమ్నాం ధామ్నాం నిధిర్యస్సభవదఘనుదే నూతనస్త్వాదనూరుః॥ 51 ॥

## తాత్పర్యము:

స్థిరములగు కాంతులకు నిధియై, వయోజ్యేష్ఠభావమిరువురకు సమానమైనను సర్పశత్రువగు గరుత్మంతుని తిరస్కరించుచున్న నవోదితుడగు ననూరుడు మీ పాపముల నశింపజేయుగాక! యని ప్రధానవాక్యార్థము. అనూరుడు గరుడుని నెట్లు మించుచున్నాడనగా, నతడు హరిచే (విష్ణువుచే) బలాత్కారముగా పశువువలె వాహనముగా చేసికొనబడినవాడు. ఇతడు హరులనే వాహనములుగా జేసికొన్నవాడు. అతడు పక్షపాతముతో జగమున సంచరించువాడు. ఇతడు సమరుచియై సర్వకర్మలకు సాక్షియైనవాడు.

## అనువాదపద్యము:

సీ. పక్షపాతపుబుద్ధి లక్షణముగనిల- తిరుగుదురిరువురు తిరము గాను
కంటికి వెలుగిచ్చు కర్మసాక్షి యొకఁడు- చక్షుశ్శ్రవంబుల శత్రువొకఁడు
హరివాహనము వీడు హరివాహనమువాఁడు- గరుడాగ్రజుఁడు వీడు గరుడుడతడు
ఇతడు వయోజ్యేష్ఠుడతడు వయోజ్యేష్ఠు- వరుణుడితడు నతడరుణానుజుండు

ఆ.వె. వాడు విష్ణుమూర్తి వాహనమన వీడు- కర్మసాక్షి కొలుచు కర్మయోగి
వానికన్న మిన్న వానియన్నయునగు- నయ్యనూరుడఘము లడచుగాదె!





శ్లో॥ దత్తార్ఘ్యైర్దూరధూమ్రైర్వియతి వినయతో వీక్షితస్సిద్ధసాధ్యై
స్సానాథ్యం సారథిర్వస్సదశశతరుచేస్సాతిరేకం కరోతు
ఆపీయ ప్రాతరేవ ప్రతతహిమవయస్స్యందినీరిందుభానూ-
ర్యః కాష్ఠాదీపనోగ్రే జడిత ఇవ భృశం సేవతే పృష్ఠతోకర్కః॥ 52 ॥

## తాత్పర్యము:

తెల్లవారగనే నిరంతరము మంచుగురియు చంద్రకిరణములను ద్రావుటచే చలిచే పీడింపబడినవాడోయన్నట్లు, ముందు కాష్ఠోద్దీపనము చేసి, వెనుక సూర్యుని సేవించున్నవాడును, దూరము నుండి వినమ్రులై యర్ఘ్యమొసగిన సిద్ధులచే సాధ్యులచే వినయముతో గాంచబడిన వాడును అయిన సూర్యసూతుడగు అనూరుడు మీకు మిక్కిలి రక్షకుడై యొప్పుగాక!

## అనువాదపద్యము:

సీ. నీహారవర్షమ్ము నిరతము దడియుచు- గడగడవడకును గగనమందు
చంద్రికాపూరమ్ము చకచక ద్రావగా- కాయమ్ము శిథిలమై కాష్ఠమౌట
కాష్ఠముల్దీపించి కాగియు చలిమంట- వేకువజామునే వేగవచ్చి
దినమణిసేవలో దీటుగా నమరియు- సూర్యసారథివచ్చె సూటిగాను

ఆ.వె. సిద్ధచారణ ఋషి బద్ధాంజలుల చూచి
యన్ని యభిమతంబులమరజేసి
నాథుకన్నముందె నావారు వీరని
యాదుకొనగ వచ్చుననఘుడితడు!

శ్లో॥ ముంచన్రశ్మీన్దినాదౌ, దినగమసమయే సంహరంశ్చ స్వతంత్ర
స్తోత్రప్రఖ్యాతవీర్యో, వియతి హరిపదాక్రాంతిబద్ధాభియోగః
కాలోత్కర్షాల్లఘుత్వం ప్రసభమధిపతౌ యోజయన్యో ద్విజానాం
సేవాప్రీతేన పూష్ణా స్వసమ ఇవ కృతస్త్రాయతాం సోఽరుణో వః॥ 53 ॥

## తాత్పర్యము:

తనను సేవించుటచే ప్రీతినందిన సూర్యునిచే తనతో సమానుడుగా గావింపబడినాడో యనునట్లున్న యనూరుడు మిమ్ము రక్షించుగాక యని ప్రధానవాక్యార్థము. సూర్యునితో అనూరునకు సామ్యమిట్లు ప్రతిపాదింపబడినది. దినాగ్రభాగమున ఇరువురు రశ్మలను వదలుదురు. అట్లే సాయంసమయమున ఉపసంహరిస్తారు. ఒకరు తోత్త్రముచే ప్రఖ్యాతమగు పరాక్రమము గలవారు వేరొకరు స్తోత్రములచే నతిశయించిన శక్తిగలవారు. ఒకరు నిరంతరము గుఱ్ఱముల పాదములను నడిపించుటలో నిమగ్నమైనవారు. వేరొకరు హరిపదము నాక్రమించుటలో నిమగ్నులు. ఒకరు కాలాధిక్యముచే ద్విజాధిపతియగు గరుడునికి దక్కువతనము గల్గించువారు. వేరొకరు కాలకృతాధిక్యముచే ద్విజాధిపతియగు చంద్రునికి దక్కువతనము గల్గించువారు.

## అనువాదపద్యము:

సీ. ఉదయకాలమునందు నుద్యత్ప్రభాపూర- మాశాంతములదాక నంపుచుండి
మలిసంజవేళలో మరలించు తనుకాంతి- నర్కుతోడను కూడ నరుణుడితఁడు
స్తోత్ర తోత్త్రమ్ముల నాత్రముగ గ్రహించి- యిరువురు నొసగుదురీప్సితముల
హరిపదమ్ములబట్టి హరిపదమ్మునుజుట్ట- నిర్వురేమరకుండ నేగువారు
గీ. అణుమహత్వములను కాలమనుసరించి- హెచ్చుతగ్గుల బొందుచు హేలగాను
సములుగా బ్రోచి లోకపు సంకటముల- బాపనుదయింత్రు వీరలు భాసలలర.





శ్లో॥ శాతశ్యామా లతాయాః పరశురివ తమోరణ్యవహ్నేరివార్చిః
ప్రాచ్యేవాగ్రే గ్రహీతుం గ్రహకుముదవనం ప్రాగుదస్తాగ్రహస్తః
ఐక్యం భిందన్నృభూమ్యోరవధిరివ విధాతేవ విశ్వప్రబోధం
వాహానాం వో వినేతా వ్యపనయతు విపన్నామ ధామాధిపస్య॥ 54 ॥

## తాత్పర్యము:

రాత్రియనెడు లతకు పదునైన గండ్రగొడ్డలి వంటివాడును, చీకటియనెడు అరణ్యమును దహించు దావాగ్నిజ్వాల వంటివాడును, తూర్పుదిశయనెడు స్త్రీ గ్రహములనెడు కలువల సమూహమును గ్రహించుటకు జాపిన హస్తాగ్రము వంటి వాడును, భూమ్యాకాశముల ఐక్యతను భేదించు నవధివంటివాడును, విశ్వప్రబోధమునొనరించు బ్రహ్మవంటివాడునునగు సూర్యాశ్వసంచాలకుడగు అనూరుడు మీ యాపద అను పేరును సైతము తొలగించుగాక!

## అనువాదపద్యము:

సీ. తూర్పుతొయ్యలి తాను దోరంపు కోర్కెతో- తారకా కుసుమాల దాల్పనెంచి
నక్షత్రకుముదము క్షయంబులగొన- క్రీడసాచిన యట్టి కేలనంగ
యామినీ వనలత లడ్డగింపగ ద్రుంచు- పదునైన పోడిమి పరశువనగ
తామసారణ్యంబు దహియించుచున్నట్టి- దావాగ్ని కీలల దాహమనగ
ఆ.వె. ఆకసంబు నుండి యవనిని విడదీసి
యరుణకాంతులమరె నవధియనగ
విశ్వబోధకుండు వేధను బోలుచు
నరుణుడరుగుదెంచె నార్తి బాప॥

శ్లో॥ పౌరస్త్యస్తోయదర్తోః పవన ఇవ పతన్పావకస్యేవ ధూమో
విశ్వస్యేవాదిసర్గః, ప్రణవ ఇవ పరం పావనో వేదరాశేః
సంధ్యానృత్యోత్సవేచ్ఛోరివ మదనరిపోర్నాందినాందీనినాదః
సౌరస్యాగ్రే సుఖం వో వితరతు వినతానందనః స్యందనస్య ॥ 55 ॥

## తాత్పర్యము:

వర్షర్తువునకు ముందు వచ్చెడు తూర్పుగాలివలె, ఆవిర్భవింపబోవు అగ్నికి ముందు కనబడు ధూమము వలె, ప్రపంచమునకు ముందటిదైన, ఆదిమ సృష్టివలె, వేదరాశిముందు పవిత్రమగు ఓంకారమువలె, సంధ్యానటనము సేయబోవు నటరాజునకు ముందు నందీశ్వరుని మృదంగవాద్యధ్వనివలె, సూర్యరథమునకు ముందు వచ్చెడు వినతాప్రథమనందనుడగు అరుణుడు మీకు సుఖమునిడుగాక!

## అనువాదపద్యము:

సీ. తొలకరింతకు ముందు పులకరింతలువెట్టి- గాత్రసౌఖ్యముఁగూర్చు గాలి యనగ
అగ్నినుద్దీపింపనావిర్భవించెడి- పావనంబగు ధూమపటలమనగ
విశ్వసృష్టికి ముందు వేదాలకాదిని- మొగిసిన ప్రణవంపు మొలకయనగ
సంజనర్తనవేళ స్మరశాసనుని మ్రోల- నందీశ్వరుఁడుసల్పు నాదమనగ

గీ. వినతపుత్రుఁడు కాశ్యపివెలుఁగుతేని
వారువంబుల జవమును వశము గొనుచు
సూర్యునకు ముందు గరుడాగ్రజుండు వచ్చి
సుఖములన్నింటి మనకిచ్చు సూటిగాను.





శ్లో॥ పర్యాప్తం తప్తచామీకరకటకతటే శ్లిష్టశీతేతరాంశో-
రాసీదత్స్యందనాశ్వానుకృతిమరకతే పద్మరాగాయమాణః
యస్సోత్కర్షాం విభూషాం కురుత ఇవ కులక్ష్మాభృదీశస్య మేరో-
రేనాంస్యహ్నోయ దూరం గమయతు స గురుః కాద్రవేయద్విషో వః ॥ 56 ॥

## తాత్పర్యము:

సూర్యకాంతిచే మెరయుచున్నదియు, తద్వాహనములగు హరిదశ్వముల ప్రతిబింబముచే గరుడపచ్చలు పొదిగినట్లున్నదియు, నగు మెఱుగు బంగారపు చరియయందు పద్మరాగమణివలె ప్రకాశించుచు కులపర్వతశ్రేష్ఠమగు మేరువున కతిశయకాంతిమంతమగు నాభరణమును గూర్చుచున్నాడో యనునట్లున్న గరుడాగ్రజుడగు అరుణుడు మీ పాపములను శీఘ్రముగా దూరమొనరించుగాక!

## అనువాదపద్యము:

సీ. మిహిరకాంతులరసి మేరుపర్వతసీమ- బంగారురంగారె భవ్యదీప్తి
ఆపైన నాతని యందాలయరదము- గరుడపచ్చలభూమి గమినిజేతె
హరిదశ్వకాంతితోనలరు భూమినిదాటి- మరకతభూమికి తరలె తరణి
పద్మరాగపు కాంతి పాతంగమైయొప్ప- మెరుపు భూషణమయ్యె మేరుకాంతి

గీ. కాద్రవేయుల శత్రునికన్న ముందు
కశ్యపాత్మజుడితడనఁగదలినాడు
వాడె యరుణుడు దినమునవారితముగ
బరగజేయుచు నఘముల బాపుగాక!

శ్లో॥ నీత్వాశ్వాంత్సప్తకక్ష్యా ఇవ నియమవశం వేత్రకల్పప్రతోద-
స్తూర్ణం ధ్వాంతస్య రాశావితరజన ఇవోత్సారితే దూరభాజి
పూర్వంప్రష్ఠో రథస్య క్షితిభృదధిపతీన్దర్శయంస్త్రాయతాద్వ-
స్త్రైలోక్యాస్థానదానోద్యతదివసపతేః ప్రాక్ప్రతీహారపాలః ॥ 57 ॥

## తాత్పర్యము:

ఏడు గుఱ్ఱములను నేడు కక్ష్యాద్వారములను వలె తన వశమునందుంచుకొని నేత్రమువంటి కొరడా ధరించి చిమ్మచీకటి నితర జనసమూహమును వలె దూరముగా దొలగించి, రథాగ్రభాగమున నుండి మేర్వాదిక్షితిభృత్తులను జూపించుచు, ముల్లోకములకు కొలువునొసంగబోవుచున్న దివసాధిపతియగు శ్రీ సూర్యసార్వభౌమునకు ప్రధాన ప్రతీహారుడుగా నున్న అరుణుడు మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. సప్తకక్ష్యలలోన సప్తాశ్వములబూన్చి- నియమంబునను వాని నిల్పునతడు
దినరాజురాకను తెల్పుచు తిమిరాల- నుత్సారణముఁ జేయునుదయవేళ
తేజంపుతేనికి తేరిముంగట నిల్చి- ప్రజలను ముందుగా పలుకరించు
తరణికి బాసట తానుగా నిలచియు- ధరణీధరులజూపు తానవమున

గీ. ముజ్జగంబుల ప్రాణుల మోదకరుని
బ్రధ్నుకొలువున నుండెడి పార్శ్వచరుఁడు
సూర్యసారథి గరుడాగ్రజుండు మీకు
రక్షఁజేయగ వచ్చెను రయముమీర ॥





శ్లో॥ పాశానాశాంతపాలాదరుణ! వరుణతో మాగ్రహీః ప్రగ్రహార్థం
తృష్ణాం కృష్ణస్య చక్రే జహిహి న హి రథో యాతి మే నైకచక్రః
యోక్తుం యుగ్యం కిముచ్చైశ్శ్రవసమభిలషస్యష్టమం వృత్రశత్రో
స్త్యక్త్వావ్యా పేక్షవిశ్వోపకృతిరితి రవిశ్శాస్తి యం సోఽవతాద్వః ॥ 58 ॥

## తాత్పర్యము:

అరుణా! పశ్చిమదిశాధిపతియగు వరుణుని నుండి పగ్గములకై పాశములను గ్రహింపవద్దు. విష్ణువు చక్రమును గొనునాశను వీడుము. నా రథమేకచక్రమున నడువలేదనునది లేదు. (చక్కగా నడువగలదని భావము). ఇంద్రుని యుచ్ఛైశ్శ్రవమును ఎనిమిదవ గుఱ్ఱముగా గట్టగోరుచున్నావా? అని యితరుల సహాయమక్కరలేకనే విశ్వోపకార మొనరించు సూర్యుడెవ్వనిని శాసించునో యా అనూరుడు మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. అరుణుడా! యడుగకు వరుణుని దరిజేటి- పాశమ్మునిమ్మని పగ్గములకు
ఏకచక్రరథమునేలాగు నడుపుదు- అని చక్రిచక్రము నడుగవలదు
అష్టమాశ్వము కాడి నమరగా సమగతి- చనును రథమని యుచ్చైశ్రవమ్ము-
నడుగగా నమరేంద్రు నర్థిభావముతోడ- దరిఁజేరబోకుమా! తరుగుపరువు!

ఆ.వె. మంచిచేసి జనుల మారేమికోరక-
యుండువాని కన్ని దండిగాను
తమకు తాముగానె సమకూరు ధరణిలో-
ననుచు బోధసేయు నర్కుడెపుడు!

శ్లో॥ వజ్రిన్! జ్ఞాతం వికాసిక్షణకమలవనం భాసి,నో భాసి వహ్నే!
తాతం నత్వాశ్వపార్శ్వం నయ యమ! మహిషం, రాక్షసా! వీక్షితాః స్థ
సప్తీన్ సించ ప్రచేతః! పవన! భజ జవం విత్తపావేదితస్త్వం
వందేశర్వేతి జల్పన్ప్రతిదిశమధిపాన్పాతు పూష్ణోగ్రణీర్వః॥ 59 ॥

## తాత్పర్యము:

ఇంద్రా! నీ కన్నులనెడు కమలములగుంపు వికసించి ప్రకాశించుచున్నది. అగ్నీ! నీ కాంతులు దొలగుటచే ప్రకాశింపకున్నావు. యమా! మీ తండ్రిని నమస్కరించి మహిషమును గుఱ్ఱముల ప్రక్కకు గొనిరమ్ము. రాక్షసులారా! మీరు సూర్యభగవానునిచే వీక్షింపబడితిరి.వరుణా! గుఱ్ఱములను జలకణములచే తడుపుము. పవనుడా! వేగమునందుకొమ్ము. ధనదా! స్వామికి నీవు నివేదింపబడితివి. ఈశ్వరా! నమస్కరించుచున్నాను అని అష్టదిక్పాలకులను గూర్చి పలుకుచున్న సూర్యసారథియగు అరుణుడు మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. ఇంద్ర! నేత్రాబ్జంబులింపుగా వికసించె- నగ్నిదేవా! ఏల నలరవీవు
పితృదేవుడేతెంచె పితృపతీ! చనుము- మహిషమ్ముడిగ్గి నమస్కరింపు
వారువంబులు డస్సె వరుణదేవా! వాని-దప్పికఁదీర్చుము ధర్మువదియ
పవమానుడా! నీవు జవమునందియువేగ- జనుము జీవములను జనులకీయ

గీ. రక్కసులమిమ్ము జూచెను రవిగాచు- కొనుడు విత్తేశ! నిను చెప్పుకొనుము నీవె
శర్వ! నుతియింతు నిన్నిదే శంకరుండ!- యనుచు నరుదెంచు నరుణుండు రక్షయగుత!





శ్లో॥ నో మూర్ఛాచ్ఛిన్న వాంఛశ్శ్రమవివశవపుర్నైవ నాప్యాస్యశోషీ
పాంథః పథ్యేతరాణి క్షపయతు భవతాం భాస్వతోగ్రేసరస్సః
యస్సంశ్రిత్య త్రిలోకీమటతి పటుతరైస్తూయమానో మయూఖై-
రారాదారామరేఖామివ హరితమణిశ్యామలామశ్వపంక్తిమ్ ॥ 60 ॥

**తాత్పర్యము:** ఎవడు తీక్షణములగు సూర్యకిరణములచే సంతప్యమానుడయ్యును, గారుత్మత మణిశ్యామలమైన గుఱ్ఱముల వరుసను వనసముదాయమును వలె నాశ్రయించుటచే మూర్ఛచే నశించిన కోరిక గలవాడుగాక, బడలికచే వివశమైన మేను కలవాడు గాక, నోరెండినవాడు గాక, సూర్యునకు ముందుండి ముల్లోకములను నిత్యము పర్యటించు పాంథుడో, ఆయరుణుడు మీ అహితములను నశింపజేయుగాక!

## అనువాదపద్యము:

సీ. మండువేడిమి నుండు మార్తాండునకు ముందు- కూర్చుండువాడయ్యు గొనడు మూర్ఛ
ఆకుపచ్చని కాంతినశ్వాలు చెట్లన- నరుణునూష్మముఁజేర నాపుచుండ
ఆదిత్యుతోపాటు నరదంబునడుపుచు- ముల్లోకములు చుట్టు మోదమలర
వారువంబులు వడి వడగాడ్పు జోడింప- దస్సిపోవడతడు దప్పిఁగొనడు

తే.గీ. ఇట్టులను దినమ్మును సామినేమరక య-
రుణుడుదయమున చీకటి రూపుమాపి
మంగళేతరములనన్ని మట్టువెట్టి
శుభములందిచ్చి కరుణనుఁ జూపు నెపుడు.

శ్లో॥ సీదంతోంతర్నిమజ్జజ్జడఖురముసలాస్సైకతే నాకనద్యాః
స్కందంతః కందరాళీః కనకశిఖరిణో మేఖలాసు స్ఖలంతః
దూరం దూర్వాస్థలోత్కా మరకతదృషదిస్థాస్నవో యన్నయాతాః
పూష్ణోకశ్వాః పూరయన్త్వస్తదవతు జవనైర్హుంకృతేనాగ్రగో వః॥ 61 ॥

## తాత్పర్యము:

ఆకాశగంగా సైకతములందు గిట్టలు కూరుకొనిపోవుటచే వేగముగా కదలజాలక కష్టపడుచున్నవియు, మేరుపర్వతమేఖలలయందు కందరములను దాటునప్పుడు విషమప్రదేశములందు గతిభంగము నందుచున్నవియు, మరకత మణిమయ ప్రదేశములందుఁ పచ్చని గడ్డిమొలకలనెడు భ్రాంతివలన గలిగిన కుతూహలముచే ఆగుచున్నవియు నగు సూర్యాశ్వములను తనహుంకారముచేఁ తగువేగము గలవానినిగా నొనర్చుచున్న సూర్యసారథియగు అరుణుడు మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. మిన్నేటిదరి నేల మెట్టగా గిట్టలు- దట్టింపబడినట్లు దవులుకొనగ
మేరుపర్వతభూమి మెట్టపల్లములతో- విషమంబుఁగావున వేగముడుగ
బంగారుశిఖరంపు పర్వతమేఖల- దట్టి పర్విడునెడ తడబడంగ
కని దూరమునఁదాము గరుడపచ్చలభూమి- శాద్వలభ్రాంతితో సాచి మెడల-
గీ. నాదిశగనేగు నశ్వాలనదిమిపట్ట- హుంకరించుచు కాశ్యపి ప్రేంఖణముల
ప్రగ్రహంబులఁబట్టియు నిగ్రహించి- మిమ్ము రక్షించుత! కనికరమ్ముతోడ.

(ఇత్యనూరువర్ణనమ్)

(ఈ శ్లోకముతో అనూరుని వర్ణనము పూర్తయినది)





# అథ రథవర్ణనమ్(సూర్యరథం)

(ఈ శ్లోకమునుండి 72వశ్లోకమువరకు 11 శ్లోకములలో సూర్యరథముపవర్ణింపబడినది.)

శ్లో॥ పీనోరః ప్రేరితాభ్రైశ్చరమఖురపుటాగ్రస్థితైః ప్రాతరద్రా-
వాదీర్ఘాంగైరుదస్తో హరిభిరపగతాసంగనిశ్శబ్దచక్రః
ఉత్తానానూరుమూర్ధావసతిహతభవద్విప్రతీప ప్రణామః
ప్రాహ్ణే శ్రేయో విధత్తాం సవితురవతరన్వ్యోమవీథీం రథో వః ॥ 62 ॥

## తాత్పర్యము:

ఉదయకాలమున బలసిన యెదలతాకిడిచే మేఘముల నెగజిమ్మునవియు, వెనుకకాళ్లగిట్టలను మాత్రముదయాద్రియందుంచినవియు, నాయతములగు శరీరములు గలవియునగు గుఱ్ఱములచే వేగముగా లాగబడుచున్నదియు, నెచటనుఁదగులని యేకచక్రముగలదియగుటచే, ధ్వనిరహితమైనదియు, వెనుకకు వ్రాలిన యనూరుని యొక్క వింతగా వ్రాలిన శిరస్సుచే నాకస్మికముగా నమస్కరింపబడినదియునగు సూర్యరథము మీకు మేలొనగూర్చుగాక!

## అనువాదపద్యము:

సీ. అభ్రంకషాభ్రాల నతికఠినవిపుల- హృదయాలతోఁ దాకి చెదరగొట్టి
కనకాచలమ్ముపై వెనుకగిట్టలనాన్చి- యువ్వెత్తుగా లేచి యూర్ధ్వగతిని
వడి వడి బారుచు వాజివ్రాతములాగ- రొదసేయకే దొర్లు రథపునేమి
ఉత్తానుడై వెన్కకొరగి యనూరుండు- విప్రతీపంబుగా వినతిసల్ప
ఆ.వె. కల్యకల్యమిట్లు కాంచనంబుగుతేఱు- విష్ణుపదమునందు విరతిగొనక
సప్తసప్తితోడ సప్తాశ్వములతోడ- పారుచుండియిచ్చు పరమశుభము.

శ్లో॥ ధ్వాంతౌఘధ్వంసదీక్షావిధి గురువహతా ప్రాక్సహస్రం కరాణా-
మర్యమ్ణా యో గరీయః పదమతులముపానీయతాధ్యాసనేన
స శ్రాంతానాం నితాంతం భరమివ మరుతామక్షమాణాం విసోఢుం
స్కంధాత్స్కంధం వ్రజన్వో వృజినవిహతయే భాస్వతస్స్యందనోఽస్తు॥ 63 ॥

## తాత్పర్యము:

చిమ్మచీకటుల సముదాయమును నాశనమొనర్చు దీక్షబూనినవాడై వేయికిరణములను దాల్చిన సూర్యుడు, తాను అధిరోహించుటచే దేనిని మిగుల గౌరవపద మందించెనో, ఏది తన మహాభారమును మోయుటకసమర్థములై యలసినవో యనునట్లున్న మారుతములయొక్క స్కంధమునుండి స్కంధమునకు మారుచుఁ జనుచున్నదో యా సూర్యరథము మీ పాపముల నశింపజేయుగాక!

## అనువాదపద్యము:

సీ. భీమపాతకసంఘవిధ్వంసనిర్మగ్న- పరమదీక్షారంభకరసహస్ర-
మండలాలంకారచండకిరణనామ-ధేయాంకితోజ్జ్వలాదిత్యపూత-
పాదవిక్షేపణాపాదితాత్యంతదు-ర్భరభారసంక్లిష్టభవ్యరథము
దక్షంబులగు వాజులక్షమంబులు కాగ-నంచెలంచెలగట్టియనిలయములను

ఆ.వె. చాకచక్యమలర రాకపోకల సల్పు-
నట్టులరణుచేతనను దినంబు
నడుపబడుచునుండుననగ మార్తాండుని
యరదమదియె వచ్చెనఘముఁబాప.





శ్లో॥ యోఽక్రీభూతాప్రథస్య గ్రసితుమివ పురోదందశూకాన్దధానో
ద్వేధావ్యస్తాంబువాహావళివిహితబృహత్పక్షవిక్షేపశోభః
సావిత్రస్స్యందనోఽసౌ నిరతిశయరయప్రీణితానూరురేనః
క్షేపీయో యో గరుత్మానివ హరతు హరీచ్ఛావిధేయప్రచారః॥ 64 ॥

## తాత్పర్యము:

రథమునకు గట్టు త్రాళ్ళయిన సర్పములను మ్రింగుటకో యనునట్లు ముందు ధరించినదియు, రెండుగా చీలిన మహామేఘముల సముదాయముచే నెగురుచున్న ఱెక్కల శోభగలదియు, తన వేగాతిశయముచే అనూరున కానందమును గూర్చునదియు, హరీచ్ఛ ననుసరించిన నడక గలదియునై, గరుడునివలె నున్న సూర్యరథము మీ పాపములను దొలగించుగాక!

## అనువాదపద్యము:

సీ. అశ్వాల ధాటికి నభ్రముల్చెదరియు- పక్షంబులనదోప పక్షిరాజు
పగ్గంపు పాముల పదిలంపునొడుపుతో- పట్టిదన్నుకు పోవ వచ్చెననగ
నంబరవీథిలో నతిరయమ్మునఁబారి- యరుణుని యుల్లాసమతిశయింప
గరుడుతోడుత వచ్చె గరుడాగ్రజుండన- గగనవీధిని ధగద్ధగలతోడ

ఆ.వె. నింపుచనరుదెంచు నిత్యమునిట్టులే
యనఘుసూర్యనరద మవనికనగ
ననుదినమున నదియు నా గరుడుని పోల్కి
పాపపుంజమంత బాపు గాక!

శ్లో॥ ఏకాహేనైవ దీర్ఘాం, త్రిభువనపదవీం లంఘయన్యో లఘిష్ఠః
పృష్ఠే మేరోర్గరీయాన్దలితమణిదృషత్త్వింషి పింషఞ్ఛిరాంసి
విశ్వస్యేవోపరిష్టాదపి చ పునరదస్తాదివాస్తాద్రిమూర్ధ్ని
బ్రధ్నస్యావ్యాత్ప్రజాతో దురధిగమసరిస్పందనం స్యందనో వః ॥ 65 ॥

## తాత్పర్యము:

ఒక్క దినముననే దీర్ఘమగు త్రిభువనమార్గమును లఘించుటచే మిక్కిలి లఘువైనదియు, మేరుపర్వత పృష్ఠమునందు వికీర్ణములగు మణులకాంతులుగల శిఖరములను చూర్ణమొనరించుటచే మిగుల గురువైనదియు, విశ్వమునకూర్ధ్వముననున్నదియు, అస్త్రాద్రిని జేరి విశ్వమునకు క్రిందగుచున్నదియునై అంతుపట్టని తత్త్వముగలదియగు సూర్యరథము మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. ఏకాహముననేది యీరేడు భువనాల- లంఘించి జవమున లాఘవమును
హేలాధిగమలీల హేమాద్రిమణిశిలా- గణచూర్ణనక్రియ గౌరవమును
ఉదయకాలమునందునుదయాద్రిశిఖరంపు- టుజ్జ్వలభూషగానున్నతత్త్వ
మరసి సాయంకాలమస్తమించెడి వేళ- నస్తాచలమున నంఘ్రిమణిగ
గీ. లఘుత గురుతలనున్నతులవనతులను
పరము నాత్మతత్త్వమరసి బరగెననగ
వచ్చినట్టి యరదమిది వరదమనగ
గాచి రక్షించు జనులను కలుషమడచి ॥





శ్లో॥ ధూర్ధ్వస్తాగ్ర్యగ్రహాణి ధ్వజపటపవనాందోళితేందూనిదూరం
రాహౌగ్రాసాభిలాషాదనుసరతి పునర్దత్తచక్రవ్యథాని
శ్రాంతాశ్వశ్వాసహేలాధుతవిబుధధునీనిర్ఘరాంభాంసి భద్రం
దేయాసుర్వో దవీయో దివి దివసపతే స్స్యందనప్రస్థితాని ॥66॥

## తాత్పర్యము:

రథాగ్రభాగముచే ప్రధాన గ్రహములను నశింపజేసినవియు, టెక్కెపు వస్త్రము యొక్క గాలిచే చంద్రుని కదిలింపజేసినవియు, మ్రింగగోరి యనుసరించెడు రాహువునకు మఱల చక్రపుబాధ గలుగజేసినవియు, బడలిన గుఱ్ఱముల యూర్పుగాడ్పులచేతనే యలవోకగా గగన గంగాజలప్రవాహముల నెగురగొట్టినవియు నగు సూర్యరథప్రచారములు మీకు మంగళము లొసంగుగాక!

## అనువాదపద్యము:

సీ. కాడిముందటికొమ్ము ఘట్టనన్ గ్రహములు- నుగ్గు బుగ్గయి నింగి నగ్గలింప
ధ్వజపటవీచికా వాయువేగముచేత- నుడురాజు బహుదూరమోసరిల్ల
రాహువు మ్రింగగా నూహించి వెనుకగా- వెడలుచు రథగతి వెతలనంద
అశ్వతతిజవపు నిశ్వాసములహేల- సురధునీజలధార స్రుక్కిపోవ
గీ. మిన్ను తెన్నుగ గొనిబారు మేటివారు- వములు చిత్రభానుని రథగమిని చిత్ర-
గతుల నడపుచు నరుదెంచె గగనవీధి- నుండి మనకు సంపదలీయ దండిగాను.

శ్లో॥ అక్షే రక్షాం నిబధ్య ప్రతిసరవలయైర్యో జయంత్యో యుగాగ్రం
ధూస్తంభేదత్తధూపాః ప్రహితసుమనసో గోచరే కూబరస్య
చర్చాం చక్రే దధత్యో మలయజరజసా సిద్ధవధ్వస్త్రిసంధ్యం
వందంతే యం ద్యుమార్గే స నుదతు దురితాన్యంశుమత్స్యందనో వః॥ 67 ॥

## తాత్పర్యము:

అక్షమునకు రక్షనుగట్టి, కాడియంచులకు తోరములను బంధించి, రథాగ్రమునకు ధూపముల నొసగి, కాడిని గట్టునొగలయందు పుష్పమాలికలనలంకరించి, చక్రమునందు చందనద్రవముతో పూతపూసి, మూడు సంధ్యలయందు ఆకాశమార్గమున సిద్ధస్త్రీలు దేనిని నమస్కరించుదురో, ఆ సూర్యరథము మీ పాపముల నపనయించుగాక!

## అనువాదపద్యము:

సీ. అందంపుటరదంపు నక్షమధ్యమునందు- నక్షిదోషముఁబాప రక్షగట్టి
యుగ్యకంధరవాహయోగదండమునకు- సుమవల్లరులగట్టి సొబగుగూర్చి
ధూస్తంభమునకంత ధూపమ్మువేసియు- పూలనర్పించియుఁబూజఁజేసి
చక్రంపుమెరుగన చందనద్రవమును- పోడిమినుమడింప పూతఁబూసి

ఆ.వె. మూడుసంజలందు ముచ్చటగొల్పగా
సిద్ధకన్యలిట్లు సిద్ధపరచి
రథమునధివసింప రవిరాజు గొల్తురు
అట్టి యరదమిచ్చునన్నిసిరుల.





శ్లో॥ ఉత్కీర్ణస్వర్ణరేణుద్రుతఖురదలితా పార్శ్వయోశ్శశ్వదశ్వై-
రశ్రాంత భ్రాంతచక్రక్రమనిఖిలమిలన్నేమినిమ్నా భరేణ
మేరోర్మూర్ధన్యఘం వో విఘటయతు రవేరేకవీథీ రథస్య
స్వోష్మోదక్తాంబురిక్త ప్రకటితపులినోద్ధూసరా స్వర్ధునీవ॥ 68 ॥

## తాత్పర్యము:

పలుమారు గుఱ్ఱముల వేగవంతములగు గిట్టలచేతనిరుపార్శ్వముల చూర్ణము చేయబడి యెగురగొట్టబడిన స్వర్ణరజముగలదియు, నిరంతరము తిరుగు చక్రముయొక్క అంచుతాకిడిచే బరువుచే లోతుగానైనదియు, తన వేడిచే నీరిగిరిపోవుటచే మలినములు బయల్పడి ధూసరితయైయున్న స్వర్గంగవలె నున్నదియునయి మేరుశిఖరముపై నున్న సూర్యుని రథము యొక్క ఏకమార్గము మీ పాపమును నశింపజేయుగాక!

## అనువాదపద్యము:

సీ. అశ్వధాటికి కనకాచలశృఙ్గము-తీర్ణరేణుగణమై శీర్ణమయ్యె
పదఘట్టనమునకుఁబారెడి చక్రంపు- నేమిఘట్టనమున భూమి క్రుంగ
తానయి మణిశిలాసానుమార్గమునంత- నిమ్నోన్నతముఁజేసి నిజభరమున
ఆదిత్యుతేజము లగ్నులఁగురిపింప- నభ్రగంగా జలంబంతరింప

తే.గీ. పులినములు బయల్పడగను పూర్తిగాను
ఏకవీధిని ధాటితో నేకచక్ర-
రథములంఘించి మేరువు రాకచేత
పాపపుంజమ్ము పోకార్ప పయనమయ్యె॥

శ్లో॥ నంతుం నాకాలయానామనిశముపయతాం పద్ధతిః పఙ్క్తిరేవ
క్షోదో నక్షత్రరాశేరకృశరయమిళచ్చక్రపిష్టస్య ధూళిః
హేషాహ్రాదో హరీణాం సురశిఖరిదరీః పూరయన్నేమినాదో
యస్యావ్యాత్తీవ్రభానో స్స దివి భువి యథా వ్యక్తచిహ్నో రథో వః ॥ 69 ॥

## తాత్పర్యము:

నిరంతరము నమస్కరించుటకు వచ్చు దేవతల వరుసయే మార్గముగా, కడువేగముతో భ్రమించే చక్రముచేత చూర్ణితములగుచున్న నక్షత్రముల చూర్ణమే ధూళిగా, గుఱ్ఱముల సకిలింపు ధ్వనులే మేరుపర్వతగుహల లోపలిభాగముల నింపు నేమిధ్వనులుగా, ఆకసమునందు సైతము భూమియందువలెనే చిహ్నములను గన్పింపజేయుచున్న సూర్యరథము మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. ఆదిత్యునర్చింప నలరెడు వేల్పుల- పంక్తులు నింగిని పథముఁ దెలుప
ఏకచక్రపుధాటికేమాత్రమోపక- నుగ్గు ధూళిగ చుక్కలగ్గళింప
సుందరమ్మగు మేరుకందరమ్ములలోన- హయహేషలవియనననునదింప-
నంబరవీథిలో నవని సరణివోలె- నగుపింపజేయుచున్నన్నిచిహ్న-

తే.గీ. ములను వచ్చుచున్నది దినమునొనగూర్చు
నాదిదేవుని సూర్యుని యరదమదియ
కర్మపరిపాకమంతను కడిగివేసి
యన్ని సుఖములనందీయనవనికిపుడు.





శ్లో॥ నిస్పందానాం విమానావళివితతదివాం దేవబృందారకాణాం
బృందైరానందసాంద్రోద్యమమపి వహతాం విందతాం వందితుం నో
మందాకిన్యామమందః పులినభృతి మృదుర్మందరే మందిరాభే
మందారైర్మండితారం దధదరి దినకృత్స్యందనస్స్వాన్ముదే వః॥ 70 ॥

## తాత్పర్యము:

ఇసుకప్రదేశములు గల ఆకాశగంగ యందు సైతము శీఘ్రగమనములు గలిగి, ఆనందముతో పట్టుదలతో బరువిడి వచ్చుచున్న దేవముఖ్యులకు స్తోత్రము చేయుటకేని లభింపక, బడలిక చెంది విమానములతోనాకసమును కప్పుచు వెనుకగావచ్చువారలకు నగరతుల్యమగు మందరపర్వతమున నించుక వేగము తగ్గుటచే లభించి, వారు మందారకుసుమములతో నర్చించిన యాకులు గల చక్రముతో నొప్పెడు నా సూర్యరథము మీకానందము నిచ్చుగాక!

## అనువాదపద్యము:

సీ. గగనగంగాతీర గమనమార్గమ్మది- యిసుకలు వారగా విసుగుఁగొనక
ఆనందముప్పొంగ నరుదెంచునమరుల-వందనములవన్ని యందుకొనుచు
మందిరమ్మైనట్టి మందరగిరిపైన- తిరుగు విమానాళి తెగడకుండ
మందారమాలికలందమ్ముఁ గూర్పగా- చక్రారములయందుఁజక్కగాను

తే.గీ. సిద్ధచారణులంజలి సేయుచుండ
దివ్యకాంతుల తేజులు తేజరిల్ల
నవ్యగతులను సారథి నడుపుచుండ
అక్షితర్పణమొనరించు నర్కు రథము.

శ్లో॥ చక్రీ చక్రారపఙ్త్కిం హరిరపి చ హరీన్ ధూర్జటిర్ధూర్ధ్వజాంతా
నక్షం నక్షత్రనాథోరుణమపి వరుణః కూబరాగ్రం కుబేరః
రంహస్సంఘస్సురాణాం జగదుపకృతయే నిత్యయుక్తస్య యస్య
స్తౌతి ప్రీతిప్రసన్నోన్వహమహిమరుచేస్సోఽవతాత్స్యందనో వః ॥ 71 ॥

## తాత్పర్యము:

లోకోపకారమునకు నిత్యప్రవృత్తమగు యే రథముయొక్క చక్రపుటాకులను విష్ణువు, గుఱ్ఱములను ఇంద్రుడు, రథాగ్రమందలి టెక్కెమును ధూర్జటి, చక్రపుగండను చంద్రుడు, సారథియగు నరుణుని వరుణుడు, కాడిగట్టు నొగప్రదేశమును కుబేరుడు, వేగమును దేవతల బృందము స్తుతించునో ప్రీతిచే ప్రసన్నమయిన యా సూర్యరథము మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. ఉపకారదీక్షతో నుదయించు సూర్యుని- చక్రనేమినిఁగొల్చు చక్రి యతడు
సప్తాశ్వసంఘమున్ సంక్రందనుడుఁగొల్వ- ధూర్జటి తాఁగొల్చుధూర్ధ్వజమును
అక్షమునర్చింప నక్షత్రనాథుండు- అరుణుని గొల్చును వరుణుడహహ
కూబరాగ్రము దానిఁగొలుచు కుబేరుండు- బృందారకులుసేయ వందనములు
గీ. అనుదినమ్మును నిట్టులా యరుణరథము
వేల్పులందరి పూజల వేలమగుచు
దివ్యకాంతుల ఁదనరారు భవ్యకీర్తి-
నదియ యఘములనన్నిటి నడచు గాత!





శ్లో॥ నేత్రా హీనేన మూలే విహితపరికరస్సిద్ధసాధ్యైర్మరుద్భిః
పాదోపాంతేస్తుతోలం బలిహరిరభసాకర్షణాద్బద్ధవేగః
భ్రామ్యన్వ్యోమాంబురాశావశిశిరకిరణస్యందనస్సంతతం వో
దిశ్యాల్లక్ష్మీమతుల్యా మతులిత మహిమేవానరో మందరాద్రిః॥ 72 ॥

## తాత్పర్యము:

ఆకాశమనెడు సముద్రమున తిరుగుచున్న అపరమందర పర్వతమో యనునట్లున్నదియు, మహామహిమోపేతమునగు రవిరథము మీ కనల్పమగు లక్ష్మినిచ్చుగాక! యని ప్రధాన వాక్యార్థము. మందరాచలమునకు రవిరథమునకు**'నేత్రా హీనేన మూలే; పాదోపాన్తే స్తుతః, బలిహరిరభసాకర్షణాద్బద్ధవేగః'** అను పదముల శ్లేషచేనిట్లు సామ్యము గూర్చబడినది.

## అనువాదపద్యము:

సీ. అంబరతలమది యంబుధిఁదలపింప- రవితేజు మందరభ్రాన్తిఁగొలుపు
కరచరణరహిత కాకోదరారుణ- భ్రమిమూలమదియన భ్రమనుఁగొలుపు
బలిహరివేగముల్పనపునాకర్షింప- సామ్యమదియుఁగూడఁజక్కఁదోచు
అంబరాంబుధులందు నలరిన భ్రమిచేత- ద్రచ్చి సుధలనిచ్చు ద్రఢిమ కలిగి
గీ. యన్నివిధముల మందరమనగఁదోచు
నర్కురథమది హరిపదమలరఁజేసి
సంతతశ్రీలనందీయ సజ్జనాళిఁ
కనగవచ్చెను తానుగా నవనికిపుడు.

# భానుమణ్డలవర్ణనమ్

(ఈశ్లోకమునుండి ఎనిమిది శ్లోకములలో సుర్యమణ్డలము వర్ణింపబడుచున్నది.)

శ్లో॥ యజ్ఞ్యాయో బీజమహ్నామపహతతిమిరం చక్షుషామఞ్జనం య-
ద్వారం యన్ముక్తిభాజాం యదఖిలభువనజ్యోతిషామేకమోకః
యద్వృష్ట్యంభోనిధానం ధరణిరససుధాపానపాత్రం మహద్య-
ద్దిశ్యాధీశస్య భాసాం తదవికలమలం మఙ్గళం మండలం వః॥ 73 ॥

## తాత్పర్యము:

పగళ్లకు ప్రశస్తమగు బీజము, కన్నులకంధకారాపహమగు నంజనము, ముక్తినందిన యోగులకు ద్వారము, జగత్తునందలి సకల తేజస్సులకు నేకైకాశ్రయము, వర్షమనెడు హేతువుచే జలములకెల్ల నాధారము, భూమియందలి నీటిని ద్రావెడు గొప్ప పానపాత్రమునయిన సూర్యమండలము మీకు సంపూర్ణమంగళములను నిరంతరముగా నిడుగాక!

### భానుమణ్డలము

## అనువాదపద్యము:

సీ. అనుదినంబున నది యహమును పండింప- నంబరక్షేత్రాన నలరువిత్తు
చీకాకుపరచెడి చీకటిఁబోగొట్టి- కంటికందముఁ గూర్చు కజ్జలంబు
మోక్షకాముకులకు ముక్తిమార్గముఁజూపు- ద్వారదేశమనగ తరణియొప్పు
లోకంపు వెలుగులకే కాశ్రయంబది- వర్షాంబునిధియగు హర్షధామ

గీ. మదియ భూదేవి రససుధనరసిగ్రోలు- పానపాత్రమ్ము పావన భానుమండల
లంబదియ మనకు నవికలమగుదీప్తి- శుభములందిచ్చి బ్రోచుట సుఖముతోడ.





శ్లో॥ వేలావర్ధిష్ణు సింధోః పయ ఇవ ఖమివార్ధోద్గతాగ్ర్యగ్రహోడు
స్తోకోద్భిన్నస్య చిహ్నప్రసవమివ మధోరాస్యమస్యన్మనాంసి
ప్రాతః పూష్ణో శుభాని ప్రశమయతు శిరశ్శేఖరీభూతమద్రేః
పౌరస్త్యోర్ధ్వగభస్తిస్తిమితతమతమఃఖండనం మండలం సః ॥ 74 ॥

## తాత్పర్యము:

సముద్రజలమువలె వేలావర్ధిష్ణువయి నియమిత సమయములందుఆకసమువలె ఇంచుక ప్రకాశించు ప్రధానగ్రహములు గలదియై, వసంతారంభమువలె కొలదిగా కనిపించిన స్వచిహ్నప్రసవము గలదియై, జనుల మనస్సుల కాహ్లాదము కలిగించుచు, ఉదయకాలమున పూర్వపర్వతశిఖరముల కలంకారమై పైకి ప్రసరించు కిరణములు గలదియునగు సూర్యమండలము మీ యశుభములను నశింపజేయుగాక!

## అనువాదపద్యము:

సీ. చెలియలికట్టతో చెలిమిచేయుచు పొంగు- నంబుధి జలముల దంబుజూపి
తారకాగ్రహముల దనరారు వాసమౌ- నాకసంబును మించి యందమునను
మధుమాస కుసుమాల మధురశోభల గూర్చి- యాకాశవనముల నందగించి
తొలిసంజ తూరుపు తొయ్యలి యుదయాద్రి- శేఖరంబనగాను శీర్షమందు

గీ. గగనసరసిని విరిసిన కమలమనగ
కారుచీకటి ఖండించు ఖడ్గమనగ
ఉదయభానుని కిరణసముదయమొప్పి
మండలంబుగ సమకూర్చు మంగళములు.

శ్లో॥ ప్రత్యుప్తస్తప్తహేమోజ్జ్వలరుచిరచలః పద్మరాగేణ యేన
జ్యాయః కింజల్కపుంజం యదలికులశితేరంబరేందీవరస్య
కాలవ్యాళస్య చిహ్నం మహితతమమహామూర్ధ్ని రత్నం మహద్య-
ద్దీప్తాంశోః ప్రాతరవ్యాత్తదవికలజగన్మండనం మండలం వః॥ 75 ॥

## తాత్పర్యము:

ప్రాతఃకాలమున తప్తకాంచనవర్ణమయిన పూర్వాద్రియందు పొదుగబడిన పద్మరాగమణియై, యాకాశమనెడు నల్లకలువ యొక్క తుమ్మెదల నీలిమపై దగులుకొనిన యధికమగు పుప్పొడి సముదాయమై, కాలమనెడు సర్పము యొక్క శిరస్సుపై చిహ్నముగా నున్న మహారత్నమై వెలుగునట్టిదియు, జగత్తునకు నిండైన యలంకారమయినదియు నగు సూర్యమండలము మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. ప్రాభాతవేళలో ప్రాచీదిశాభాగ- మంతయు దాస్వర్ణమయపుశోభ
పరపుచునుదయాద్రి పద్మరాగకిరీట- మనదోచుమార్తాండమండలమ్ము
చదలేటికల్హారషట్పదపీఠిపై- మంజులకింజల్కపుంజమనగ
కాలాహిఫణఫల కమ్ముపైనున్నట్టి- రమణీయమగుమహారత్నమనగ

గీ. పద్మరాగపు కాంతితో పసుపుకాంతి
కలసి తప్తకాంచన శుభకాంతితోడ
భానుమండలమద్దియ భాసమీర
లోకమండనమగుచును సాకుగాత!





శ్లో॥ కస్త్రాతా తారకాణాం పతతి తనురవశ్యాయబిందుర్యథేందు-
ర్విద్రాణా దృక్స్మరారేరురసి మురరిపోః కౌస్తుభో నోద్గభస్తిః
వహ్నేస్స్వాపహ్నవైవ ద్యుతిరుదయగతే యత్ర తన్మండలం వో
మార్తాండీయం పునీతాద్దివి భువి చ తమాంసీవ ముష్ణన్మహాంసి॥ 76 ॥

## తాత్పర్యము:

ఏది యుదయింపగా నక్షత్రములు రక్షకుడు లేక నశించునో, చంద్రుడు చిన్నమంచు బిందువు వలె నశించునో, స్మరవిరోధి (శంకరుని) కన్ను నిదురజెందునో, మహావిష్ణువుయొక్క యెదపైనున్న కౌస్తుభమణికాంతులు కుంఠితములగునో, వహ్నికాంతి కాంతి కాదిదియని యపహ్నవింపబడునో, దివియందు భువియందుగల తేజములనెల్ల చీకట్లనువలెనే హరింపజాలునదైన యట్టి మార్తాండమండలము మిమ్ము పవిత్రులజేయుగాక!

## అనువాదపద్యము:

సీ. అంబరమణిగాను నర్కుడు దయమంద-నోషధీశుడు కాంతినోడిపోయె
ఉడుపతి పడిపోవనుడు గణంబులురాలె- తరణికి నెదురేగ త్రాత యెవడు?
తేజముఁగనలేక నోజస్సు కోల్పోయి- ముక్కంటి సెగకన్ను మూతవడియె
కమలాలయాధీశు కౌస్తుభరత్నంబు- వెలవెలవోయెను వెలుఁగులేక

గీ. ఉదయభానుని కాంతుల యూర్జితాభ
వహ్నితేజముఁగూడను వాడఁ జేసె
నట్టి యాదిత్యమండలమవనితేజ-
ములను బరిమార్చి మీకును మోక్షమొసగు.

శ్లో॥ యత్ర్పాచ్యాం ప్రాక్చకాస్తి ప్రభవతి చ యతః ప్రాచ్యసావుజ్జిహానా
దిత్థం మధ్యే యదహ్నో భవతి తతరుచా యేన చోత్పాద్యతేకహః
యత్పర్యాయేణ లోకాన్ ప్రతపతి జగతాం జీవితం యచ్చతద్వో
విశ్వానుగ్రాహి విశ్వం సృజదపి చ రవేర్మండలం ముక్తయేకస్తు॥ 77 ॥

## తాత్పర్యము:

ఏది తొలుత తూర్పున ప్రకాశించునో, ఏది యుదయించుటచేతనే యది తూరుపగుచున్నదో, పగటి మధ్యమందేది మిక్కిలి కాంతితో ప్రకాశించునో, దేనిచే పగలేర్పడుచున్నదో, ఏది జగత్తులను దహింపజేయునో, ఏది జగత్తులకు ప్రాణమో, ఆ విశ్వసృష్టిరక్షణ కారణమగు రవి మండలము మీకు ముక్తి నొసగుగాక!

## అనువాదపద్యము:

సీ. ఇనుడు తానుదయింపనిలను తూరుపుఁబొందె- ప్రాగ్దిశారంభపు ప్రాభవమును
మహిత మార్తాండుని మధ్యమస్థితి చేత-మధ్యాహ్న సమయంబు మహిమఁగాంచె
చీకట్లఁ దునుమాడిఁ జేసియు దివసము-దివసకరుండయ్యె దీప్తి చేత
పర్యాయమున లోకబాంధవుడగుచును- జీవులకిచ్చును జీవములను

గీ. విశ్వరక్షణ తనదగు వేడుకనగ
విశ్వసృష్టికి తానుగ వేదబమున
వచ్చిమండల దీప్తుల వాటమునను
ముక్తినిచ్చుత మీకు సమ్మోదమలర.





శ్లో॥ శుష్యంత్యాధానుకారా మకరవనతయో మారవీణాం స్థలీనాం-
యేనోత్తప్తాః స్ఫుటంతో ఝుడితి తిలతులాం యాంత్యగేంద్రా యుగాంతే
తచ్చండాంశోరకాండ త్రిభువనదహనాశంకయా ధామ కృత్స్నం
సంహృత్యాలోకమాత్రం ప్రలఘు విదధతస్స్వాన్ముదే మండలం వః॥ 78 ॥

## తాత్పర్యము:

యుగాంతకాలమున దేనిచే తప్తములై సముద్రములు మరుస్థలముల ననుకరించుచు నెండిపోవునో, పర్వతములు పెటిలిపోయి తిలప్రమాణముగలవి యగునో, ముల్లోకములాకస్మికముగ దహింపబడునేమోయను ఆ శంకచే సమస్త తేజమునుపసంహరించి వెలుగునిదునంతమాత్రము కొలదిగా తేజస్సును ప్రసరించు సూర్యునియొక్క యా మండలము మీ కానందము నొసఁగుగాక!

## అనువాదపద్యము:

సీ. ఏ సూర్యమండల మేడు పాథోధుల- మరగించి యింకించు మారవముగ
ఏ సూర్యమండలంబీ మేరుగిరిపేల్చి- నూవుగింజలవోలె నుగ్గుసేయు
ఏ సూర్యమండలంబీ మూడులోకాల- చండదాహముచేత మండజేయు
ఏ సూర్యమండలమెదిరించగాలేక- నమృతాంధసులుగూడ నస్తమింతు-

ఆ.వె. రట్టికాంతి నలరు నాసూర్యదేవర
తనదుకిరణచయము తగ్గజేసి
లోకబాంధవుడన నాకమరసిభువి
కి దిగివచ్చి మనకు ముదముగూర్చు.

శ్లో॥ ఉద్యద్ద్యుద్యానవాప్యాం బహులతమతమఃపంకపూరం విదార్య
ప్రోద్భిన్నం పత్రపార్శ్వేష్వవిరళమరుణచ్ఛాయయా విస్ఫురంత్యా
కల్యాణాని క్రియాద్వః కమలమివ మహన్మండలం చండభానో
రన్వీతం తృప్తిహేతోరసకృదలికులాకారిణా రాహుణా యత్॥ 79 ॥

## తాత్పర్యము:

ఆకాశమనెడు ఉద్యానవాసి (బావి) యందు చిమ్మచీకటి యనెడు పంకమును భేదించుకుని, పత్రపార్శ్వము లందెడతెగక వ్యాపించిన అరుణచ్ఛాయతో ప్రకాశించుచు, తృప్తినందగోరి వెంటాడుచున్న తుమ్మెదల గుంపువంటి రాహువుచే ననుసరింపబడుచు, పెద్ద పద్మము వలె నుదయించుచున్న సూర్యమండలము మీకు మంగళములనొసంగుగాక!

## అనువాదపద్యము:

సీ. అందాల చిందించు నాకాశవనములో- తీరియుండెను పెద్ద దిగుడుబావి
బావిలో నున్నట్టి బహుళజంబాలంపు- చీకటిఁజీరగా చేరి యరుణ-
కిరణాల జాలమ్ముకి సలయపార్శ్వాల- వ్యాపింపగాజొచ్చె నేపుగాను
అరుదెంచె స్వర్భానుడా భానుకబళింప- రోలంబవితతిగా రూపుదాల్చి
ఆ.వె. గగనమధ్యమందుఁ గనవచ్చు దినమణి
అభ్రగంగాపద్మమనగ నలర-
నతని మండలంబు నారసి యర్చింప
నన్ని శుభములవియ యమరుగాదె!





శ్లో॥ చక్షుర్దక్షద్విషో యన్న తు దహతి పరం పూరయత్యేవ కామం
నాస్తం జుష్టం మరుద్భిర్యదిహ నియమినాం యానపాత్రం భవాబ్ధౌ
యద్వీతశ్రాంతి శశ్వద్భ్రమదపి జగతాం భ్రాంతిమభ్రాంతి హంతి
బ్రధ్నస్యావ్యాద్విరుద్ధ క్రియమపి విహితాధాయి తన్మండలం వః॥ 80 ॥

## తాత్పర్యము:

దక్షశత్రువగు శివుని నేత్రమయ్యు ఏది కామదాహమొనర్పక కామపూరణమొనర్చునో, యేది యోగులకు భవాబ్ధిని దాటించు నావయయ్యు, మరుత్తులచే నశింపఁజేయబడక మరుత్తులచే సేవింపబడునో, యేది నిరంతరము విశ్రమింపక భ్రమించుచున్నదయ్యును లోకుల భ్రాంతిని అభ్రాంతిగ హరించునో, ఏది యిట్లు విరుద్ధక్రియలు గలదియయ్యును హితకారియో, ఆ సూర్యమండలము మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. దక్షాధ్వర ధ్వంసి దారుణం బగుకన్ను- కామదాహకమిప్డు కామదంబు
భవసాగరము దాట భవ్యయోగులనావ- మరుదవినాశియై మారుతసేవ్యమై
విరతిని గొనకయే వీడకభ్రాన్తిని-భ్రాంతిలోని జగపుభ్రాంతిబాపు
విశ్వమ్ములోనిట్లు విపరీతసరణిని- అహితమంతయుబాపి విహితమొసగు
ఆ.వె. భవ్యమార్గమిట్లు బ్రధ్నుడు బోధించి- అహితమందు జూపి విహితమదియ
అర్కమండలంపు యద్భుతబోధన- లవనిజనులకలుషమడచిగాచు.

**ఇతి మండలవర్ణనమ్. (భానుమణ్డలవర్ణన ముగిసినది).**

# రవివర్ణనమ్

**(ఈ శ్లోకమునుండి 20శ్లోకములలో ఆదిత్యదేవుని వర్ణనగావింపఁబడినది.)**

శ్లో॥ సిద్ధైస్సిద్ధాంతమిశ్రం శ్రితవిధి విబుధైశ్చారణైశ్చాటుగర్భం
గీత్యాగంధర్వముఖ్యైర్ముహురహిపతిభిర్యాతుధానైర్యతాత్మా
సార్ఘ్యం సాధ్యైర్మునీంద్రైర్ముదితతమమనోమోక్షిభిః పక్షపాతాత్
ప్రాతః ప్రారభ్యమాణస్తుతిరవతు రవిర్విశ్వవంద్యోదయో వః ॥ 81 ॥

## తాత్పర్యము:

సిద్ధులచే సిద్ధాంతోక్తవిధిసముపేతముగా, దేవతలచే విధినిహితరీతిని, జారణులచే గుణవర్ణన సహితముగా, గంధర్వులచే మధురగానములతో పన్నగేంద్రులచేతను పిశాచములచేతను మనోనిగ్రహపూర్వకముగా సాధ్యులచే నర్ఘ్యప్రదానపూర్వకముగా, మునీంద్రులచే మిగుల సంతోషించిన మనస్సులతో, యోగులచే స్వాత్మభావనతో నుదయకాలమున స్తుతింపబడుచున్న సర్వజగద్వంద్యమగు నుదయముగల సూర్యుడు మిమ్ము రక్షించుగాక!

# సూర్యదేవుడు

## అనువాదపద్యము:

సీ. సిద్ధాంతపద్ధతి సిద్ధసంఘంబులు- విబుధవర్యులు జూచి వేదసరణి
చారణవితతులు చాటు పద్యంబుల- గాంధారగ్రామంపుగానఫణితి
గంధర్వగణములు గనియుసేవింపగా- ఫణిపతి ఫణములఁబట్టఁగొడుగు
యాతుధానులుగొల్వ నాత్మను నియమించి- సాధ్యులర్ఘ్యవిధిని సంఘటింప
ఆ.వె. మోక్షకాములైన మునులు మొక్కుచునుండ- యతులు యోగరూఢినర్చ సలుప
నరుగుదెంచునర్కుడవనికీవిధమున- రక్షసేయులోకచక్షువనగ.





శ్లో॥ భాసామాసన్నభావాదధికతరపటోశ్చక్రవాలస్య తాపాత్
ఛేదాదచ్ఛిన్నగచ్ఛత్తురగఖురపుటన్యాసనిశ్శంకటంకైః
నిస్సంగస్యందనాంగ భ్రమణనికషణాత్స్వాతు వస్త్రిప్రకారం
తప్తాంశుస్తత్పరీక్షాపర ఇవ పరితః పర్యటన్హాటకాద్రిమ్ ॥ 82 ॥

## తాత్పర్యము:

మేరుపర్వతము సమీపమున నుండుటచే మిక్కిలి తీక్షణమగు కాంతి సముదాయము యొక్క తాపము వలనను, నిరంతరముగా నడచుచున్న గుఱ్ఱముల గిట్టలనెడు తీక్షణములగు టంకములచే ఛేదించుటవలనను, తగులక పరుగెత్తు రథచక్రము యొక్క భ్రమణమువలని యొరిపిడివలన, ముప్విధముల దానిని పరీక్షించుటయందు తత్పరుడయ్యెనో యనునట్లు బంగారుకొండను జుట్టి తిరుగుతున్న సూర్యుడు మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. పసిడిగుబ్బలి యొక్క మిసిమి పరీక్షింప- నాదిత్యుదరుదెంచె ననగఁదోచు
చక్రవాళమరసి చండతేజముతోడ- కరిగించి మరిగించి కనును వన్నె
అచ్ఛిన్నగతి పారునశ్వాంఘ్రిఖురటంక- ఛిన్నసంహతి గూర్చు శిలలకనగ
నిస్సంగరథనేమి నీరవఘట్టన- మొనరించి యుల్కలనొరయఁజిమ్ము
గీ. ముప్విధంపు పరీక్షల ముంచి తేల్చి
మేరువునఁగూడ మిసిమిని యేరు వేల్పు
కనుచుకర్మల ఫలమిచ్చు కర్మసాక్షి
మీకు రక్షకుడగుగాక! మేలుఁగూర్చి ॥

శ్లో॥ నోచ్ఛుష్కం నాకనద్యా వికసితకనకాంభోరుహం భ్రాజితం తు
ప్లుష్టా నైవోపభోగ్యా భవతి భృశతరం నందనోద్యానలక్ష్మీః
నో శృంగాణి ద్రుతాని ద్రుతమమరగిరేః కాలధౌతాని ధౌతా
నీత్థం ధామ ద్యుమార్గే ప్రదయతి దయయా యత్ర సోఽవ్యాదినో వః॥ **83** ॥

## తాత్పర్యము:

ఎవ్వడాకాశమార్గమున తన దీప్తమగు తేజమును మృదు వొనరించుటచే నాకనది యెండిపోక వికసించిన స్వర్ణకమలములు గలదై ప్రకాశించునో, నందనోద్యాన శోభ వాడువారక మిక్కిలి భోగయోగ్యమగునో, మేరుపర్వత స్వర్ణశిఖరములు కరగిపోక మిక్కిలి ప్రకాశవంతములగునో, ఆ సూర్యుడు దయతో మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. చదలేటి బంగారు జలరుహంబుల శోభ- శుష్కించునని యెంచి చురుకువీడి
నందనోద్యానపు నవకిసలయశ్రీల- నుపభోగ్యములుగాగ నుష్ణముడిపి
కనభూధరశృంగ కమనీయ శోభలు- కరిగి కాలగతిని కలసిపోవు
ననుచు నెమ్మనమున నర్కుడు తలపోసి- సర్వమజ్గళదీప్తి సారణమున
గీ. దయను చూపించి లోకాల దయితుఁడనగ
పద్మబాంధవుడఖిల ప్రభాకరుండు
లోకబాంధవుడనగను లోకరక్ష
నహము వీడియునొనరించు నహరహమున.





శ్లో॥ ధ్వాంతస్యైవాంతహేతుర్న భవతి మలినైకాత్మనః పాప్మనోఽపి
ప్రాక్పాదోపాంతభాజాం జనయతి న పరం పంకజానాం ప్రబోధమ్
కర్తా నిశ్శ్రేయసానామపి తు న ఖలు యః కేవలం వాసరాణాం
సోఽవ్యాదేకోద్యమేచ్ఛావిహితబహుబృహద్విశ్వకార్యోఽర్యమా వః॥ **84** ॥

## తాత్పర్యము:

ఎవడు మలినైకరూపములగు తమస్సులను మాత్రమే కాక పాపములను కూడా తొలగించునో, పద్మములకే కాక తన చరణ సామీప్యమును బొందిన వారికెల్ల ప్రబోధమును గలిగించునో, పగళ్లకే కాక మోక్షములకు కూడా కారణమగునో, యిట్లొక్క కార్యము చేయఁబూని దానిచేతనే యనేక మహావిశ్వకార్యముల నెరవేర్చునట్టి ఆ సూర్యుడు మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. లోకాల చీకట్లనే కాదు లోకుల- పాపాలగూడను పారద్రోలి
పంకేరుహాళితో పాటుగా నుదయాన- శరణార్థులకు వికాసమ్ముగూర్చి
దివసకర్తయెకాదు దీనావనుండన- గని భక్తిమోక్షమార్గమ్ముజూపి
ఒక్కటిచ్ఛసలుపనొక్కటి తానుగా- సమకూరునట్లుగా సంఖ్యమీరి
గీ. జగతి నుపకర్తలిట్లుగా జయముగాంత్రు
విశ్వకల్యాణభావన వేడబమున
అహమహమికతోడుత నర్కుడరసి యిలకు
జనులబోధింపవచ్చును తానుగానె.

శ్లో॥ లోటన్లోష్టావిచేష్టశ్రితశయనతలో నిస్స్పృహీభూతదేహ-
స్సందేహీ ప్రాణితవ్యే సపది దశదిశః ప్రేక్షమాణోంధకారమ్
నిశ్వాసాయాసనిష్ఠః పరమపరవశో జాయతే జీవలోక-
శ్శోకేనేవాన్యలోకాభ్యుదయకృతిగతే యత్ర సోఽర్కోవతాన్నః ॥ 85 ॥

## తాత్పర్యము:

ఎవ్వఁడితరలోకముల వెలిఁగింపబోఁగా నిచటి జీవలోకము శోకముచేతనో యన్నట్లు, మృత్పిండమువలె చేష్టావిహీనమై, పడకల నాశ్రయించి, స్పృహకోల్పోయిన శరీరముగలదై జీవించియున్నదా లేదా యను సందేహమున కాస్పదమై పదిదిక్కుల నంధకారమునే చూచుచు, నిట్టూర్పులు నిగుడించుచు, మిగుల పరాధీనమగునో యట్టి సూర్యుడు మనను రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. అన్నిలోకాలకు నాలోకదానము- పక్షపాతము లేకఁబరపు దీక్ష
నాదిత్యుఁడేగగా నన్యలోకములకు- తరణి గనమికిని తాళలేక
నేలకొరిగిరంత నిఃస్పృహులగుచును- జీవులు మృతులట్ల చేష్టలుడిగి
నిఃశ్వాసపవనాల నిలిచె ప్రాణములెట్లు- అంధకారములయ్యెనన్ని దిశలు

గీ. అంతప్రాణప్రదాతయౌనర్కుడతడు
తన్ను నమ్మిన మిమ్ములఁదట్టిలేపి
లోకబాంధవుఁడనబాపి లోటులన్ని
రక్షజేయుత! తన యనురాగమునను.





శ్లో॥ క్రామన్లోలోఽపి లోకాం స్తదుపకృతికృతావాప్థితః స్థైర్యకోటిం
నౄణాం దృష్టిం విజిహ్మాం విదధదపి కరోత్యంతరత్యంతభద్రామ్
యస్తాపస్యాఽపి హేతుర్భవతి నియమినామేకనిర్వాణదాయీ
భూయాత్స ప్రాగవస్థాధికతరపరిణామోదయోఽర్కః శ్రియై వః॥ 86 ॥

## తాత్పర్యము:

ఎక్కడా ఒక్కక్షణమైనా నిలువకుండా సంచరించేవాడైనప్పటికీ, లోకరక్షణోపకారముల విషయంలో అచంచలదీక్షాతత్పరుడైనవాడును, తనతేజముచే మానవులదృష్టిని సంకోచింపజేస్తున్నా ఆంతరదృష్టిననుగ్రహించి, కృతార్థులను చేసేవాడు, యోగులకు పరనిర్వృతిననుగ్రహించువాడు, పూర్వపూర్వస్థితికంటె, అధికాధికపరిణతి కలవాడునైన సూర్యుడు మీకు సంపదలనిచ్చుగాక!

## అనువాదపద్యము:

సీ. లోకోపకారియై లోకసంచారమ్ము- సల్పుదీక్ష నతడచంచలుండు
బాహిరమ్మగు దృష్టిబరగనీయడుగాని- యాంతరమున నిచ్చు నాత్మ దృష్టి
తాపమ్ముగూర్చుచు తాపసులకు నిచ్చు- తపముకు మోక్షము తగినఫలము
ఉదయమునందుండి యూర్జితకాంతితో- మధ్యాహ్నమునఁ గాల్చు మండుటెండ

గీ. మరల సంజవేళను చలిమంట సరణి
తరణి యలరారు తనదగు తనతనమున
ఇట్టి యాదిత్యమూర్తి నీయిలను గొలువ
నన్ని శుభములనందిచ్చి యాదుకొనడె?

శ్లో॥ వ్యాపన్నర్తుర్న కాలో వ్యభిచరతి ఫలం నౌషధీర్వృష్టిరిష్టా
నేష్టైస్తృప్యంతి దేవా న హి వహతి మరున్నిర్మలాభాని భాని
ఆశాశ్శాంతా న ఖిందంత్యవధి ముదధయో బిభ్రతి క్ష్మాభృతః క్ష్మాం
యస్మింస్త్రైలోక్యమేవం న చలతి తపతి స్తాత్ససూర్యః శ్రియై నః ॥ 87 ॥

## తాత్పర్యము:

సూర్యనారాయణమూర్తి నిత్యము ప్రకాశించుటచేతనే ఋతుచక్రం సక్రమంగా సంభవిస్తూ ఉంటుంది. అనుకూలవర్షాలు కురుస్తాయి. యజ్ఞయాగాదులచే దేవతలు తృప్తి చెందుతారు. గాలి వీచుతుంది. నక్షత్రాలు నిర్మలంగా ప్రకాశిస్తాయి. సముద్రాలు చెలియలికట్టను దాటకుండా ఉంటాయి.పర్వతాలు భూమిని ధరిస్తున్నాయి. ఈవిధంగా ముల్లోకములయొక్క మనుగడకు కారణభూతుడైన సూర్యనారాయణుడు మనకన్ని సిరులనిచ్చుగాక!

## అనువాదపద్యము:

సీ. ఆదిత్యదేవున కాపదవాటిల్ల- నాగిపోవును చక్రమార్తవంబు
కలుగవు ఫలములు కాలమతిచరించు-నోషధులన్నియు నోటువడును
యజ్ఞభాగంబుల నానందమొప్పగా- ముట్టడే దేవుడు నొట్టు వెట్టి
వాయువు స్తంభించు వారిధులుప్పొంగు- దిక్కులు దుఃఖించు దిక్కు మాలి

గీ. చుక్క యాకసమందున నొక్కటయిన
వెలుఁగు సూపదు ధరణిని వీడు గిరులు
ఇష్టవృష్టులు కురియక కష్టమొదవు
నిట్టి సూర్యుడు సంపదలిచ్చు గాక!





శ్లో॥ కైలాసే కృత్తివాసా విహరతి విరహత్రాసదేహోఢకాంతః
శ్రాంతశ్శేతే మహాహావధి జలధి వినా ఛద్మనా పద్మనాభః
యోగోద్యోగైకవానో గమయతి సకలం వాసరం స్వం స్వయంభూ-
ర్భూరిత్రైలోక్య చింతాభృతి భువనవిభౌ యత్ర భాస్వాన్సనోऽవ్యాత్॥ 88 ॥

## తాత్పర్యము:

ముల్లోకములకు ఏలికయైన యే సూర్యదేవుడులోకముల యోగక్షేమములను చూచుచున్నవాడు కాగా, గజచర్మాంబరధారియైన శివుడర్ధనారీశ్వరుడై, కైలాసంలో అనునిత్యమానందతాణ్డవం చేస్తున్నాడో,విష్ణుమూర్తి పాలకడలిలో శేషశయనముపై హాయిగా పవళిస్తున్నాడో, బ్రహ్మ ఏకాగ్రతతో నిశ్చింతగా దినమంతా ధ్యానంలో గడుపుతున్నాడో, అట్టి సూర్యుడు మనను రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. కైలాసగిరిపైన కైపుమీరగ భామ- నర్ధభాగమ్మునందమరఁజేసి
ఆనంద తాండవమాడుచుండెను దేవు- డానందభైరవుఁడతివ తోడ
ఆదిశేషునిపైననా పద్మనాభుండు- ఛద్మశాయి యయ్యె జలధిసద్మ
యోగనిష్ఠను బ్రహ్మయుగములు కల్పాలు- గడుపుచుండెను కన్నుగవల మూసి

గీ. సృష్టి రక్షణలయముల దృష్టి వీడి
లోకనాథులు తమ తమ పోకడలను
ఆదమరచియుండుతరి నాయర్కమూర్తి
మనలరక్షించుగావుత మహిత కరుణ.

శ్లో॥ ఏతద్యన్మండలం ఖే తపతి దినకృతస్తా ఋచోర్చీంషి యాని
ద్యోతంతే తాని సామాన్యయమపి పురుషో మండలేఽణుర్యజూంషి
ఏవం యం వేద వేదత్రితయమయమయం వేదవేదీ సమగ్రో
వర్గస్స్వర్గాపవర్గోపకృతిరవికృతిస్సోఽస్తు సూర్యః శ్రియై నః॥ **89** ॥

## తాత్పర్యము:

**'త్రయీ వా ఏష విద్యా తపతి-తా ఋచః- స ఋచాం లోకః-యదేతదర్చిర్దీప్యతే తన్మహావ్రతం తాని సామాని న సామ్నాం లోకః-య ఏష ఏతస్మిన్మండలే పురుషస్సోఽగ్నిస్తాని యజూంషి స యజుషాంలోకః'-** అనే శృతివచనాలభావమీ శ్లోకంలో వివరింపబడింది. తేజస్వంతుడగు ఈ సుర్యుని ప్రభామణ్డలం ఋగ్వేదం. కాంతిపుంజములు సామలు. మణ్డలాంతర్వర్తియై అణుస్వరూపమైన పరమాత్మగా వెలుగొందే రూపమే యజుర్వేదం. ఇలా త్రయీమూర్తిగా వేదవిదులంతా ఎవనిని కీర్తిస్తారో, వికృతిరహితుడు స్వర్గమోక్షప్రదాతయునైన సూర్యుడు మనకు సంపదలననుగ్రహించుగాక!

## అనువాదపద్యము:

సీ. ప్రాభాకరంబుగా ప్రథితమండలమద్ది- ఋగ్వేదమనియెడి రూఢిఁగాంచె
అలరారునర్చిస్సులవియన్నియునుఁగూడ- సామవేదంబనెడి నామమందె
మండలాంతర్వర్తి మార్తాండుడణురూపుఁ- డనగ యజుర్వేదమాఖ్యఁ బడసి
లోకోపకృతిదీక్ష లోకధర్మంబన- వేదసారంబుగా వేద్యమయ్యె

ఆ.వె. వేదవేద్యుడిట్లు వేదాలరూపున- వేదవిదులకంఠనాదభూష
యగుచు ముక్తినిచ్చునవ్వారికే గాక- మనసుతోడనిచ్చు మనకు సిరులు.





శ్లో॥ నాకౌకఃపత్యనీక క్షతిపటుమహసాం వాసవాగ్రేసరాణాం
సర్వేషాం సాధుపాతాం జగదిదమదితేరాత్మజత్వే సమేఽపి
యేనాదిత్యాభిధానం నిరతిశయగుణైరాత్మని వ్యస్తమస్తు
స్తుత్యస్త్రైలోక్యవంద్యైస్త్రిదశమునిగణైస్సోఽస్తు సూర్యః శ్రియై నః॥ **90** ॥

## తాత్పర్యము:

తమ శత్రువులైన రాక్షసులను సంహరించే సామర్థ్యముకలవారై, జగద్రక్షణదక్షులుగా పేరుగన్న ఇంద్రాదిదేవతలకు, సూర్యునకునుకూడ ఆదితేయులు అంటే అదితిపుత్రులనే పేరు సమంగానే వ్యవహరింపబడుతున్నా, తన సర్వోత్కృష్టమైన గుణసంపదచే రూఢముగా ఆదిత్యుడనే పేరును తనకే పరిమితం చేసుకున్నవాడును,ఆ విధముగా దేవతలచే, దివ్యర్షులచే కీర్తింపబడుచున్న సూర్యుడు మనకు సంపదలనొసఁగుగాక!

## అనువాదపద్యము:

సీ. నాకలోకపువాసు లేకవీరులు తాము- వాసవాగ్రేసరుల సములనఁగ-
నదితికడుపుపంట యార్తి బాపెడి దేవు- లనగ లోకంబుల నాఖ్యఁగాంచ
నాదితేయత్వము నందియు సమముగా- నాదిత్యుడను కీర్తి నర్కుడొకడె
నిరతిశయగుణము నిత్యదీక్షగ లోక- రక్షణంబనగను రాగమరసి

ఆ.వె. స్వీకరించినాడు స్వీయధర్మమని త-
న్నిర్వహణమునిట్లు నిత్యమతడు
విరతిగొనకఁసేయు విధియననాదేవు-
డినుడు మీకు సిరులనిచ్చుగాక!

**శ్లో॥** **భూమిం ధామ్నోభివృష్ట్యా జగతి జలమయీం పావనీం సంస్మృతావ-**
**ప్యాగ్నేయీం దాహశక్త్యా ముహురపి యజమానాత్మికాం ప్రార్థితార్థైః**
**లీనామాకాశ ఏవామృతకరఘటితాం ధ్వాంతపక్షస్య పర్వ-**
**ణ్యేవం సూర్యోష్టభేదాం భవ ఇవ భవతః పాతు బిభ్రత్స్వమూర్తిమ్॥ 91 ॥**

## తాత్పర్యము:

కాంత్యాశ్రయమైన పార్థివదేహాన్ని, జలవర్షణముచేత జలమయశరీరాన్ని, స్మరించినవారిని పావనులనుగావించే పావన(వాయువీయు) దేహమును, ఈప్సితార్థప్రదానముచే యజమానతనువును, అమావాస్యనాడు చంద్రునితో కలసి చాంద్రశరీరమును, తనదైన అర్కదేహాన్ని ధరించి సాక్షాత్కరిస్తూ, ఏ సూర్యుడు అష్టమూర్తియైన శివునివలె వెలుగొందుచున్నాడో అతడు మిమ్ములను రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. **కాంతికి నెలవైన కరణి యాదిత్యుండు- కాశ్యపి తనువున కానుపించు**
**జలవర్షణము చేత జలమయదేహము- ప్రాణము నిల్పును పావనముగ**
**దాహకత్వంబున దహనుదేహము దాల్చి- యజమానురూపుననన్నియిచ్చు**
**అంబరవ్యాపిగా నాకాశదేహంబు- సత్యదీధితిని నాదిత్యతనువు**

తే.గీ. **అట్లె గొనుకృష్ణ పక్షాన నానిశాధి- నాథుమేనికి నిత్యము నాథుడనగ**
**అష్టమూర్తిగ తనువుల నభినయించి- చూపు సామ్యము భవుతోడ సూర్యుడిట్లు"**





**శ్లో॥** **ప్రాక్కాలోన్నిద్ర పద్మాకరపరిమిళనావిర్భవత్పాదశోభః**
**భక్త్యా త్యక్తోరుఖేదోద్గతి దివి వినతాసూనునా నీయమానః**
**సప్తాశ్వాప్తాపరాంతాన్యధికమధరయన్యో జగంతి స్తుతోలం**
**దేవైర్దేవస్స పాయాదపర ఇవ మురారాతి రహ్నాంపతిర్నః ॥ 92 ॥**

## తాత్పర్యము:

ఈ శ్లోకమున విష్ణుసూర్యులకు శ్లేష. అనగా సూర్యునకు నిర్దేశించబడిన విశేషణములన్నీ శిష్టార్థసామర్థ్యముచేత విష్ణుమూర్తికికూడ అన్వయించి ఆ యిరువురకు అభేదము సూచింపబడినది.అట్టి సూర్యనారాయణుడు శ్రీమన్నారాయణునివలె మనలను రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. **ప్రాభాత సమయాన పద్మాకరార్చిత- పాదశోభల తాను బరపుచుండి**
**త్యక్తోరుఖేదుడై౦ దన్నుసేవించెడి- వినతాత్మజుని చేత వేగిరముగ**
**సప్తాశ్వచయమది యాప్తాపరాంతమై- విబుధగణములన్ని వినుతిసేయ-**
**నపర విష్ణుమూర్తి యాదిత్యు౦డనగను- దిక్కులన్నిట౦నిండె దీప్తి తోడ**

ఆ.వె. **దివసకరు౦డనగను దినదినమున లోక-**
**రక్ష సేయవచ్చు రవి యతండు**
**మనదు నుతుల గొనుచు మనసేమ మరయుచు**
**లోకబాంధవుండు సాకుగాత!**

శ్లో॥ యః స్రష్టాఽపాం పురస్తాదచలవరసమభ్యున్నతేర్హేతురేకో
లోకానాం యస్త్రయాణాం స్థిత ఉపరి పరం దుర్విలంఘ్యేన ధామ్నా
సద్యస్సిద్ధ్యై ప్రసన్నద్యుతిశుభచతురాశాముఖః స్తాద్విభక్తో
ద్వేధా వేధా ఇవావిష్కృత కమలరుచిస్సోఽర్చిషామాకరో వః ॥ 93 ॥

## తాత్పర్యము:

ఈ శ్లోకమున బ్రహ్మకు సూర్యునకు శ్లేష. పైశ్లోకంలో వలెనే ఈ శ్లోకంలోకూడా శ్లిష్టవిశేషణ సామ్యముచే సూర్యునకు బ్రహ్మతో సామ్యము చెప్పబడినది. అట్టి పరబ్రహ్మస్వరూపుడైన సూర్యుడు అభీష్టసిద్ధిప్రదుడై భక్తులైన మిమ్ములను అనుగ్రహించుగాక!

## అనువాదపద్యము:

సీ. జలజబాంధవుఁడును, జలజాసనుండును- ఇరువురు స్రష్టలే యిల జలముల-
కుదయ పర్వతమునకున్నతి నొనగూర్చు- నుదయము చేతను నొక్కడనగ
కులపర్వతములకుఁ గూరిమినొక్కండు- భూధరత్వము నిచ్చె భూరి మహిమ
దుర్లంఘ్యమగుధామ దూరంపు నెలవుగా- ముల్లోకములమీద మోదమలర

గీ. కమలవికసనదీప్తిని కమలభవుడు
కమలదయితునితోఁబాటు కలుగఁజేయు
దిఙ్ముఖంబులు నాలుగు తేజరిల్ల
నలువ సాదృశ్యమున రవి చెలువమలరె!





శ్లో॥ సాద్రిద్యూర్వీనదీశా దిశతి దశదిశో దర్శయన్ప్రాగ్దృశో య-
స్సాదృశ్యం దృశ్యతే నో స దశశతదృశి త్రైదశేయస్య దేశే
దీప్తాంశుర్వస్స దిశ్యాదశివయుగదశాదర్శితద్వాదశాత్మా
శాస్త్యశ్వాన్ శర్మ యస్యాశయవిదతిశయాద్దందశూకాశనాద్యః ॥ 94 ॥

## తాత్పర్యము:

ఎవడు పర్వతములు,భూమి, సముద్రములతో కూడ దశదిశలను, ఒక్కమారుగా ప్రకాశింప జేస్తూ, కన్నులనిస్తాడో, ఎవనికింద్రాదిదేవతలతో సామ్యమే లేదో, ఎవని అశ్వములను ఇంగితజ్ఞుడైన అనూరుడు నడిపిస్తున్నాడో, అట్టి సూర్యుడుతన పంద్రెండుమూర్తులతో మీకు మిక్కిలి సౌఖ్యమును కూర్చుగాక!

## అనువాదపద్యము:

సీ. భూన భోంతరముల భూధరాబ్ధివనాళి- దిశలన్ని వెలిగించి దృష్టినిచ్చు
ఆదృష్టి కగుపడు నాదిత్యవైభవ- మాఖండలంబుగా నలరిసాటి
ప్రళయకాలంబున పంద్రెండు మూర్తుల- నుగ్రుడై దోచును రుద్రుడనగ
అశ్వహృదయవేత్త యరుణుండు సారథి- వారువంబులపూన్చి తేఋనడప

గీ. నాదిదేవుడు లోకాలకన్నిసుఖము-
లందజేయగ వచ్చెనహస్కరుండు
కనుచు సర్వము లోకపు కన్నుగాను
కర్మసాక్షిగ నతడిచ్చు కర్మఫలము.

శ్లో॥ తీర్థాని వ్యర్థకానిహ్రదనదసరసీనిర్ఝరాంభోజినీనాం
నోదన్వంతో నుదంతి ప్రతిభయమశుభం శ్వభ్రపాతానుబంధి
ఆపో నాకాపగాయా అపి కలుషముషో మజ్జతాం నైవ యత్ర
త్రాతుం యాతేఽన్యలోకాన్స దిశతు దివసస్త్యైకహేతుర్హితం వః॥ 95 ॥

## తాత్పర్యము:

యే సూర్యదేవుడు ఇతరములైన లోకములననుగ్రహించుటకు వెడలగా, నదీనదకాసారములు, సెలయేళ్లు, సముద్రములయందలి తీర్థభూతములైన జలములు, తుదకు ఆకాశగంగకూడ, తమలో మున్కలిడుజనులకు నరకగర్తములందు పడద్రోయునట్టి పాపములనుప్రక్షాళనము చేయజాలవో, అట్టి దివసకరుడైన సూర్యుడు మీకు హితములను కూర్చుగాక!

## అనువాదపద్యము:

సీ. చక్రవాళాద్రిని చంక్రమించెడిభానుఁ- డావలివైపున కరగినపుడు
సూర్యదేవుని యొక్క చూపులందనియట్టి-తీర్థరాజమ్ములు వ్యర్థమగును
శ్వభ్రపాతమునంది శుభ్రాబ్ధులునుగూడ-పాపపుభయమునుఁ బాపలేవు
దినము సత్తిథివార దీపితంబైనను- దురితము బాపదు దుర్దినమయి

గీ. పూషయొనరించు పూత ప్రత్యూషమనగ
ననుదినమ్మున తనరారు నర్చివితతి
అఘములన్నిటిఁ బరిమార్చి యవని మీకు
హితముగూర్చుత దీక్షతో నతులగొనియు.





శ్లో॥ ఏతత్పాతాళపంకప్లుతమివ తమసాచకముద్గాఢమాసీ
దప్రజ్ఞాతప్రతర్క్యం నిరవగతి తథాలక్షణం సుప్తమంతః
యాదృక్సృష్టేః పురస్తాన్నిశి నిశినిఖిలం జాయతే తాదృగేవ
త్రైలోక్యం యద్వియోగాదవతు రవిరసౌ సర్గతుల్యోదయో వః

## తాత్పర్యము:

ఎవని వియోగముచేత ప్రతిరాత్రియు పాతాళగర్తమునందలి బురదవలెనున్న ప్రగాఢమైన తమస్సులో ముంచెత్తి,ఊహించుటకుకూడ శక్యముకానివిధముగా, నిద్రాముద్రితములైన కన్నులకించుకయుఁ గానరానిదై, సృష్టికిపూర్వమునందున్న అనభివ్యక్తమైన స్థితిని పొందుచున్నదో, సృష్టితో పాటుగా ఉదయించినవాడైన ఆ సూర్యనారాయణుడు మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. సూర్యదేవుడిలను చూపట్టకున్నచో- పాతాళపంకమ్ము పారినట్లు
గాఢాంధకారమ్ము గ్రక్కున వ్యాపింప- కన్నులకేమియుఁ గానరాదు
ప్రజ్ఞాప్రతర్కంబులజ్ఞాతములుగాగ- నిద్దురపెద్దమ్మ మొద్దుజేయు
సర్గపూర్వస్థితి చక్కగా తలపించు- నిష్పందజగతిని నీరవంబు

గీ. కాన జగతిని కాపాడుకాంక్షతోడ-
నుసురు పోసియు నాపైన పిసరుఁగూడ
లోటులేకుండఁ జేయగా పాటువడగ
వేయికరముల సామి విచ్చేయుచుండి!

శ్లో॥ ద్వీపే యోఽస్తాచలోఽస్మిన్భవతి ఖలు స ఏవాపరత్రోదయాద్రి-
ర్యా యామిన్యుజ్జ్వలేందుద్యుతిరిహ దివసోఽన్యత్ర దీప్తాతపస్సః
యద్వశ్యౌ దేశకాలావితి నియమయతో నో తు యం దేశకాలా
వవ్యాత్స స్వప్రభుత్వా హితభువనహితో హేతురహ్నామినో వః॥ **97** ॥

## తాత్పర్యము:

ఈద్వీపానికేది అస్తాద్రి అవుతుందో, అది సూర్యునకావలివైపుననున్న వేఱొకద్వీపానుకుదయాద్రి అవుతుంది. ఈద్వీపానికేది వెన్నెలరాత్రియో, అదియాద్వీపానికి మండుటెండతోడి పగలౌతుంది.ఇలా దేశకాలాలు రెండూ యెవనికధీనములోనుంటాయో, అవి యెవనిని శాసింపఁ జాలవో అట్టి దినకరుడైన సూర్యదేవుడు తనదైన ఆధిపత్యముతో సకలభువనహితకరుడై మిమ్ము రక్షించుగాక!

## అనువాదపద్యము:

సీ. ఇటు వారికుదయాద్రి యటువారికస్తాద్రి- యగును చిత్రమ్ముగానర్కుసరణి
ఈదిశతొలిసంజ నాదిశ మలిసంజ-యగును చిత్రమ్ముగానర్కుసరణి
ఈవైపు నీరెండ యావైపు చంద్రిక- యగును చిత్రమ్ముగా నర్కుసరణి
ఇటువారికుత్తరమటువారి దక్షిణ-మయనమ్ముగానగు నర్కుసరణి

ఆ.వె. దేశకాలములవి ఈశుడౌ యతనికి
వశమున పడియుండు వాటముగను
వానికాతడెపుడు వశ్యుండు కాడహో
అట్టి భానుడిచ్చుతభ్యుదయము!





శ్లో॥ న్యగ్రైరగ్ర్యగ్రహోడుగ్రసనగరుభరైర్నో సమగ్రైరుదగ్రైః
ప్రత్యగ్రైరీషదుగ్రైరుదయగిరిగతో గోగణైర్గౌరయన్గామ్
ఉద్గాఢార్చిర్విలీనామరనగరనగగ్రావగర్భామివాహ్నో
మగ్రే యోగ్రేవిధత్తేగ్లపయతు గహనం స గ్రహగ్రామణీర్వ ॥ **98** ॥

## తాత్పర్యము:

ప్రభాతవేలలో ఉదయపర్వతముపైనుదయించి, వేగముగా ప్రసరిస్తున్నవై, తూర్పుదిక్కుననున్న గ్రహాలను, కబళిస్తున్నవియు,అంతకంతకధికములగుచున్నవియు,అభినవకాంతిమంతములును కదుష్ణములైన తనకిరణచయముచే భూమిని, సుతీక్ష్ణజ్వాలలచే కరిగిన సుమేరుశిలాద్రవముతో పూతపూయుచున్నట్లు ప్రకాశింపజేస్తున్న గ్రహరాజగుసూర్యుడు మీపాపాలను నశింపజేయుగాక!

## అనువాదపద్యము:

సీ. ఉదయాద్రి శిఖరిపైనుదయించి రవిరాజు- నెమ్మది కిరణాల నెరపుచుండ
ఉడురాజుగ్రహములునుడుగణమ్ములతోడ- కనుమరగయ్యెను కాంతి వీడి
ప్రత్యగీషదుదగ్ర బ్రధ్నకిరణజాల- పూర్ణంబులయ్యెను భువియు దివియు
ఉదయభానుని కించిదూష్మకిరణజ్వాల- మేరుగిరి కరిగి పారెననగ-

గీ. నుదయకాంతులు లోకాలనూర్జితముగ
వ్యాప్తిఁజెందుచు బంగారు దీప్తితోడ
బయటి లోపలి చీకట్ల బాపుచుండి
పాపనాశనమొనరించు జూపి కరుణ!

శ్లో॥ యోనిస్సామ్నాం విధాతా, మధురిపురజితో, ధూర్జటిశ్శంకరోఽసౌ
మృత్యుః కాలోఽలకాయాః పతిరపిధనదః, పావకో జాతవేదాః
ఇత్థం సంజ్ఞా డబిత్థాదివదమృతభుజాం యా యదృచ్ఛాప్రవృత్తా-
స్తాసామేవాభిధేయోఽనుగత గుణగణైర్యస్స సూర్యోఽవతాద్వః॥ **99** ॥

**తాత్పర్యము:**

సామప్రభవుడని బ్రహ్మకు, అజితుడని విష్ణువునకు, శంకరుడని శివునకు, కాలుడని మృత్యువునకు, ధనదుడని కుబేరునకు, పావకుడని అగ్నికీ యిలా దేవతలందరికీ కేవలము డిత్థడబిత్థాదులవంటి వ్యవహారైకప్రయోజనములు,రూఢములునైన పేర్లు కలవు. కాని వారియొక్క ఆయా గుణములకన్నింటికీ అన్వర్థాభిధేయుడైన ఆదిత్యదేవుడు మిమ్ము రక్షించుగాక!

**అనువాదపద్యము:**

సీ. సామయోని యనగ సరసిజాసనునాఖ్య-నజితుడననతని యబ్బపేరు
శంకరుడనుపేరు చంద్రశేఖరునకు- కాలాఖ్యయమునకు కలిగెనుర్వి
ధనదుడనెడిపేర దనరె కుబేరుండు- పావకుండని యగ్ని బడసె పేరు
డిత్థడబిత్థరూఢిని పేరులివియన్ని- సార్థకతను పొందజాలవనగ

గీ. నన్ని పేరులకర్థుడా యర్కుడొకడె
దేవులందర గుణములఁ దేజరిల్లి
అందరికి నాతడాలంబ మగుచు రక్ష-
కుండగుత మీకు దీర్చుచు కోర్కెలన్ని.





శ్లో॥ దేవః కిం బాంధవస్స్యాత్ప్రియసుహృదథవాచార్య ఆహోస్విదర్యో
రక్షాచక్షుర్నుదీపో గురురుత జనకో జీవితం బీజమోజః
ఏవం నిర్ణీయతే యః కిమితి న జగతాం సర్వదా సర్వదోఽసౌ
సర్వాకారోపకారీ దిశతు దశశతాభీశురభ్యర్థితం వః ॥ **100** ॥

**తాత్పర్యము:**

లోకములకీతడు దైవమా? బంధువా? అప్తమిత్రుడా? ఆచార్యుడా? పూజ్యుడా? రక్షకుడా? లోచనమా?దీపమా?గురుదా? తండ్రియా? జీవితమా? కారణమా? బలమా? యేమగునోయని నిర్ణయింపశక్యముకానివాడును, లోకులకు సర్వదా సర్వదుడును, సర్వలోకోపకారకుడైన సహస్రాంశుడు మీ కోరికలనీడేర్చుగాక!

**అనువాదపద్యము:**

సీ. భక్తాళికీతండు భగవంతుడాప్తుండు- బంధుడు నెచ్చెలి భవ్యగురుడు
శాస్త్రదీపముజూపి చక్కఁజేయును బుద్ధి-భవరోగబాధల బాపు వెజ్జు
బీజమై మేనికి నోజముఁగరపెడి- జనకుఁడీతడె చూడ జగతిలోన
లోకపుకన్నుగా లోకన్నుఁదెరచియు- పావనమ్మొనరించు జీవనమును

గీ. సర్వరూపులు తానిట్లు సర్వులకును
సర్వదుండన తానిచ్చు సర్వమనగ
సర్వమంగళకరుడన సారణమును
సర్వవేళల సాగించు శ్రాంతిగొనక!

శ్లో॥ చత్వారింశత్ప్రభాయాస్త్రయమథ చ పునర్వాజినాం షట్కముక్తం
పశ్చాన్నేతుర్ద్విషట్కం పునరపి చ దశ స్యందనస్యైకముక్తం
భూయోఽష్టౌ మండలస్య స్ఫుటమథ చ రవేర్వింశతిశ్శ్రీమయూరే-
ణేత్థం ప్రాతః పఠేద్యశ్శతకమనుదినం సూర్యసాయుజ్యమేతి ॥ 101 ॥

## తాత్పర్యము:

కిరణావళిని నలభైమూడు, అశ్వములను ఆఱు, సారథిని పన్నెండు, రథమును పదకొండు, మణ్డలమునెనిమిది, సూరుణ్ణి ఇరవై -ఇలా నూఱుశ్లోకములలో శ్రీమయూరమహాకవి విరచితమైన ఈ శతకమును ప్రాతఃకాలంలో ఎవడు పఠిస్తాడో, వాడు సూర్యసాయుజ్యమును పొందును.

## అనువాదపద్యము:

సీ. నలుబదిమూడుగా నలరిన పద్యాల- ముందుగా కిరణాళి మోహరింప
ఆపైన యశ్వాలనారైన సంఖ్యను- సారథిన్ రెట్టింపు సంఖ్యతోడ
ఏకాదశంబులనేపారగా తేఱు- మండలంబష్టక మండితముగ
వింశతిసంఖ్యలో వినుతించి సూర్యుని- కవిమయూరుండు తా కలిమిఁగూర్చె

గీ. అర్కశతకమ్ము పఠియింప ననుదినంబు
నాయురారోగ్య భోగములందియిలను
సర్వజనులును సుఖమును శాంతినంది
సూర్యసాయుజ్యమును గాంత్రు సూటిగాను.





శ్లో॥ శ్లోకాన్లోకస్య భూత్యై శతమితి రచితాన్ శ్రీమయూరేణ భక్త్యా
యుక్తశ్చైతాన్పఠేద్యస్సకృదపి పురుషస్సర్వపాపైర్విముక్తః
ఆరోగ్యం సత్కవిత్వం శ్రియమతులబలం కాంతిమాయుఃప్రకర్షం
విద్యామైశ్వర్యమర్థం వరమపి లభతే సోఽత్ర సూర్యప్రసాదాత్ ॥ 102 ॥

## తాత్పర్యము:

లోకకల్యాణ కామనతో ఈ విధంగా మయూరమహాకవిచే రచింపబడిన యీ నూఱుశ్లోకములను శ్రద్ధాభక్తులతో యెవరు చదువుతారో, వారు సర్వపాపములనుండి ముక్తులై, ఆరోగ్యాన్ని, సత్కవిత్వాన్ని, సంపదను, సాటిలేని బలమును, కాంతిని, ఆయురాధిక్యాన్ని, విద్యను, ఐశ్వర్యమును, పరమపురుషార్థమైన మోక్షమునుకూడనిచ్చుటనే సూర్యానుగ్రహముచేత పొందుదురు.

# ఫలశ్రుతి.

సీ. కవిమయూరుడు లోకకల్యాణమొనగూర్ప- శతకమిదిరచించె సంస్కృతమున
కవిమయూరుని కేక కర్ణపుటమ్ముల- నినదించుచుండగా నినునిఁదలచి
అహరహమ్మున నిత్యమంబకర్యమునకు-నలువరాణికిఁగూడ నతులఁజేసి
అవతారశర్మ తాననువదించెనుదాని- షడ్జసంవాదమన్ సరణి దాని.

గీ. భక్తినొకమారు దీనిని పఠనసేయ- ఆయురారోగ్య విజ్ఞానమతులదీప్తి
సంపదలు సిద్ధిబుద్ధులు సర్వమనగ- దినకరుండిచ్చు నిందు సందియము వలదు.

**శుభం భూయాత్**

# గ్రంథకర్త పరిచయం



పేరు :

'శ్రీపాదుక' ఆచార్య కొల్లూరు అవతారశర్మ

భార్య :

శ్రీమతి కొల్లూరు వెంకటరమణమ్మ

భాషాప్రవీణ, రాష్ట్రభాషాప్రవీణ, సంస్కృతభాషాకోవిద,

యం.ఏ.,తెలుగు

విశ్రాంత ప్రథమశ్రేణి తెలుగుపండితురాలు

జననీ జనకులు :

**స్వర్గీయ శ్రీ కొల్లూరు లక్ష్మణమూర్తిశర్మ** (ఆంధ్రవిశ్వవిద్యాలయ స్వర్ణపతకగ్రహీత)

(న్యాయ మీమాంసాలంకార వేదాంతశాస్త్ర పండితులు)

విజయనగర మహారాజా సంస్కృతకళాశాల మఱియు ఆంధ్ర విశ్వవిద్యాలయం

**స్వర్గీయ కొల్లూరు లక్ష్మీసోమిదమ్మ**

జన్మస్థలం : విజయనగరం

విద్యాభ్యాసం : డిగ్రీస్థాయి వరకు విజయనగర మహారాజావారి విద్యాసంస్థలు.

ఉన్నతవిద్య : ఆంధ్రవిశ్వవిద్యాలయం

విద్యార్హతలు : ఓరియంటల్ టైటిల్స్ - సాహిత్యవిద్యాప్రవీణ, రాష్ట్రభాషాప్రవీణ, సంస్కృతభాషా కోవిద, విద్యావారిధి (పి.హెచ్.డి.వ్యాకరణ- శిక్షాశాస్త్రములు)
డిగ్రీలు : ఎం.ఏ. (సంస్కృతం) ఎం.ఏ (తెలుగు), బియస్సీ., బి.యి.డి.,
పి.హెచ్.డి.(సంస్కృతం - అలంకారశాస్త్రం)

వృత్తి : రిటైర్డ్ రీడర్ (సంస్కృత విభాగాధ్యక్షుడు)
శ్రీపీఠికాపురాధీశ ప్రభుత్వడిగ్రీకళాశాల, కాకినాడ.

గ్రంథములు : పాణినీయ శిక్ష (తెలుగు) ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీవారి ఆర్థిక సహాయంతో ముద్రింపబడినది. ఆంధ్రదేశీయద్రావిడులచరిత్ర మఱియు సంస్కృతి, శ్రీ సారంగధరేశ్వరాలయచరిత్ర, 'జ్ఞానపూర్ణిమ' శివోఽహం శివోఽహం శివఃకేవలోహమ్, ఐశ్వర్యవిద్యాసర్వస్వము, ఆంజనేయముపాస్మహే, అయ్యప్పదర్శనం, శ్రీపాదుకాకల్పము, హనుమత్తత్త్వరహస్యోపనిషత్తు, సంపాదకీయాల షష్టిపూర్తిసంచిక, ఉపనయనం ఎందుకు?

అముద్రితములు : శ్రీబాలాశతకము, శ్రీచక్రసంచారిణీశతకము, సౌందర్యలహరి (తెలుగు పద్యానువాదము), శివానందలహరి (తెలుగు పద్యానువాదము) మందాక్రాన్తా సౌందర్యలహరి (సంస్కృతం), దశమహావిద్యాదిస్తోత్ర కదంబము.